శనివారం
19•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 114
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




## నూతన సీజేఐ బోబ్డే!



కేంద్రానికి ప్రతిపాదన లేఖ పంపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గొగోయ్

బోబ్డే ఎంపిక లాంఛనమే

వచ్చేనెల 17న పదవీ విరమణ చేయనున్న గొగోయ్

5

## కల్కి భగవాన్ ఐటీ పాట 500 కోట్లు



5

- ఆశ్రమాలు, వ్యాపారసంస్థల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు
- బయటపడ్డ నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, వజ్రాలు

**దక్షిణాది** రాష్ట్రాల్లో 40 ప్రాంతాల్లోని కల్కి ఆశ్రమాలు, నివాసాలు, వ్యాపార సంస్థలపై ఐటీ సోదాల్లో అధికారులు భారీగా స్వదేశీ, విదేశీ కరెన్సీని, కిలోలకొద్దీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.93 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో రూ.43.9 కోట్ల స్వదేశీ కరెన్సీ ఉన్నట్టు చెప్పారు. విదేశీ కరెన్సీలో అత్యధికంగా రూ.18 కోట్లు విలువ చేసే 25 లక్షల అమెరికన్ డాలర్లు ఉన్నాయన్నారు. వీటితోపాటు 88 కిలోల బంగారం (విలువ రూ.26 కోట్లు), 1271 క్యారట్ల వజ్రాలను (విలువ రూ.5 కోట్లు) స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.



## 22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె




మద్దతు పలికిన తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య

9

# చర్చలు జరుపండి

### 28వ తేదీనాటికి నివేదిక ఇవ్వండి • విలీనం షరతును కార్మికసంఘాలు పక్కనపెట్టాలి

ఆర్థికభారంలేని సమస్యలను సంస్థ పరిశీలించాలి

ఆర్టీసీ యాజమాన్యం, కార్మికసంఘాలకు హైకోర్టు ఆదేశం

కన్సీలియేషన్ ప్రక్రియ మధ్యలో ఉండగా సమ్మెకు వెళ్లారు

ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ ప్రకారం వ్యవహరిస్తాం

అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు

బస్సులన్నీ రోడ్లపైకి • సాధారణ స్థితికి సర్వీసులు

రోడ్డెక్కిన 73.82% బస్సులు • క్రమంగా పెరుగుతున్న సేవలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రజలకోసం చర్చలు జరుపాలని ఆర్టీసీ, కార్మిక సంఘాలను రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. చర్చల సారాంశంపై 28వ తేదీన తమకు నివేదిక ఇవ్వాలని పేర్కొన్నది. ఆర్టీసీ సమ్మెపై శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. విలీనం షరతును పక్కన పెట్టాలని కార్మిక సంఘాలకు సూచించింది. దీనికి అంగీకరిస్తూ.. ఆ షరతును తొలగిస్తున్నట్టు కార్మికసంఘాల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కన్సీలియేషన్ ప్రక్రియ మధ్యలో కార్మిక సంఘాలు సమ్మెకు వెళ్లాయని, ఈ నేపథ్యంలో పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం

మిగతా 2వ పేజీలో



శుక్రవారం మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

### నేడు రాష్ట్ర బంద్ నేపథ్యంలో భద్రతాఏర్పాట్లు చేసిన పోలీసులు

## కోర్టు ఆదేశాలతో జరిగేదేమిటి!

- లిఖితపూర్వక ఆదేశాలు అందాకే చర్చలు
- ఎక్కువ డిమాండ్లు ఆర్థికపరమైనవే
- సెప్టెంబర్ జీతాల చెల్లింపులకే డబ్బుల్లేవు
- ముంచుకొస్తున్న అక్టోబర్ జీతాలు
- డిమాండ్లు పరిష్కరించే పరిస్థితి కూడా లేదు
- సంఘాలపై కార్మికుల్లో ఆగ్రహం
- పరిస్థితిని తెగేదాకా లాగారంటూ నిప్పులు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హైకోర్టు ఆదేశాలతో ఆర్టీసీ యాజమాన్యం కార్మికసంఘాలతో చర్చలు జరిపినా ఎటువంటి పరిష్కారం లభించే అవకాశం కనిపించటం లేదని ఆర్థికనిపుణులు చెప్తున్నారు. చర్చలు జరుపాలని కోర్టు మౌఖికంగా చెప్పినప్పటికీ లిఖితపూర్వక ఆదేశాలు అందవలసి ఉంటుంది. ఆ తర్వాతే ఆర్టీసీ యాజమాన్యం, కార్మికసంఘాలు చర్చలకు కూర్చునే అవకాశం ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీ యాజమాన్యం సమస్యలను పరిష్కరించగలుగుతుందా? కార్మికులకు ఏమైనా హామీలు ఇవ్వగలుగుతుందా? అనేది సందేహమేనని

మిగతా 2వ పేజీలో



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం నాంసానిపల్లిలో వర్షాలకు నేలవాలిన వరి పంట

# రెక్కల కష్టం నీళ్లపాలు

- వర్షానికి దెబ్బతిన్న పంటలు
- నేల వాలిన వరి, తడిసిన మక్క, పత్తి
- ఆరు జిల్లాల్లో 13,994 ఎకరాల్లో నష్టం
- క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేస్తున్న అధికారులు

7

**రాష్ట్రంలోని** పలు జిల్లాల్లో గురువారం కురిసిన వర్షానికి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వరంగల్ అర్బన్, నిర్మల్ జిల్లాల్లో వరి నేలవాలగా, మక్కలు తడిసి ముద్దయ్యాయి. అక్కడక్కడ సోయాబీన్, పత్తికి నష్టంవాటిల్లింది. ఆయా జిల్లాల్లో ప్రాథమిక సమాచారం మేరకు మొత్తం 13,994 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా అందులో 13,942 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మక్కలు, 30 ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఒక్క కరీంనగర్‌లోనే మొత్తం 11,569 ఎకరాల్లో వరి, మక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. సమాచారం అందుకున్న వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నష్టం అంచనా వేస్తున్నారు. ఆ వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

## టీఎస్‌ఐపాస్ జోష్

రాష్ట్రంలో 11 వేల పరిశ్రమలు..

1.7 లక్షలకోట్ల పెట్టుబడులు

'మ్యాన్ ఈఎక్స్‌ఈ' సదస్సు ముగింపులో మంత్రి కేటీఆర్

2



## పాల నాణ్యతకు తిలోదకాలు

**12%** నమూనాలలో కల్తీ ఆనవాళ్లు

- శుద్ధిచేసిన పాలలో అఫ్లటాక్సిన్, పురుగుమందుల అవశేషాలు
- నిర్దేశిత ప్రమాణాలను అందుకోని 37.7 శాతం శాంపిళ్లు
- వీటిలో అగ్రశ్రేణి కంపెనీల బ్రాండ్లు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ అధ్యయనంలో వెల్లడి

5



హుజూర్‌నగర్ పట్టణంలో ప్రచారం చేస్తున్న టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, పక్కన ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## హుజూర్‌నగర్‌లో నేడు ప్రచారానికి తెర

- 21న పోలింగ్.. ఊరూరా గులాబీ జోష్
- ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన
- మెజార్టీపైనే టీఆర్‌ఎస్ నాయకుల దృష్టి

3

## కాలేజీలు, వర్సిటీల్లో సెల్‌ఫోన్ నిషేధం!

యూపీ సర్కారు నిర్ణయం

విద్యార్థులతోపాటు బోధనా సిబ్బందికి కూడా వర్తింపు

**లక్నో, అక్టోబర్ 18:** ఉత్తరప్రదేశ్‌లోని అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి శుక్రవారం సర్క్యులర్ జారీచేసింది. విద్యార్థులతోపాటు విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లోని బోధనా సిబ్బందికి కూడా ఈ నిషేధం వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని.. యూనివర్సిటీలు, కాలేజీల్లో వారికి మెరుగైన బోధనా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నత విద్యామండలి ఉత్తర్వుల్లో పేర్కొంది. కళాశాలలో ఉన్నప్పుడు విద్యార్థులు, టీచర్లు మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయడాన్ని గమనించిన సర్కారు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు సమాచారం. కాగా ప్రభుత్వ అధికారిక సమావేశాలు, మంత్రివర్గ సమావేశాల్లో సెల్‌ఫోన్ల వాడకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఇప్పటికే నిషేధించారు.

## లిక్కర్ షాపులకు లక్కీడ్రా పూర్తి

రాష్ట్రంలో 2,182 వైన్స్‌ల కేటాయింపు

తక్కువ దరఖాస్తులొచ్చిన 29 దుకాణాలకు డ్రా వాయిదా

3

## కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఆరుగురు మిత్రులు గల్లంతు

సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చాకిరాల వద్ద ఘటన

7

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారంధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 370.00 | రంగారెడ్డి | 370.00 |
| మెదక్ | 370.00 | కరీంనగర్ | 373.00 |
| వరంగల్ | 373.00 | చిల్లర ధర | 4.30 |






# టీఎస్‌జెన్‌కోకు సాప్ ఏస్ అవార్డు

- శుభాకాంక్షలు తెలిపిన సీఎండీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యాపారం, నిర్వహణలో మొబైల్ టెక్నాలజీ వినియోగానికిగాను టీఎస్‌జెన్‌కోకు సాప్ ఏస్ (అవార్డ్ ఫర్ కస్టమర్ ఎక్స్‌లెన్స్)-2019 అవార్డు వరించింది. ముంబైలోని పార్క్ హయత్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో టీఎస్‌జెన్‌కో తరఫున చీఫ్ జనరల్ మేనేజర్ రమేశ్ ఈ అవార్డును అందుకొన్నారు. ఈ సందర్భంగా 'టీఎస్ శక్తి' ప్రాజెక్టు బృందానికి ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. సాప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో 'టీఎస్ శక్తి' ప్రాజెక్టు ద్వారా అన్ని ప్లాంట్లు, కార్పొరేట్ ఆఫీస్‌లో కేంద్రీకృత ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ ను జెన్‌కో అమలుచేస్తున్నది. 2013 నుంచి టీఎస్‌జెన్‌కో స్టేషన్లు, అన్ని హెడ్ క్వార్టర్లు సాప్ సొల్యూషన్స్‌ని ఉపయోగిస్తున్నాయి. సంస్థలోని అన్ని ప్రధాన విధులు అనుసంధానం అవడంతోపాటు, సమర్థ నిర్ణయాలు తీసుకునేందుకు రియల్ టైమ్ డాటా అందుబాటులోకి వచ్చింది. సాప్ మొబైల్ అప్లికేషన్ ద్వారా విద్యుత్ డిమాండ్, రిజర్వాయర్ల నీటిమట్టాలు ఒకే వేదిక నుంచి తెలుసుకునేందుకు వీలుపడుతున్నది.


సాప్ ఏస్-2019 అవార్డు అందుకొన్న టీఎస్ శక్తి ప్రాజెక్ట్ బృందం సభ్యులను అభినందిస్తున్న తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు

# న్యాక్‌కు నేషనల్ లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్ అవార్డు

- బీహార్ మంత్రి చేతులమీదుగా ప్రదానం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నిరుద్యోగులకు నైపుణ్యం, శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్న న్యాక్‌కు (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) నేషనల్ లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. దాదాపు 24 వేలమందికి శిక్షణ ఇచ్చినందుకు అసోచామ్ సంస్థ స్కిల్‌డెవలప్‌మెంట్ అండ్ ఒకేషనల్ ట్రైనింగ్ విభాగంలో న్యాక్‌ను ఈ అవార్డుకు ఎంపికచేసింది. గురువారం బీహార్ రాజధాని పాట్నాలో గవర్నర్ ఫగు చౌహాన్ సమక్షంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా, ఎంపీ సీపీ ఠాకూర్ చేతుల మీదుగా న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ అవార్డును అందుకొన్నారు. న్యాక్ సంస్థ సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఫినిషింగ్ స్కూల్, పీజీ వంటి ప్రోగ్రాంలను అందిస్తున్నది. న్యాక్‌లో శిక్షణ పొందినవారు ఎల్‌అండ్‌టీ, మైహోం, టాటా కన్సల్టెన్సీ, ఆర్క్ ఇన్‌ఫ్రా, ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్, షాపూర్ జీ పల్లోంజీ, ప్రెస్టేజ్ వంటి ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో ఉద్యోగాలు పొందుతున్నారు.


బీహార్ మంత్రి విజయ్‌కుమార్ నుంచి అవార్డు అందుకొంటున్న న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ



# కోర్టు ఆదేశాలతో జరిగేదేమిటి!

మొదటిపేజీ తరువాయి...

అంటున్నారు. కార్మికులకు సెప్టెంబర్ నెల జీతం చెల్లించాలని కోర్టు ఇంతకుముందే చెప్పింది. ఇప్పుడు అక్టోబర్ కూడా మీదపడి వస్తున్నది. సెప్టెంబర్ జీతం చెల్లించడానికే ఆర్టీసీ వద్ద డబ్బులేదు. చెల్లించాల్సిన నెల జీతాల మొత్తం రూ.239 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.8 కోట్లు మాత్రమే కార్పొరేషన్ వద్ద ఉన్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అక్టోబర్ జీతం సంగతి చెప్పనవసరమే లేదు.

**డిమాండ్లలో అత్యధికం ఆర్థిక అంశాలే**

కార్మికసంఘాలు పెట్టిన డిమాండ్లలో అత్యధిక శాతం ఆర్థిక వ్యవహారాలతో ముడిపడినవే. ప్రభుత్వంలో విలీనం అంశం ఆర్టీసీ యాజమాన్యానికి సంబంధం లేదు. వేతన సవరణ వంటి డిమాండ్లను తీర్చడానికి ఆర్టీసీ ప్రస్తుత ఆర్థికపరిస్థితి ఎంతమాత్రం సహకరించే అవకాశం లేదు. నెలవారీ రుణ వాయిదాలు, ఉద్యోగుల సేవింగ్సు డబ్బులు చెల్లించడానికి కూడా కార్పొరేషన్ వద్ద డబ్బు లేదు. ఇటువంటి పరిస్థితుల్లో చర్చలు జరిపినా ఆర్టీసీ యాజమాన్యం ఒక్క డిమాండు కూడా అంగీకరించే అవకాశం కనిపించటం లేదని నిపుణులు చెప్తున్నారు. అంటే సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారవుతున్నది. ఇటూఅటూ మాట్లాడేలోపు అక్టోబర్ కూడా అయిపోతుంది. అప్పుడు కార్పొరేషన్ మరింత దిక్కుతోచని స్థితిలో పడిపోతుంది. సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. ఆర్టీసీ కార్మికులు వీధిన పడవలసిన పరిస్థితి వస్తుంది. కొందరు కార్మికులు ఇప్పటికే సంఘాల నాయకుల పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వాస్తవాలు చెప్పకుండా సమస్యను ఇంతదూరం తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికయినా సమస్యను తెగేదాకా లాగకుండా ఉంటే మంచిదని వారు భావిస్తున్నారు.

# ప్రజలకోసం చర్చించండి

**28వ తేదీనాటికి నివేదిక ఇవ్వండి**

- ఆర్టీసీ యాజమాన్యం, కార్మికసంఘాలకు హైకోర్టు ఆదేశం
- విలీనం షరతును కార్మికసంఘాలు పక్కనపెట్టాలి
- ఆర్థికభారంలేని సమస్యలను సంస్థ పరిశీలించాలి
- కన్సిలియేషన్ మధ్యలో ఉండగా సమ్మెకు వెళ్లారు
- ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ ప్రకారం వ్యవహరిస్తాం
- అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు
- 'విలీనం' షరతు ఉపసంహరించుకున్న కార్మికసంఘాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల సమ్మెవల్ల సామాన్య ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ యాజమాన్యం, కార్మికసంఘాలు చర్చలు నిర్వహించాలని హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. మూడో ప్రతివాదిగా ఉన్న ఆర్టీసీ యాజమాన్యం.. టీఎంయూ, ఆర్టీసీ కార్మికసంఘాల జేఏసీని చర్చలకు ఆహ్వానించాలని ఆదేశించింది. సానుకూల దృక్పథంతో చర్చలు జరిపి ఈ నెల 28నాటికి.. చర్చల సారాంశంపై నివేదిక అందజేయాలని పేర్కొన్నది. ఆర్టీసీ సమ్మెను విరమింపజేసి ప్రజల ఇబ్బందులు తొలగించేలా ఆదేశాలు జారీచేయాలని దాఖలైన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. హైదరాబాద్‌లో ఏసీ గదుల్లో ఉండేవారికి ఏమీ తెలియదని, సమ్మె కారణంగా ఆదిలాబాద్ సహా మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు దవాఖానలకు వెళ్లలేకపోతున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ప్రజారవాణాపై ఆధారపడి కార్యాలయాలు, ఇతర పనులకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నది. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లలో ఆర్థికాంశాలు, భారీ ఖర్చుతో సంబంధం లేని అంశాలు చాలా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. ప్రభుత్వం ఎంత శక్తిమంతంగా ఉంటే.. అదేస్థాయిలో ఉదారస్వభావాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నది. ప్రభుత్వం, ఆర్టీసీ, కార్మికులు అంతా ఒక కుటుంబంలా భావించాలని సూచించింది.

**ఆర్థికభారంలేని సమస్యలు పరిష్కరించండి**

గతంలో తాము ఆదేశించిన విధంగా ఆర్టీసీకి ఎండీని ఎందుకు నియమించలేదని అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జే రామచంద్రరావును ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుత ఇంచార్జి ఎండీ అనుభవశాలి అని, ఈ సంక్షోభ సమయంలో కొత్తవారిని నియమించడం వల్ల ఇబ్బందులు వస్తాయని, సమస్య పరిష్కారం కోసం ఇంచార్జి ఎండీని కొనసాగిస్తున్నామని ఏఏజీ తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల ఇతర డిమాండ్ల చార్ట్‌ను పరిశీలించిన ధర్మాసనం.. ఆయా రీజియన్లకు ఈడీల నియామకం, తార్నాకలోని ఆర్టీసీ హాస్పిటల్, డిస్పెన్సరీల్లో మందుల సరఫరా, మెరుగైన వైద్యం, హెచ్‌ఆర్‌ఏ పెంపు, డిపోల్లో నూతన స్పేర్‌పార్ట్స్ సరఫరా, యంత్రాల సరఫరా, ఆర్టీసీ కార్మికులకు ఆసరా పింఛన్, తెల్లరేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి అంశాలను పరిశీలించాలని, 45 డిమాండ్లలో ఆర్థికంగా భారంపడని డిమాండ్లు పరిష్కరించాలని ఆర్టీసీ యాజమాన్యానికి సూచించింది.



**సమ్మె నివారణకు అన్ని చర్యలు తీసుకున్నాం: ఏఏజీ**

సమ్మె నివారణకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకున్నామని ఏఏజీ జే రామచంద్రరావు హైకోర్టుకు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా 87% బస్సులను నడిపిస్తున్నామని నివేదించారు. అన్ని విద్యాసంస్థలు ఈ నెల 21 నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయని స్పష్టంచేశారు. ఆర్టీసీ ఆర్థిక స్థితి అధ్వానంగా ఉన్నందున, కార్మికుల డిమాండ్లలో కొన్నింటి పరిష్కారానికి చర్యలు చేపట్టే పరిస్థితి లేదని, ఒకవేళ చేపడితే సంస్థ మరింత నష్టాల్లో, అప్పుల్లో కూరుకుపోతుందని తెలిపారు. సమ్మె నివారణకు కార్మికసంఘాలతో చర్చలు జరిపేందుకు చిత్తశుద్ధితో వ్యవహరించామని, ఐఏఎస్‌ల కమిటీని కూడా నియమించామని తెలిపారు. మొత్తం 45 డిమాండ్లలో మొదటి డిమాండ్ అయిన 'ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం' అంశాన్ని తేల్చాకే మిగతా అంశాలపై చర్చలు జరుపుతామని కార్మికసంఘాలు షరతు పెట్టాయని తెలిపారు. కన్సీలియేషన్ ప్రక్రియ మొదలైన తర్వాత.. చర్చలు మధ్యలో ఉండగా చట్టవిరుద్ధంగా సమ్మెకు వెళ్లారని పేర్కొన్నారు. కన్సీలియేషన్ ప్రక్రియ విఫలం అయినట్టు కన్సీలియేషన్ అధికారి ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. ఈ మేరకు పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం ప్రభుత్వం విషయాన్ని లేబర్ కోర్టు లేదా ట్రిబ్యునల్‌కు రిఫర్ చేస్తుందని వెల్లడించారు. ఆర్టీసీకి, కార్మికసంఘాలకు మధ్య తలెత్తిన ఈ వివాదంలో ప్రభుత్వం చేయడానికి ఏమీలేదని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 'ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం' అన్న మొదటి డిమాండ్‌పై షరతులు లేకుండా చర్చలు జరిపేందుకు కార్మికసంఘాలు సంసిద్ధత వ్యక్తంచేశాయని, చర్చలకు సంస్థ సిద్ధంగా ఉన్నదా? అని ఏఏజీని ప్రశ్నించింది. దీనికి ఏఏజీ సమాధానం చెప్తూ ఒక్కసారి కన్సీలియేషన్ ప్రక్రియ విఫలం అయిన తర్వాత కోర్టు బయట చర్చలు జరుపలేమని, ఐడీ యాక్ట్ ప్రకారం లేబర్ కోర్టు లేదా ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు. కన్సీలియేషన్ విఫలం అయినంత మాత్రాన కోర్టు బయట చర్చలు జరుపొద్దనే నిషేధం చట్టంలో ఎక్కడా లేదన్న ధర్మాసనం.. కార్మికసంఘాలను ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు ఆహ్వానించాలని ఆదేశాలు జారీచేసింది.

**విలీనంపై షరతులను ఉపసంహరించుకున్నట్టు వెల్లడి**

45 డిమాండ్లలో మొదటిదైన 'ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం' అంశాన్ని తేల్చిన తర్వాతే మిగతా అంశాలపై చర్చలు జరుపుతామన్న షరతును కార్మికసంఘాలు వెనక్కు తీసుకున్నాయి. మొదటి డిమాండ్ విషయంలో కార్మికసంఘాలు మొండి వైఖరిని ప్రదర్శించాయని ఏఏజీ జే రామచంద్రరావు తన వాదనల సందర్భంగా లేవనెత్తారు. దీనిపై దృష్టిసారించిన ధర్మాసనం.. షరతులు లేకుండా చర్చలకు వెళ్లాలని కార్మికసంఘాలకు సూచించింది. ఈ మేరకు కార్మికసంఘాల తరఫు న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి.. విలీనం అంశంపై షరతును ఉపసంహరించుకుంటున్నామని, ప్రస్తుతం అన్ని అంశాలపై చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని ధర్మాసనానికి తెలిపారు. దీంతో ఇరువర్గాలు చర్చలు జరుపాలని, ఆర్టీసీ యాజమాన్యం కార్మికసంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది.

# టీఎస్‌ఐపాస్ జోష్

- రాష్ట్రంలో 11 వేల పరిశ్రమలు.. 1.7 లక్షలకోట్ల పెట్టుబడులు
- 13 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి
- తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూలం
- 'మ్యాన్ ఈఎక్స్‌ఈ' సదస్సు ముగింపులో మంత్రి కేటీఆర్


హెచ్‌ఐసీసీలో మ్యాన్ ఈఎక్స్‌ఈ-2019 సదస్సు ముగింపు కార్యక్రమంలో ఉత్తమ పరిశ్రమ అవార్డు అందజేస్తున్న రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో టీఎస్‌ఐపాస్ చట్టాన్ని తీసుకొచ్చి ఐదేండ్లు కావస్తున్నదని, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకొంటున్న ఈ చట్టం అమల్లోకి వచ్చాక రాష్ట్రంలోకి 11 వేల కొత్త పరిశ్రమలు, రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఈ పరిశ్రమల్లో 13 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. చిన్ననాటి ఆలోచనలే కాలక్రమంలో గొప్ప ఆవిష్కరణలకు దారితీస్తాయని, కనుక బాల్యదశలోనే చిన్నారుల్లో జిజ్ఞాసను పెంపొందించాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. హెచ్‌ఐసీసీలో తెలంగాణ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా నిర్వహించిన 15వ ఎడిషన్ మ్యాన్ ఈఎక్స్‌ఈ – 2019 సదస్సు ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో పెట్టుబడులకు భారత్ అనువైన దేశమని, కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్పొరేట్ పన్నును తగ్గించినందున భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన తరుణమని, దేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత అనుకూల ప్రాంతమని తెలిపారు. 14.9 శాతం అభివృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే ముందున్నదన్నారు. దీనితోపాటు తెలంగాణలో తలసరి ఆదాయం రూ.2.06 లక్షలు ఉండగా.. జాతీయ సగటు రూ.1.26 లక్షలు మాత్రమేనని, ఏ విధంగా చూసినా తెలంగాణ అన్ని విధాలుగా ముందున్నదని మంత్రి కేటీఆర్ వివరించారు.

**ఇక ప్రతి ఇంట్లో ఓ ఇన్నోవేటర్**

గ్రామీణ యువతలోని ప్రతిభను, నూతన ఆలోచనలను గుర్తించడంలో 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమం ఎంతగానో దోహదం చేసిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రూపొందించిన పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్‌ను, సీఐఐని ఆయన అభినందిస్తూ.. ఇక ప్రతి ఇంట్లో ఓ ఇన్నోవేటర్ ఉంటారని అన్నారు. ఇన్నోవేటర్లు పెద్ద కంపెనీల మనసులను గెలుచుకున్నారని మంత్రి కొనియాడారు. ట్రిపుల్'ఐ'లు ఎంతో కీలకమైనవని, వీటిలో మొదటిది ఇన్నోవేషన్, రెండోది ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మూడోది ఇంక్లూజివ్ గ్రోత్ అని తెలిపారు. పరిశ్రమలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఉన్నత విద్యామండలి పరిశ్రమలశాఖతో కలిసి పనిచేయాలని, కంపెనీలు సామాజిక బాధ్యత కింద సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జాతీయస్థాయిలో ఏర్పాటుచేసిన స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియాకు తోడుగా తెలంగాణలో టీహబ్, వీహబ్, టీవర్క్స్ లాంటివి ఏర్పాటుచేసి ఇతర దేశాలతో పోటీపడటమే కాకుండా వారిని మించగలిగే స్థాయికి ఎదుగుతున్నామన్నారు. టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయన్నారు. తెలంగాణను ప్రగతిశీలక (ప్రోగ్రెసివ్) రాష్ట్రంగా మంత్రి కేటీఆర్ అభివర్ణిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సీఐఐకి పిలుపునిచ్చారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా 'టాస్క్' ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, రాష్ట్రంలో ఏరోస్పేస్ సంస్థను స్థాపించిన ఫ్రెంచ్ కంపెనీకి అవసరమైన మానవవనరులను సమకూర్చేందుకు 'టాస్క్' ద్వారా యువతకు శిక్షణ ఇప్పించి నైపుణ్యమున్న సిబ్బందిని అందించామని వివరించారు. మూడు సంవత్సరాల క్రితం జపాన్‌లో సుజుకి మోటార్స్ సంస్థ ఏర్పాటుచేసిన మ్యూజియాన్ని తాను సందర్శించినప్పుడు ఏడెనిమిదేండ్ల చిన్నారులు (మూడు, నాలుగు తరగతుల విద్యార్థులు) కూడా అక్కడికి వచ్చారని, అంత చిన్న పిల్లలకు ఇక్కడ ఏమి అర్థమవుతుందని నిర్వాహకులను అడిగితే.. పిల్లల్లో చిన్ననాటి నుంచే జిజ్ఞాసను, నూతన ఆలోచనలను పెంపొందించాలనే లక్ష్యంతోనే ఇలాంటివాటిని ఏర్పాటుచేస్తామని తెలిపారని మంత్రి కేటీఆర్ చెప్పారు. అనంతరం 'ఇంటింటా ఇన్నోవేటర్' అవార్డులను మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సీఐఐ అధ్యక్షుడు రాజు ప్రదానం చేశారు. వీటితోపాటుగా సీఐఐ ఉత్తమ పరిశ్రమల అవార్డులను ప్రకటించి మంత్రి కేటీఆర్ చేతులమీదుగా వాటిని బహూకరించింది. ఈ కార్యక్రమంలో టీఐహెచ్‌సీఎల్ సలహాదారు ఎర్రం రాజు, ఐటీసీ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సంజయ్‌సింగ్, నాట్కో డైరెక్టర్ బీఆర్ రెడ్డి, మహీంద్ర అండ్ మహీంద్రా ఉపాధ్యక్షుడు వీఎస్ రాం, సీఐఐ సహ కన్వీనర్ శోభాదీక్షిత్, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ వీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**ముహూర్తం**


సూర్యోదయం: 6.11 గంటలకు


సూర్యాస్తమయం: 5.48 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, పంచమి ఉదయం 7.43 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: మృగశిర సాయంత్రం 5.39 వరకు, తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: ఉదయం 8.36 నుంచి 10.15 వరకు, రాహుకాలం: ఉదయం 9.05 నుంచి 10.32 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.11 నుంచి 7.44 వరకు, వర్జ్యం: అర్ధరాత్రి 2.08 నుంచి తె.జా. 3.44 వరకు.

# అధిక ఉద్యోగులే భారం

- పైస్థాయి ఉద్యోగులదే ఆర్టీసీలో ఇష్టారాజ్యం
- పనిచేసేవారికంటే.. చెప్పేవారే ఎక్కువ
- నష్టాల్లో తిలాపాపం తలాపిడికెడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ నష్టాల ఊబి వెనుక అనేక కారణాలు వెలుగుచూస్తున్నాయి. ఆర్టీసీకి రాష్ట్రంలోని 11 రీజియన్లు 24 డివిజన్ల పరిధిలో మొత్తం 97 డిపోలున్నాయి. అందులో ప్రభుత్వానికి చెందినవి 8,360 బస్సులు కాగా, కిరాయిబస్సులు 2100 కలుపుకొని మొత్తం 10,460 బస్సులు సేవలందిస్తున్నాయి. ఆర్టీసీలో అధిక సంఖ్యలో కార్మికులు ఉండటంతో వారికి చెల్లించే వేతనాలు సంస్థ నష్టాలకు ఒక ప్రధాన కారణంగా అధికారులు చెప్తున్నారు. పనిచేసేవారికంటే పనులు చెప్పేవారు అధికంగా ఉండటం, పైస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో.. తిలాపాపం తలా పిడికెడు అన్న చందాన ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోతున్నదని అంటున్నారు. ఉదాహరణకు.. కర్ణాటక ఆర్టీసీలో సిబ్బంది నిష్పత్తి ఒక బస్సుకు 4.73% ఉంటే, మన ఆర్టీసీలో ఒక్కో బస్సుకు 5.3% మంది పనిచేస్తున్నారు. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లలో ఇది కేవలం 2.7%గా ఉండటం గమనార్హం. సిబ్బందిని తగ్గించే క్రమంలో ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్‌లు, సూపర్‌లగ్జరీలు, ఏసీ, గరుడ తదితర బస్సులకు కండక్టర్ల సేవలను సంస్థ తగ్గించింది. ఆయా బస్సుల్లో డ్రైవర్లే కండక్టర్ల విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా ఒక్కో బస్సుకు 5.3% సిబ్బంది ఉండటంపై ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

**పదివేలమందికిపైగా వేరే పనుల్లో**

కొంత లోతుగా పరిశీలిస్తే బస్సుల్లో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్ల కంటే ఇతర సిబ్బందే అధికంగా ఉన్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో దాదాపు మూడువేల బస్సులకు కండక్టర్లు లేరు. వాటిలో డ్రైవర్లే టికెట్లు ఇస్తుంటారు. కొన్నిచోట్ల కౌంటర్లలోనే టికెట్లు జారీచేస్తున్నారు. ఇలా కండక్టర్‌రహిత వ్యవస్థను గత కొన్నేండ్లుగా నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే డ్రైవర్లు, కండక్టర్లు, డిపో వర్కర్లు మినహా అదనంగా ఉన్న ఇతర అధికారులు, సిబ్బంది జీతాలు, వారి ఖర్చులు అధికంగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీలో వివిధ హోదాల్లో 280 మంది ఆఫీసర్లు పనిచేస్తుండగా, దాదాపు ఏడువేలమంది అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ ఉన్నారు. మరో ఐదారువేల మంది కండక్టర్లు, డ్రైవర్లను ఇతరపనులకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలా దాదాపు 10 వేల పైచిలుకు సిబ్బంది బస్సులు, డిపోలు, గ్యారేజీల పను లు నిర్వహించే బదులు సంస్థకు పెద్దగా లాభం చేకూర్చని పనులు చేస్తున్నట్టు సమాచారం.

**పైస్థాయివారికి అధిక వేతనాలు**

ఆర్టీసీలో డిపో మేనేజర్ పైస్థాయి ఉద్యోగుల జీతాలు అత్యధికంగా ఉన్నాయనే విమర్శలు సైతం ఉన్నాయి. వీరికి ఇచ్చే అన్ని రకాల అలవెన్సులు కూడా కలుపుకొంటే భారీఎత్తున వారికి వెళుతున్నాయని అంటున్నారు. కొందరు సిబ్బందిని సొంతపనులకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ వాహనాలను విపరీతంగా వినియోగించడంతోపాటు, ఆర్టీసీ సొమ్మును ఇష్టారీతిగా ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి వ్యవహారాలన్నీ ఆర్టీసీకి గుదిబండగా మారాయన్న వాదన బలంగా వినిపిస్తున్నది. పూర్తిస్థాయిలో విశ్లేషణ జరిగితే అసలు విషయాలు బయటపడుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# సమ్మెకాలంలో మెట్రో సేవలు

- గమ్యస్థానాలకు 40 లక్షల మంది చేరవేత
- జీర్ణించుకోలేక బెదిరింపులకు దిగుతున్న కొన్నివర్గాలు
- మెట్రోకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో దుష్ప్రచారం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ మెట్రోరైలు రికార్డులను తిరగరాస్తున్నది. సమ్మె ప్రారంభమైననాటి నుంచి ఇప్పటివరకు.. రోజుకు సగటున 3.5 లక్షలమంది చొప్పున మొత్తం 40 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చినట్టు మెట్రోరైలు అధికారులు తెలిపారు. ఆర్టీసీ సమ్మె భారాన్ని మోస్తున్న మెట్రోరైలు.. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఫ్రీక్వెన్సీ పెంచి మూడు నిమిషాలకో రైలు నడిపిస్తున్నది. రోడ్డు రవాణా వ్యవస్థకు సమాంతరంగా సేవలందిస్తుండటంతో జీర్ణించుకోలేని కొన్నిశక్తులు వాట్సాప్, ట్విట్టర్ వేదికగా సోషల్‌మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. 'డోంట్ ట్రావెల్ బై మెట్రో' వంటి గ్రూపుల్లో మెట్రోకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నాయి. ఆర్టీసీ సమ్మెను నిర్వీర్యం చేయడానికి మెట్రో కారణమంటూ, సర్వీసులు తగ్గించాలని బెదిరింపులకు కూడా దిగుతున్నట్టు సమాచారం. అయినప్పటికీ, మెట్రోరైలు సంస్థ వెరవకుండా ప్రతిరోజూ 810 ట్రిప్పులను నడిపిస్తున్నది. ఎంత రద్దీ ఉన్నా.. 14 రోజులుగా పక్కా ప్రణాళికతో అర్ధరాత్రి వరకు సేవలు అందిస్తున్నప్పటికీ, వ్యతిరేక ప్రచారం నిర్వహిస్తున్నారని అధికారులు వాపోతున్నారు.

# ఓయూలో నేటి పరీక్షలు వాయిదా

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్ర బంద్ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో శనివారం నిర్వహించాల్సిన పరీక్షలను ముందుజాగ్రత్తగా వాయిదా వేస్తున్నట్టు ఓయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి పరీక్షల తేదీలను త్వరలో వెల్లడిస్తామని ప్రకటించారు.

# చర్చలు జరుపండి

మొదటిపేజీ తరువాయి...

వ్యవహరిస్తామని అదనపు అడ్వొకేట్ జనరల్ జే రామచంద్రరావు హైకోర్టు తెలిపారు. ఇదిలా ఉంటే.. సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ సూచనతో ఆర్టీసీ తీసుకుంటున్న చర్యలతో క్రమంగా సాధారణ పరిస్థితి నెలకొంటున్నది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేస్తున్న ఏర్పాట్లు మంచి ఫలితాలిస్తున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలు గమ్యస్థానాలకు చేరుతున్నారు. ఆయా జిల్లాల్లో రీజినల్ మేనేజర్ల పర్యవేక్షణలో డిపో మేనేజర్లు తాత్కాలిక డ్రైవర్, కండక్టర్, ఇతర సిబ్బందిని ఎంపికచేసి సాధ్యమైనంత వరకు బస్సులను తిప్పడానికి చర్యలు తీసుకుంటున్నారు. వంద శాతం బస్సులను నడిపించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజారవాణా సౌకర్యాలను కల్పించడంలో సంస్థ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ రోజువారీగా సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలిస్తున్నారు. హైదరాబాద్‌లోనూ ప్రజారవాణా సౌకర్యాన్ని పెంచే దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. శుక్రవారం మొత్తం 73.82 శాతంతో 8,949 బస్సులు నడిచినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 6,846 ఆర్టీసీ బస్సులు, 2,103 అద్దె బస్సులు ఉన్నాయి. 4,623 మంది తాత్కాలిక డ్రైవర్లు, 6,606 మంది తాత్కాలిక కండక్టర్లు విధులు నిర్వర్తించారు. 1921 బస్సుల్లో టికెటింగ్ విధానం, 1690 బస్సుల్లో టిమ్స్ ద్వారా టికెట్లు జారీచేసినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. అతి త్వరలో వందశాతం బస్సులు నడపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం సుమారు రెండువేల బస్సులు రోడ్డెక్కినట్టు అధికారులు తెలిపారు.

**బంద్‌ను విజయవంతం చేయండి: అశ్వత్థామరెడ్డి**

శనివారం తలపెట్టిన బంద్‌ను అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని ఆర్టీసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి కోరారు. ఆర్టీసీలో ప్రతి ఒక్కరు నాయకులేనని, ప్రజారవాణా వ్యవస్థను కాపాడేందుకే తమ పోరాటమని చెప్పారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన సకల జనుల సమరభేరి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల హక్కులను కాపాడాలని, డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అనంతరం ఆర్టీసీ కార్మికుల బైక్‌ర్యాలీని అశ్వత్థామరెడ్డి ప్రారంభించారు. పోలీసులు అడ్డుకున్నా వెనక్కి తగ్గకపోవటంతో అశ్వత్థామరెడ్డితో పాటు సహ కన్వీనర్ రాజిరెడ్డి, వెంకన్నను అరెస్టుచేశారు.

**బలవంతపు బంద్ చేయిస్తే కఠినచర్యలు**

ఆర్టీసీ కార్మిక సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. బలవంతంగా బంద్‌చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు అంజనీకుమార్, మహేశ్‌భగవత్, సజ్జనార్ హెచ్చరించారు. బంద్‌లో పాల్గొనేవారు హింసాత్మక చర్యలకు పాల్పడినా, సామాన్యులను రెచ్చగొట్టేలా ప్రవర్తించినా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. సామాన్య ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. శనివారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు అన్ని విభాగాల పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. బస్‌డిపోలు, బస్టాండ్ల దగ్గర ప్రత్యేక నిఘా, పటిష్ఠ భద్రతతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో మౌంటెడ్ కెమెరా వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, బలవంతపు బంద్‌లకు ఎవరూ తలొగ్గొద్దని సూచించారు.

**లోకం పోకడ**





తార్నాకలో మీడియాతో మాట్లాడుతున్న టీటీయూసీ అనుబంధ క్యాబ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నానునాయక్ తదితరులు

# సమ్మెకు మేం దూరం

- ఆర్టీసీతో క్యాబ్‌లకు సంబంధంలేదు
- టీటీయూసీ క్యాబ్ అసోసియేషన్

**తార్నాక:** కొన్ని క్యాబ్ యూనియన్లు శనివారం నుంచి తలపెట్టిన సమ్మెలో తాము పాల్గొనడంలేదని తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ (టీటీయూసీ) అనుబంధ క్యాబ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నానునాయక్ స్పష్టంచేశారు. శుక్రవారం తార్నాకలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మెకూ టీటీయూసీ క్యాబ్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధంలేదన్నారు. కొన్ని యూనియన్లు తమ స్వార్థప్రయోజనాల కోసం సమ్మెలో చేరుతున్నాయని పేర్కొన్నారు. టీటీయూసీ స్టిక్కర్ ఉన్న క్యాబ్‌లను ఎవరైనా అడ్డుకుంటే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్టీసీని సురక్షితమైన సంస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాల పట్ల కొంతమంది వ్యక్తులు, ప్రతిపక్షాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, పరమేశ్, మల్లేశ్, కుమార్, హరీశ్, నరేశ్‌రెడ్డి, పాపయ్య, శ్రీధర్, బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



శుక్రవారం శంషాబాద్‌లోని ఫోర్ట్‌గ్రాండ్ ఎస్కేప్ వాటర్ పార్కులో జరిగిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడి నిశ్చితార్థానికి హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే బాల్కసుమన్, టీఆర్ఎస్ నాయకుడు కేఆర్ సురేశ్‌రెడ్డి తదితరులు



శుక్రవారం తాజ్‌కృష్ణా హోటల్‌లో జరిగిన మెదక్ ఎస్పీ చందనాదీప్తి, బలరాంరెడ్డి వివాహ విందుకు హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే బాల్కసుమన్ తదితరులు ఉన్నారు

# గులాబీ జెండా ఎగురవేస్తాం

## హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పతనం ఖాయం: విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



టీఆర్ఎస్‌లో చేరినవారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట టౌన్/నేరేడుచర్ల/సూర్యాపేట వ్యవసాయం:** ఈ ఉప ఎన్నికతో హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పతనం కావడం, గులాబీ జెండా ఎగురడం ఖాయమని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాలకు చెందిన ఆరుగురు కాంగ్రెస్ వార్డు సభ్యులు, సీపీఎం నాయకులు.. వారి అనుచరులు 700 మందితో కలిసి సూర్యాపేటలో మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎవరూ ఊహించని రీతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసే టీఆర్ఎస్‌లోకి ఇతర పార్టీల నుంచి భారీగా వలస వస్తున్నారని చెప్పారు. నానాటికీ అంతరించిపోతున్న కాంగ్రెస్, ఇప్పటికే కనుమరుగైన కమ్యూనిస్టు పార్టీలతో ప్రయోజనం లేదనుకున్న ఆయా పార్టీల లీడర్లు, క్యాడర్ స్వచ్ఛందంగా గులాబీ గూటికి చేరుతున్నారని తెలిపారు. హుజూర్‌నగర్ నుంచి అనేకసార్లు ఎమ్మెల్యే గెలిచి, మంత్రిగా ఉండికూడా నియోజకవర్గాన్ని ఉత్తమ్ ఏమాత్రం పట్టించుకోలేదన్న విషయం అందరికీ తెలుసన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రోజుల్లోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోయిన ఉత్తమ్ దంపతులు.. ఇప్పుడేదో చేస్తామంటే అంతా నవ్వుకుంటున్నారని, ఇంకా వారి మాయమాటలను హుజూర్‌నగర్ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేని వెల్లడించారు. కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలకు డిపాజిట్లు కూడా దక్కడం కష్టమేనని అన్నారు. హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదని, ఉత్తమ్ దంపతులకు పరాభవం తప్పదని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. నేరేడుచర్లలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఉత్తమ్, ఆయన సతీమణి పద్మావతి ఎమ్మెల్యేలుగా ఉండి ఎనాడూ ప్రజాసమస్యల గురించి ఆలోచించలేదని, నిత్యం జనంమధ్య ఉండే సైదిరెడ్డికి అపూర్వ స్పందన వస్తున్నదన్నారు. ఈ ఎన్నికలో టీఆర్ఎస్ గెలుపు ఖాయమని తెలిపారు. కాగా, నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద ఆధారాలు చూపని రూ.11.5 లక్షలు పట్టుకున్నట్టు ఎస్ఎస్‌టీ అధికారి టీ శ్రీనివాస్ తెలిపారు.

### కాంగ్రెస్‌కు భారీ షాక్

గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. ఇటీవల కాంగ్రెస్ మద్దతుతో వార్డు సభ్యులుగా విజయం సాధించిన గడ్డిపల్లి, మర్రికుంటకు చెందిన తండు అంజయ్య, సలిగంటి నాగయ్య, షేక్ గులామ్, గుర్రాల సైదులు, పెండెం సైదులు, దరావత్ రవి, బక్కయ్యగూడెంకు చెందిన సీపీఎం, కాంగ్రెస్ నాయకులు శానం వెంకటేశ్, కరణం సత్యం.. 700 మంది అనుచరులతో టీఆర్ఎస్‌లో చేరారు.

### సైదిరెడ్డికే మా మద్దతు: మల్లేశ్వర్

టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికే తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఆయన గెలుపుతోనే హుజూర్‌నగర్ అభివృద్ధి చెందుతుందని పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంఘని మల్లేశ్వర్ చెప్పారు. శుక్రవారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. పీసీసీ పదవిని నిలబెట్టుకోవడానికి ఉత్తమ్ ఆరాటపడుతున్నారన్నారు.

### సైదిరెడ్డి గెలుపు కోరుతూ పూజలు

హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ న్యాయవాద జేఏసీ దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించింది. కార్యక్రమంలో జేఏసీ నేతలు కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఉపేంద్ర, రవికుమార్ బుద్ధవరపు, తుడి శ్రీధర్‌రెడ్డి, తిరుపతివర్మ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఉప ఎన్నికల టీఆర్ఎస్ ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు

- ఉత్తమ్‌ది తోడేళ్ల గుంపు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ నాయకులు సర్కస్‌లో బుడ్డర్‌ఖాన్‌లా మాట్లాతున్నారని, ఒకరికి మించి ఒకరు ప్రచారంలో ఇష్టమొచ్చినట్టు మొరుగుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఉప ఎన్నికల టీఆర్ఎస్ ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవాచేశారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ వృద్ధ జంభూకాలు, గోతికాడి నక్కలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ప్రజలు ఊరుకోబోరని హెచ్చరించారు. ఓటమి అంచును ఉన్న ఉత్తమ్ బీజేపీతో కుమ్మక్కై టీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని, కానీ వారికి ఎక్కడా పైసా కూడా దొరకలేదని చెప్పారు. కోమటిరెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీఆర్ఎస్ నేతలపై అనవసర ఆరోపణలు చేయడం తగదని హితవుపలికారు. 'ఉత్తమ్ తాను వదిలేసిన మంత్రి పదవిని తీసుకున్నాడని, తాను తిని పారేసిన బొక్కను నములుతున్నాడని' కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు తిట్టిన తిట్లు ఎటు పోయాయని నిలదీశారు. పద్మావతిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తే నానాయాగీ చేసిన బుడ్డర్‌ఖాన్ రేవంత్‌రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని దుయ్యబట్టారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని చెప్పిమరీ ఓడించి అక్కడ అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని, ఉత్తమ్‌ను ఓడించి ఇక్కడ కూడా అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని స్పష్టంచేశారు. చిప్పకూడు తిన్నా రేవంత్‌రెడ్డికి బుద్ధి రాలేదని, మరోసారి అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ఓటమి అంచున ఉండటం వల్లే ఉత్తమ్ తోడేళ్ల గుంపును వెంటేసుకొని తిరుగుతున్నాని విమర్శించారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ భానుప్రసాద్ పాల్గొన్నారు.



శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని తన చాంబర్‌లో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన గువ్వల బాలరాజును అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు తదితరులు ఉన్నారు

## ప్రభుత్వ విప్‌గా గువ్వల బాధ్యతల స్వీకరణ

అభినందించిన మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ విప్‌గా గువ్వల బాలరాజు శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా గువ్వల పూజలుచేయగా, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆయనను అభినందించి సీట్లో కూర్చోబెట్టారు. ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ దామోదర్‌రెడ్డి, ఎంపీ రాములు ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు బాలరాజును అభినందించారు.



హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో జరిగిన నీటిపారుదలశాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు గువ్వల , జైపాల్‌యాదవ్ ఉన్నారు

## 'జొన్నలబొగుడ' ఎత్తుపెంచాలి

- ఉన్నతాధికారులకు మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం
- కల్వకుర్తి ఎత్తిపోతల కాల్వల నిర్మాణంపై సమీక్ష
- కాల్వల నీటిని వృథా చేస్తే సహించబోమని హెచ్చరిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జొన్నలబొగుడ రిజర్వాయర్ ఎత్తుపెంచాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి.. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. వనపర్తి పరిధిలోని నూతన రిజర్వాయర్ల టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టాలని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని విత్తన ధ్రువీకరణ కార్యాలయంలో ఉన్న తన చాంబర్‌లో కల్వకుర్తి ఎత్తిపోతల కాల్వల నిర్మాణం, అసంపూర్తి పనులపై ఉన్నతాధికారులతో నిరంజన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. డీ82 కాల్వ, ఓటీఎస్ పనులు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. బుద్దారం కుడి, ఎడమ కాల్వల కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వల సర్వే పూర్తిచేసి పనులు ప్రారంభించాలని, ఎడమకాల్వను రాజాపేట వరకు పొడిగించాలని చెప్పారు. డీ82 కింద అచ్చంపేట నియోజకవర్గానికి నీళ్లివ్వాలని, ప్యాకేజీ 29, 30లో పనులు పూర్తికావాలని ఆదేశించారు. నీటిని వృథా చేస్తే సహించబోమని, కాల్వలకు గండి కొడితే ఎవరైనా సరే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన స్పష్టంచేశారు. ముందుగా కేఎల్ఐ ప్రధానకాల్వ పనులు చేపట్టాలని, యాసంగి తర్వాత మిగిలిన భూసేకరణ పూర్తిచేయాలని అధికారులను నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. వంగూరు మండలానికి త్వరగా నీళ్లివ్వాలని, అవసరమైతే సొంత డబ్బు ఖర్చుపెడతానని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఈఎన్సీ మురళీధర్, సీఈ విజయ్‌కరణ్‌రెడ్డి, ఎస్ఈ అంజయ్య, ఈఈలు రమేశ్, సంజీవరావు, డీఈ చంద్రునాయక్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో కారు జోరు

- ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన
- మెజార్టీపైనే టీఆర్ఎస్ నేతల దృష్టి
- నేటితో ముగియనున్న ప్రచారం.. ఎల్లుండి పోలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, ఇందుకు ప్రజ ల నుంచి వస్తున్న విశేష స్పందనే నిదర్శనమని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. హుజూర్‌నగర్ లో టీఆర్ఎస్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నది. గడప గడపకు పార్టీ లక్ష్యాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నది. శనివారంతో ప్రచారం ముగియనున్నది. సోమవారం (21న) పోలింగ్ జరుగనున్నది. ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో సైదిరెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని నేతలు అంచనా వేస్తున్నారు. ఎన్నికల ఇంచార్జి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకుల మధ్య సమన్వయంతో ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టారు. సాధారణ మెజార్టీ వస్తుందని మొదట అంచనా వేసిన నాయకులు.. ప్రచారం ముగిసేనాటికి భారీ మెజార్టీ ఖాయమనే అంచనాకు వచ్చారు. ప్రచార సరళి, పార్టీ నేతల మధ్య సమన్వయంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు కారు గుర్తుకే ఓటువేస్తామని బహిరంగంగానే చెప్తున్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేస్తున్న టీఆర్ఎస్‌కు ఓటు వేసి రుణం తీర్చుకుందామని అనేక తండాలు సైదిరెడ్డికే తమ మద్దతంటూ తీర్మానాలు చేశాయి. అనేక మంది టీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి కూడా నియోజకవర్గాన్ని ఉత్తమ్ ఏమాత్రం పట్టించుకోలేదని టీఆర్ఎస్ నేతలు ప్రజలకు వివరించారు. గత ఎన్నికల్లో ట్రక్కు గుర్తు గెలుపు, ఓటములపై ప్రభావం చూపగా, ఈసారి ఆ సమస్య రాకుండా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంత ప్రజలను, గిరిజనులను చైతన్యపరిచారు.



శుక్రవారం నిమ్స్‌లో స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

## తక్కువఖర్చుతో నిమ్స్‌లో వైద్యం

- క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం అవసరం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- నిమ్స్‌లో స్కానింగ్ మిషన్ల ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తక్కువఖర్చుతోనే నిమ్స్‌లో మెరుగైన వైద్యం అందుతున్నదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దేశంలో క్యాన్సర్ వ్యాధి తీవ్రత పెరిగిందని, ఈ నేపథ్యంలో ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం అవసరమని పేర్కొన్నారు. శుక్రవారం నిమ్స్‌లో పీఈటీ స్కాన్, న్యూక్లియర్ మెడిసిన్ స్కాన్, స్పెక్ట్ స్కాన్ విభాగాన్ని మంత్రి ప్రారంభించారు. క్యాన్సర్ వ్యాధి వస్తే రోగులు రూ.లక్షలు ఖర్చుచేయాల్సి వస్తున్నదని.. దీంతో పేద కుటుంబాలు కుదేలవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిమ్స్‌లో ప్రారంభించిన అత్యాధునిక పరికరాలతో క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చన్నారు. రూ.22 కోట్లు వెచ్చించి తీసుకొచ్చిన స్కానింగ్ మిషన్లతో తక్కువ ఖర్చుతోనే పేషెంట్లకు మెరుగైన సేవలు అందించనున్నట్టు మంత్రి వెల్లడించారు. త్వరలోనే ఓపీ బ్లాక్‌ను నిర్మిస్తామని.. ఇన్‌పేషెంట్ల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఐసీయూలో బెడ్ల సంఖ్యను పెంచుతామని.. ఎమర్జెన్సీవార్డులో పరికరాల కొరతలేకుండా చూస్తామన్నారు. సెక్యూరిటీ, పారా మెడికల్ సిబ్బందికి ప్రతినెలా మొదటి వారంలోనే జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషన్ మీడియా అవార్డులు

- 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మీడియా అవార్డుల కోసం జర్నలిస్టుల నుంచి కేంద్ర ఎన్నికల సంఘం దరఖాస్తులు కోరుతున్నది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు రేడియో, సోషల్ మీడియా విభాగాలకు అవార్డులను అందజేయనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా.. ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించిన ఉత్తమ జర్నలిస్టులకు పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నది. ఆయా విభాగాల జర్నలిస్టులు ఎన్నికల కథనాలను జతపరుస్తూ దరఖాస్తులను ఈ నెల 31లోగా పవన్‌దివాన్, సమాచార కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం, నిర్వాచన్‌భవన్, అశోక్‌రోడ్, న్యూఢిల్లీ- 110001 అనే అడ్రస్‌కు పంపాలని సూచించింది. ఎంపికైన జర్నలిస్టులకు వచ్చేఏడాది జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ఈసీ వెల్లడించింది.

# 'లక్కీ'గా వరించిన కిక్కు

- మద్యం దుకాణాలకు ముగిసిన లక్కీ డ్రా
- రాష్ట్రంలో 2,182 వైన్స్‌ల కేటాయింపు
- తక్కువ దరఖాస్తులొచ్చిన 29 దుకాణాలకు డ్రా వాయిదా
- డీసీలను నివేదిక కోరిన ఎక్సైజ్ కమిషనర్
- ఏజెన్సీలోని మరో ఐదింటిపై హైకోర్టు స్టే



ఖమ్మం జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణాల లక్కీడ్రా నిర్వహణ కేంద్రం వద్దకు భారీగా తరలివచ్చిన ఆశావహులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్కంఠకు తెరపడింది. మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎక్సైజ్‌శాఖ రాష్ట్రవ్యాప్తంగా 2,216 మద్యం షాపులకుగాను 2,182 దుకాణాలకు శుక్రవారం లక్కీడ్రా పూర్తిచేసింది. దరఖాస్తులు తక్కువగా వచ్చిన 29 దుకాణాలకు లక్కీ డ్రా వాయిదా పడింది. మరో ఐదు మద్యం షాపులపై ఇప్పటికే హైకోర్టు స్టే విధించింది. అన్ని జిల్లాకేంద్రాల్లో కలెక్టర్ల సమక్షంలో డ్రా తీశారు. దరఖాస్తుదారులకు కేటాయించిన టోకెన్ నంబర్లను ఒక పాత్రలో వేసి వాటిలో నుంచి షాపులవారీగా డ్రా పద్ధతిలో దుకాణదారులను ఎంపికచేశారు.

### నివేదిక సమర్పించండి

రాష్ట్రవ్యాప్తంగా అతి తక్కువ దరఖాస్తులు వచ్చిన 29 మద్యం దుకాణాలకు శుక్రవారం డ్రాను వాయిదా వేసినట్టు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. వీటిలో కరీంనగర్‌లో 10 దుకాణాలు, నిజామాబాద్‌లో 8, హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో 7, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2 చొప్పున దుకాణాలు ఉన్నట్టు చెప్పారు. ఇవి కాకుండా ఏజెన్సీ ప్రాంతాల్లోని 5 దుకాణాలపై వివిధ కారణాలతో హైకోర్టు స్టే విధించినట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,216 మద్యం దుకాణాలకు 48,401 దరఖాస్తులు వచ్చాయి. సరాసరి తీసుకుంటే ఒక్కో దుకాణానికి 22 దరఖాస్తులు రాగా, కొన్ని ప్రాంతాల్లో ఒక్కో షాప్‌కు దరఖాస్తులు నాలుగుకు మించలేదు. దీనికి గల కారణాలు విశ్లేషిస్తూ శనివారం సాయంత్రం వరకు నివేదిక సమర్పించాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్లను సోమేశ్‌కుమార్ ఆదేశించారు. నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. లక్కీడ్రాలో దుకాణాలు దక్కించుకున్నవారు షాప్ పరిధిలోని స్లాబ్ ఆధారంగా రెండేండ్ల ఎక్సైజ్ ఫీజు మొత్తంలో ఎనిమిదో వంతు (ఉదాహరణకు 5 వేల జనాభా వరకు ఎక్సైజ్ ఫీజు రెండేండ్లకు రూ.కోటి ఉండగా.. ఇందులో ఎనిమిదోవంతు అంటే రూ.12.5 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు దుకాణదారులకు శనివారం వరకు సమయం ఉన్నదని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఎక్సైజ్ విధానంలో జనాభా ప్రాతిపదికన ఎక్సైజ్ ఫీజు చెల్లింపును ఎనిమిది స్లాబులుగా విభజించిన విషయం తెలిసిందే.

### ఆలస్యం.. అదృష్టం



మెదక్ జిల్లా పాపన్నపేట వైన్స్ షాప్‌ను దక్కించుకొని అగ్రిమెంట్‌పై సంతకం చేస్తున్న మల్లేశం

మెదక్ జిల్లాలోని 38 మద్యం దుకాణాలకు కలెక్టర్ ధర్మారెడ్డి డ్రా తీశారు. పాపన్నపేట వైన్స్ దుకాణానికి డ్రా తీసే సమయానికి ఎస్ మల్లేశం అనే దరఖాస్తుదారుడు డ్రా నిర్వహిస్తున్న కలెక్టరేట్‌లోని ఆడిటోరియానికి రాలేదు. అతని కోసం 5 నిమిషాల పాటు డ్రాను తీయడం నిలిపేసి వేచిచూశారు. అయినప్పటికీ రాకపోవడంతో అనంతరం డ్రా తీశారు. ఇందులో మల్లేశం దరఖాస్తు నంబర్ 3 వచ్చింది. దీంతో మల్లేశం రాక కోసం అందరూ మరో ఐదు నిమిషాలు వేచిచూశారు. అప్పటికీ రాకపోవడంతో మరోసారి డ్రా తీశారు. రెండోసారి కూడా దరఖాస్తు నంబర్ 3 రావడంతో మల్లేశంనే అదృష్టం వరించింది. మల్లేశంకు వైన్స్ వచ్చినట్టు అధికారులు ప్రకటించారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న మల్లేశం సంతోషం వ్యక్తంచేశాడు. అల్లాదుర్గం వైన్స్‌కు డ్రాతీసే సమయానికి ఎం సౌమ్య, పెద్దశంకరంపేట నంబర్ 1 దుకాణానికి డ్రా తీసే సమయానికి కే వినోద్‌కుమార్ రాకపోవడంతో ఐదు నిమిషాల పాటు డ్రాను నిలిపేశారు. అంతలోనే వారు రావడంతో డ్రా తీయగా.. ఈ ఇద్దరినే అదృష్టం వరించింది.

## రవిదాస్ ఆలయానికి షరతులతో భూమి

సుప్రీంకోర్టుకు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** గురు రవిదాస్ ఆలయ నిర్మాణానికి కొంత భూమిని షరతులతో ఇస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. మందిరాన్ని కూల్చివేసిన చోటనే 200 చదరపు మీటర్ల స్థలాన్ని పునర్నిర్మాణం కోసం భక్తుల కమిటీకి అప్పగించనున్నట్లు వెల్లడించింది. ఢిల్లీ పరిధిలోని తుగ్లక్‌బాద్ అటవీ ప్రాంతంలో ఉన్న రవిదాస్ ఆలయాన్ని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు 9న ఢిల్లీ అభివృద్ధి సంస్థ కూల్చివేసిన సంగతి తెలిసిందే. దీనిపై భక్తుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. కూల్చివేతను వ్యతిరేకిస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ కేసు విచారణలో భాగంగా ధర్మాసనానికి అటర్నీ జనరల్ కేకు వేణుగోపాల్ ప్రభుత్వ ప్రతిపాదన గురించి వెల్లడించారు. భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకున్న కేంద్రం రవిదాస్ మందిరం కూల్చివేసిన చోటనే 200 చదరపు మీటర్ల స్థలాన్ని షరతులతో ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. ఏడుగురు పిటిషనర్లలో ఐదుగురు దీనికి అంగీకరించినట్లు కోర్టుకు ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రతిపాదనపై పిటిషనర్లకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే సోమవారంలోపు దాఖలు చేయాలని, అనంతరం తీర్పును వెల్లడిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ వివాదాన్ని రాజకీయం చేసి అల్లర్లు సృష్టించిన వారిపై కోర్టు ఆదేశాల ఉల్లంఘన కింద చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. రవిదాస్ ఆలయం పునర్నిర్మాణం కోసం సరైన పరిష్కారం, అనువైన ప్రాంతం వివరాలు సమర్పించాలని ఇటీవల పిటిషనర్లను కోరింది.



ఆర్థికమాంద్యం నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికలకు భిన్నమైన ఫలితాలను ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో చూస్తాం. పరిశ్రమల మూసివేత, నిరుద్యోగంతో ప్రజల ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నది.

**శరద్ పవార్, ఎన్సీపీ అధినేత**

యూనివర్సిటీలు, విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ల కారణంగా విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. విద్యాలయాల్లో మంచి వాతావరణం కోసం సెల్‌ఫోన్ల వాడకాన్ని నిషేధిస్తున్నాం. ఈ నిషేధం అన్ని విద్యాలయాలకు వర్తిస్తుంది.

**యోగీ ఆదిత్యనాథ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



1722

మంటలను ఆర్పివేయు పరికరాన్ని కనుగొన్న ఫ్రెంచి శాస్త్రవేత్త సీ హాప్‌ఫెర్

1926

సెమి ఆటోమేటిక్ రైఫిల్‌ను తయారుచేసిన జాన్.సి.గరాండ్.





1933

ఒలింపిక్స్ 1936 గేమ్స్‌లో బాస్కెట్ బాల్‌ను ప్రవేశపెట్టాలని తీర్మానించిన బెర్లిన్ ఒలింపిక్ కమిటీ.

ప్రపంచంలోని పెద్ద ఆర్థికవ్యవస్థల్లో స్తబ్ధత నెలకొనటంతో గ్లోబల్ ఎకానమీ మందగమనానికి లోనైనది. ఐఎంఎఫ్ ప్రకారం.. అతిపెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య ఏర్పడిన వైరుధ్యాలే మందగమనానికి కారణం. ఈ వాణిజ్య యుద్ధాల మూలంగా ప్రపంచ వాణిజ్య పరిమాణం తగ్గిపోవటం, పోటాపోటీగా సుంకాలు పెంచటం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే భారత ఆర్థిక వ్యవస్థ కూడా మందగమనంలో పడింది. ఫలితంగా ఎగుమతులు 6.57శాతం తగ్గిపోగా, దిగుమతులు కూడా 13.9శాతానికి పడిపోయాయి. ఇదే ఇప్పుడు భారత్ ముందున్న సవాలు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

బాబ్రీ మసీదు-రామ జన్మభూమి వివాదం కొలిక్కి రావటానికి 70 ఏండ్లు పట్టింది. వివాదాస్పద స్థలంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై హిందు, ముస్లిం వర్గాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గత నలభై రోజులుగా ఇరువర్గాల వాదనలు విన్నది. ఉద్వేగ, వివరణాత్మక వాదనలు విన్న తర్వాత కోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది. ఏదేమైనా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ సున్నితమైన వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కరించటం ఉత్తమం. విశ్వాసాల ఆధారిత వివాదాలకు అదే పరిష్కారం.

**ది హిందూ**



# అసెంబ్లీ తీర్పులు

మహారాష్ట్ర, హర్యానా శాసనసభల ఎన్నికల ఘట్టంలో ఈ నెల 21వ తేదీన పోలింగ్ జరుగనుండటంతో ప్రజాతీర్పుపై ఉత్కంఠ నెలకొన్నది. మన దేశ విస్తృతి, భిన్నత్వం దృష్ట్యా సార్వత్రిక ఎన్నికల తర్వాత అప్పుడప్పుడు జరిగే అసెంబ్లీ ఎన్నికలకు కూడా ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఈ రెండు రాష్ర్టాలు ఆర్థికరంగంలో అగ్రస్థానాల్లో ఉండటం, రైతువర్గాలు బలంగా ఉండి అసంతృప్తితో రగిలిపోతుండటం వంటి కారణాల వల్ల ఈ ఎన్నికల పట్ల ఆసక్తి వ్యక్తమవుతున్నది. మహారాష్ట్ర దేశంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. హర్యానా తలసరి ఆదాయంలో (కేంద్ర పాలితాలను మినహాయిస్తే) మూడవ స్థానంలో ఉన్నది. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో జాతీయ సగటుకు మించి దూసుకుపోతున్న రాష్ర్టాలివి. గత ఐదేండ్లలో జాతీయ ఆర్థికరంగ విస్తృతి సగటు వార్షిక రేటు 7.5 శాతం ఉంటే మహారాష్ట్రలో 7.6 శాతం, హర్యానాలో 8.7 శాతం ఉన్నది. 2018 నాటి పెట్టుబడుల అవకాశాల సూచీ ప్రకారం- హర్యానా నాలుగవ, మహారాష్ట్ర ఐదవ స్థానాల్లో ఉన్నాయి. ముంబయి దేశానికే ఆర్థిక రాజధాని. హర్యానాలోని 22 జిల్లాల్లో పద్నాలుగు జాతీయ రాజధాని ప్రాంతంలో ఉన్నాయి. రెండు రాష్ర్టాలు వాహన తయారీ పరిశ్రమల కేంద్రాలు. వాహనాల అమ్మకాలు పడిపోవడం ప్రభావం ఈ రాష్ర్టాలపై ఉంటుంది. ఇతరత్రా పారిశ్రామిక కార్యకలాపాలు తగ్గిపోయాయి. వ్యవసాయ-అనుబంధ కార్యకలాపాలు హర్యానా జీఎస్‌డీపీలో17 శాతం, మహారాష్ట్ర జీఎస్‌డీపీలో 12 శాతం ఉంటాయి. ఈ రెండు రాష్ర్టాలలో రైతు వర్గాలను మెప్పించడం ఎట్లా అనేది అధికారపక్షాలకు ప్రధాన సమస్యగా మారింది. ఆర్థిక అంశాలపై రాజకీయ సభల్లో పెద్దగా చర్చ సాగనప్పటికీ, ఆర్థిక విధానాల ప్రభావం ఎన్నికలపై పడుతుంది.

హర్యానాలో 27 శాతం జాట్ ఓటర్లున్నారు. వ్యవసాయ సంక్షోభం మూలంగా వారిలో పేరుకున్న అసంతృప్తి ఏదో రూపంలో వ్యక్తమవుతున్నది. కనీసం 23 అసెంబ్లీ స్థానాలు జాట్ ఆధిపత్యం గలవే. ఇతర స్థానాల్లోనూ వారి ప్రాబల్యం ఉంటుంది. మొదట జాట్ల నాయకత్వంలోని ప్రాంతీయ పార్టీల మద్దతుతో హర్యానాలో బలపడిన బీజేపీ ఆ తర్వాత స్వయంగా మెజారిటీ సాధించి అధికారం చేపట్టింది. జాట్ ఓటర్లపై ఆధారపడకుండా ఇతరవర్గాలను ఎక్కువగా ఆకర్షించింది. రాష్ట్రంలో జాట్‌వర్గానికి చెందని నాయకుడి (ఖట్టర్)కి మొదటిసారిగా ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. ఈ ఎన్నికలలో జాట్ ప్రాంతంలో పాగా వేయాలని ఇతర పార్టీలలోని ఈ సామాజిక వర్గానికి చెందిన నాయకులను చేర్చుకుంటున్నది. కాంగ్రెస్ పార్టీ జాట్ వర్గాల్లో పేరున్న భూపీందర్ సింగ్ హుడాను ముందుపెట్టి ప్రచారం చేస్తున్నది. ప్రాంతీయ (జాట్) పార్టీలు ముక్కలు చెక్కలయ్యాయి. ఓం ప్రకాశ్ చౌతాలా నాయకత్వంలోని ఐఎన్‌ఎల్‌డీ, దుష్యంత్ చౌతాలా స్థాపించుకున్న జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) పరస్పరం ఓట్లు చీల్చుకుంటున్నాయి. శిరోమణి అకాలీదళ్ ఐఎన్‌ఎల్‌డీతో పొత్తు పెట్టుకున్నది. కాంగ్రెస్ పార్టీ అంతఃకలహాలను అధిగమించి ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రతిపక్షాలు చీలిపోవడం బీజేపీకి అనుకూలాంశం. మహారాష్ట్రలో కూడా రైతు వర్గమైన మరాఠాలు తీవ్ర అసంతృప్తితో తరచు ఆందోళనలు సాగిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ సంక్షోభం ఈ రెండు రాష్ర్టాలలో ఎంత మేర ప్రభావం చూపుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

> **మహారాష్ట్రలో నూ సోనియాగాంధీ భిన్నవర్గాలను సంబాళించడంతో పాటు పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో పొత్తు పెట్టుకొని బీజేపీకి గట్టి పోటీ ఇస్తున్నారు. బీజేపీ మోదీ-అమిత్ షా నాయకత్వంలో బలంగా ఆత్మవిశ్వాసంతో ఉన్నది. నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ బీజేపీని ఢీకొనగలదా అనే అనుమానాలున్నాయి. బీజేపీకి ముప్పు కనుక ఉంటే అది ప్రధాని మోదీ విధానాల వల్ల, దేశంలో నెలకొన్న పారిశ్రామిక, వ్యవసాయ సంక్షోభం వల్ల. బీజేపీ వ్యతిరేకతను సొమ్ము చేసుకునే స్థాయికి కాంగ్రెస్ చేరుకున్నదా అనేదే ఈ ఎన్నికల్లో తెలిసిపోతుంది.**

ప్రాంతీయ పార్టీలు రంగంలో ఉన్నప్పటికీ రెండు రాష్ర్టాలలో బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులు. మహారాష్ట్రలోని 288 స్థానాలకు జరిగే ఎన్నికలో ఒకవైపు బీజేపీ-శివసేన, మరోవైపు కాంగ్రెస్-ఎన్సీపీ కూటములు తలపడుతున్నాయి. 90 స్థానాలున్న హర్యానాలో ప్రాంతీయ పార్టీలు కూడా రంగంలో ఉన్నప్పటికీ బీజేపీ, కాంగ్రెస్ పరస్పర హననానికి ప్రయత్నిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ పార్టీకి పునరుజ్జీవం కల్పించిన సోనియాగాంధీ ఇప్పుడు మళ్ళా తాత్కాలికంగానైనా సారథ్యం స్వీకరించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన తగ్గింది. రాష్ర్టాల స్థాయిలో నాయకులను మార్చడం, సీనియర్ నాయకులకు భరోసా ఇవ్వడం ద్వారా సోనియాగాంధీ పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. హర్యానాలో రాహుల్‌గాంధీ ప్రాబల్యం ఉన్నప్పుడు అశోక్ తన్వర్ హర్యానా పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. సోనియా చేతికి పగ్గాలు రాగానే మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా ప్రాధాన్యం పెరిగింది. తన్వర్ స్థానంలో హుడా సూచనల మేరకు కుమారి సెల్జాకు పీసీసీ సారథ్యం అప్పగించారు. రాహుల్ మద్దతు గల తన్వర్ పార్టీకి రాజీనామా చేశారు. మహారాష్ట్రలోనూ సోనియాగాంధీ భిన్నవర్గాలను సంబాళించడంతో పాటు పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో పొత్తు పెట్టుకొని బీజేపీకి గట్టి పోటీ ఇస్తున్నారు. బీజేపీ మోదీ-అమిత్ షా నాయకత్వంలో బలంగా ఆత్మవిశ్వాసంతో ఉన్నది. నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ బీజేపీని ఢీకొనగలదా అనే అనుమానాలున్నాయి. బీజేపీకి ముప్పు కనుక ఉంటే అది ప్రధాని మోదీ విధానాల వల్ల, దేశంలో నెలకొన్న పారిశ్రామిక, వ్యవసాయ సంక్షోభం వల్ల. బీజేపీ వ్యతిరేకతను సొమ్ము చేసుకునే స్థాయికి కాంగ్రెస్ చేరుకున్నదా అనేదే ఈ ఎన్నికల్లో తెలిసిపోతుంది.

ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# ఇచ్చుకుంటి వాయినం...

**మోదీజీ పాలనలో డిమాండ్ తగ్గి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నదని ఆర్థికవేత్తలు ముక్తకంఠంతో హెచ్చరించారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ ఆర్థికవేత్తలకు ఏం తెలుసంటూ హేళనచేసి ఈ రోజు దేశాన్ని ఘోరమైన ఆర్థిక మాంద్య సంక్షోభంలో ఇరికించారు. మతోన్మాద నల్లమందు నశాళానికి ఎక్కి ఏం చేయకుండానే ఇక్కడ ఏతులు నరుకుతుంటే అక్కడ కమ్యూనిస్టు చైనీయులు చడీచప్పుడు లేకుండా నిర్బంధ వాతావరణంలో ఆర్థికంగా ఎన్నో సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించారు.**

మానవ లోకంలోని ఏ మూలకు వెళ్ళినా 'కన్యాశుల్కం' నాటకంలోని పాత్రలు గోచరిస్తాయి. ఆ అద్భుత నాటకంలోని ఒక అద్భుత దృశ్యం మధురవాణి ఇంటిలో ఆవిష్కృతమైంది. సాయం సమయాన రామప్పంతులు ఉత్తరీయం ముసుగుతో అటూ ఇటూ చూసి, ఎటూ ఎవరూ లేరన్న 'తసల్లీ' కలిగిన తర్వాత తలుపుతోసి మధురవాణి ఇంటిలోకి వస్తాడు, అక్కడ మధురవాణి తప్ప ఇంకెవరూ లేరని సంతృప్తి పడుతాడు. మధురవాణితో ముచ్చట్లతో రామప్పంతులు తన్మయుడవుతున్న క్షణాన రసభంగం కలిగిస్తూ తలుపు చప్పుడైంది. మధురవాణి సమయ స్ఫూర్తితో, ఎందుకైనా మంచిదని రామప్పంతులును గబగబ తన మంచం కిందికి పంపిస్తుంది. తలుపు తోసుకొని గిరీశం నేటి బాలీవుడ్ హీరోవలె మధురవాణి వైపు వచ్చి మంచం మీద తిష్టవేస్తాడు. తన మాటల మకరందాలతో గిరీశానికి మధురవాణి గిలిగింతలు పెట్టుతుండగా మళ్లీ తలుపు చప్పుడు. మధురవాణి తటుక్కున తలుపు వైపు ఓరగంట చూసి వెంటనే గిరీశాన్ని తన మంచం కిందికి తోసింది; తలుపు తెరిచింది. మధురవాణి మంచం కింద రామప్పంతులు, గిరీశం అనధికార, ఆత్మీయ శిఖరాగ్ర సమావేశం!

ఈ మనోజ్ఞ దృశ్యం జ్ఞాపకం రావడానికి ప్రధాన హేతువు ఇటీవల అమెరికాలోని హ్యూస్టన్‌లో (హౌడీ మోదీ వేదికపై) అధ్యక్షుడు ట్రంప్‌తో, ఇక్కడ తమిళ సముద్ర సమీరాల్లో కమ్యూనిస్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో హార్దిక, అనధికార (దౌత్య పరిభాషలో-జార్గన్‌లో-అధికార సమావేశానికి, అనధికార సమావేశానికి మధ్య తేడా ఏమిటో తెలియదు) శిఖరాగ్ర సమావేశం. ఆధునిక ప్రపంచంలోని రెండు భిన్న, పరస్పర విరుద్ధ వ్యవస్థల అధినేతలతో ఆత్మీయ సమావేశాలను, కలయికలను ఏర్పాటుచేయడం, అధినేతలతో అక్కడ, ఇక్కడ గంటల తరబడి ముఖాముఖి చర్చలు 'సహృద్భావ వాతావరణం'లో జరిగినా, సమస్యలేవీ పరిష్కారం కాకపోవడం, 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా పరిస్థితి క్లిష్టంగా కొనసాగడం అసాధారణ విషయమే.

అధినేతలు-అధ్యక్షులు, ప్రధానులు-ప్రాణమిత్రులు; ఒకరినొకరు అమితంగా గౌరవించుకుంటారు. అనధికార సమావేశాలైనప్పటికీ అధికారికంగా (ప్రజలు చెమటోడ్చి చెల్లించిన డబ్బుతో) అన్ని మర్యాదలు జరుగుతాయి. కానీ ఎన్నాళ్లైనా దేశ సమస్యలు, అనగా ప్రజల సమస్యలు, పరిష్కారం కావు. రోజుల తరబడి విందులు, వినోదాలతో, అధికారుల బృందాలను వెంట బెట్టుకొని, చర్చలు జరిపినా క్లిష్ట సమస్యల ప్రస్తావన ఉండదు. ఏండ్ల కొద్దీ మూలుగుతున్న సమస్యలను పరిష్కరించకుండానే పరస్పర విశ్వాస చర్యల గురించి (కాన్ఫిడెన్స్ బిల్డింగ్ మెజర్స్ అన్న ఒక ముద్దు పేరు ప్రచారంలోకి వచ్చింది) ఆలోచిస్తారట!

రెండవ ప్రపంచయుద్ధం నాటినుంచి నయా సామ్రాజ్యవాద ధోరణితో ప్రపంచ ఆధిపత్యం కోసం పెనుగులాడుతున్న, పలు యుద్ధ కూటములను సృష్టించి, ఉద్రిక్త వాతావరణం (కొన్ని సమయాల్లో యుద్ధ వాతావరణం) కల్పించి ఆధునిక ప్రపంచాన్ని రెండుగా చీల్చిన పెట్టుబడిదారి అగ్రదేశం అమెరికా. 1917 నుంచి దాదాపు 75 ఏండ్లు రెండవ శిబిరానికి నాయకత్వం వహించి, అమెరికా కూటమిని ధిక్కరించి పోటీ పడ్డ సోవియట్ యూనియన్ 30 ఏండ్ల కింద అంతర్గత ఒత్తిడులతో కుప్పకూలి అస్తిత్వాన్ని కోల్పోయింది. ఆ స్థానాన్ని చైనా ఆక్రమించింది. కొంతవరకు మావో మార్గం నుంచి వైదొలిగి డెంగ్ సియావోపింగ్ ఆధిపత్యంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టు చైనా ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో అద్భుత ప్రగతిని సాధించి అమెరికాతో సమ పోటీపడగల స్థాయికి వచ్చింది. సోవియట్ యూనియన్ విచ్ఛిత్తికి దారితీసిన కారణాలతో కమ్యూనిస్టు చైనా గుణపాఠాలు నేర్చుకోవడం విశేషం. సోవియట్ యూనియన్ ఉపేక్షించిన అంశాలు, రంగాల పట్ల చైనా తన అభివృద్ధి పథంలో శ్రద్ధ వహించింది. 1998-2008 పదేండ్ల కాలంలో మధ్యతరగతి ప్రజల ఆదాయం అమెరికాలో 4 శాతం మాత్రమే పెరుగగా కమ్యూనిస్టు చైనాలో 70 శాతం పెరిగింది. పర్యవసానంగా చైనా మార్కెట్‌లో డిమాండు పెరిగింది.

మోదీజీ పాలనలో డిమాండ్ తగ్గి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నదని ఆర్థికవేత్తలు ముక్తకంఠంతో హెచ్చరించారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ ఆర్థికవేత్తలకు ఏం తెలుసంటూ హేళనచేసి ఈ రోజు దేశాన్ని ఘోరమైన ఆర్థిక మాంద్య సంక్షోభంలో ఇరికించారు. మతోన్మాద నల్లమందు నశాళానికి ఎక్కి ఏం చేయకుండానే ఇక్కడ ఏతులు నరుకుతుంటే అక్కడ కమ్యూనిస్టు చైనీయులు చడీచప్పుడు లేకుండా నిర్బంధ వాతావరణంలో ఆర్థికంగా ఎన్నో సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. అతి స్వల్ప కాలంలో చైనా సిమెంట్, స్టీలు, విద్యుచ్ఛక్తిరంగాల ఉత్పత్తుల్లో గరిష్ట స్థాయికి వచ్చింది; సిమెంట్ ఉత్పత్తిలో అమెరికా వందేండ్లలో సాధించిన పెరుగుదలను చైనా మూడేండ్లలో సాధించి దిగ్భ్రాంతి కలిగించింది. ఈ రోజు అమెరికా తర్వాత రెండో స్థానంలో నిలిచిన ఆర్థికవ్యవస్థ చైనాదే. ఎన్నడో మావో అన్నట్లు 'చైనా లేచి నిలిచింది'. 2021 నాటికి పేదరికం నిర్మూలన, 2049 నాటికి సోషలిస్టు సమాజ నిర్మాణం చైనా ప్రధాన లక్ష్యాలు. 'అన్నీ ఉన్నయి కానీ అల్లుడి నోట్లో శని ఉంది' అన్నట్టు చైనాలో ప్రజాస్వామ్యం లేదు. జిన్‌పింగ్ శాశ్వత అధ్యక్షుడిగా చైనాలో కమ్యూనిస్టుపార్టీ ఏకపక్ష నియంతృత్వం నడుస్తున్నది. మన దేశంలో 72 ఏండ్ల నుంచి ఉన్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఈ రోజు అభాసుపాలై ఆస్తి-నాస్తి విచికిత్సకు, అవి ఉన్నాయా లేదా అన్న మీమాంసకు దారితీస్తున్నాయి.

పొరుగున ఉన్న చైనా గత చరిత్రను పరికిస్తే అది అభివృద్ధి రంగంలో సాధిస్తున్న విజయాలు ఈ దేశానికి సంతోషం కలిగించవు. మిత ఆందోళన కల్గిస్తాయి. 1959 నవంబర్ 27న లోక్‌సభలో ప్రసంగిస్తూ అప్పటి ప్రధాని నెహ్రూ అన్నారు."We know enough history to realise that a strong China is normally an expansinist China. This has been the case through out its history...". 3,380 కిలోమీటర్ల సరిహద్దులు చైనా, భారతదేశాలను వేరుచేస్తున్నాయి. తనకు ఇష్టం కాని, తనకు అనుకూలంగా లేని, తన విస్తరణ విజృంభణకు అడ్డువచ్చే సరిహద్దును (మెక్‌మెహన్‌లైన్ ఒక ఉదాహరణ) చైనా తిరస్కరిస్తున్నది. 70 ఏండ్ల కింద మావో లాంగ్‌మార్చ్ విజయం సాధించి, చంగ్‌కెషైక్ పారిపోయి కేవలం ఫార్మోజాకే (ఇప్పటి తైవాన్) పరిమితమైనప్పుడు చైనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఐరాసలో, భద్రతా మండలిలో, ఇతర అంతర్జాతీయ సంస్థల్లో స్థానం, ప్రాతినిధ్యం లభించకుండా అమెరికా అడ్డుపడింది. అమెరికా తీవ్ర వ్యతిరేకతను తట్టుకుంటూ నెహ్రూ భద్రతా మండలిలో కమ్యూనిస్టు చైనాకు స్థానం లభించడానికి తీవ్ర కృషి జరిపారు. విస్తరణ వాదంతో కమ్యూనిస్టు చైనా టిబెట్‌ను ఆక్రమించింది. నెహ్రూ సహాయాన్ని మరిచిపోయి కమ్యూనిస్టు చైనా 57 ఏండ్ల కిందట ఇదే అక్టోబర్‌లో భారత సరిహద్దులపై మెరుపుదాడులు జరిపి వేల చదరపు కిలోమీటర్ల భారత భూ భాగాల్లో దురాక్రమణ జరిపింది. 38 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాలను కమ్యూనిస్టు చైనా 1962 దాడుల్లో ఆక్రమించిందని అంచనా. పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీర్ ప్రాంతంలో దాదాపు ఆరువేల చదరపు కిలోమీటర్ల భూభాగాలు చైనా హస్తగతమైందని అంచనా.

వాజపేయి పాలనలో 1998లో భారత్ అణ్వస్త్ర పరీక్షలు జరిపింది. కమ్యూనిస్టు చైనా నుంచి ప్రమాదం ఉంది గనుక అణ్వస్త్ర పరీక్షలు జరిపామని అప్పటి రక్షణమంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ ప్రకటించారు. డోక్లామ్ ఘర్షణ (చైనాతో) రెండేండ్ల కిందటి అనుభవం. డొక్లామ్ అనంతరం వూహాన్‌లో మోదీజీతో జిన్‌పింగ్ అనధికారిక శిఖరాగ్ర సమావేశం గులాబీ తోటల్లో అన్ని మర్యాదలతో. ఈ అక్టోబర్ 11న ఇండియాలో మామల్లాపురంలో అన్ని సత్కారాలు పొందడానికి రెండ్రోజుల ముందు జిన్‌పింగ్ పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను ఆహ్వానించి చర్చలు జరిపి కశ్మీర్ సమస్యపై పాక్‌కు మద్దతు ప్రకటించాడు. మామల్లాపురం వాహ్యాళిలో, విందుల్లో, ఆరు గంటల ఆత్మీయ, ఆంతరంగిక చర్చల్లో మోదీజీ కశ్మీర్ గురించి మాట్లాడలేదు, జిన్‌పింగ్ హిందీ సినిమాల గురించి మాత్రమే మాట్లాడారు. ముందు వాణిజ్యం, తర్వాత సరిహద్దు, ఇతర విషయాలు అంటారు జిన్‌పింగ్. వూహాన్ నుంచి మామల్లాపురం వరకు ఇచ్చుకుంటి వాయనం పుచ్చుకుంటి వాయనం... ఈ 18 నెలల్లో సాధించిందేమిటి? సున్నా. ఒకవంక చాటుమాటున రాజకీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ రెచ్చగొట్టుతున్న పొటెన్షియల్ ఎనిమీ-శక్తివంత శత్రువు! మరోవంక మతోన్మాద టెర్రరిజాన్ని రెచ్చగొడుతున్న శక్తిహీన శత్రువు! శ్రీనగర్‌లాల్ చవుక్ చౌరస్తాలో పోగయిన పదిమంది నిరాయుధ మహిళలను చూసి భయపడిన ప్రభుత్వం ఈ ఇద్దరు శత్రువులను ఎదుర్కోగలుగుతుందా? గ్లోబల్ విలేజ్‌గా మారిన ఈ ఆధునిక ప్రపంచంలో అంతర్గత సమస్యలుంటాయా? గత 70 ఏండ్ల చరిత్రను పరికిస్తే పశ్చిమాసియాలోని అంతర్గత సమస్యలన్ని ప్రపంచ సమస్యలుగా బాధించాయి. ఇటీవల సౌదీ అరేబియాపై ఇరాన్ దాడివల్ల చమురు ధరలు పెరిగి అంతర్జాతీయంగా భారత్ తదితర దేశాలకు చమురు ధరల సమస్య ఎదురైంది. ముజీబ్ ఉర్ రహ్మాన్ పోరాటం పాకిస్థాన్ అంతర్గత సమస్య అని భుట్టో అన్నాడు. ఇందిరాగాంధీ ఆయనతో (భుట్టో) ఏకీభవిస్తే బంగ్లాదేశ్ విముక్తి, అవతరణ సాధ్యమయ్యేదా?! ఏదీ అంతర్గత సమస్యగా మిగిలి ఉండదని, అది అంతర్జాతీయ సమస్యగా మరెన్నో సమస్యలను సృష్టిస్తుందని ఇటీవలి ప్రపంచ చరిత్ర నిరూపిస్తున్నది. మామల్లాపురంలోని ఒక అపశృతిని ప్రస్తావించక తప్పదు. ఒకవంక గాంధీజీకి ఇష్టమైన 'రఘుపతి రాఘవ రాజారాం' గీతాన్ని ఆలపిస్తూ మరోవంక గాంధీజీకి ఏ మాత్రం ఇష్టం లేని మాంసాహార భోజనంతో విందులు జరిపారు!

> **గత 70 ఏండ్ల చరిత్రను పరికిస్తే పశ్చిమాసియాలోని అంతర్గత సమస్యలన్ని ప్రపంచ సమస్యలుగా బాధించాయి. ఇటీవల సౌదీ అరేబియాపై ఇరాన్ దాడివల్ల చమురు ధరలు పెరిగి అంతర్జాతీయంగా భారత్ తదితర దేశాలకు చమురు ధరల సమస్య ఎదురైంది. ముజీబ్ ఉర్ రహ్మాన్ పోరాటం పాకిస్థాన్ అంతర్గత సమస్య అని భుట్టో అన్నాడు. ఇందిరాగాంధీ ఆయనతో (భుట్టో) ఏకీభవిస్తే బంగ్లాదేశ్ విముక్తి, అవతరణ సాధ్యమయ్యేదా?!**

# ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం

విశ్లేషణ



**మెట్టు శ్రీనివాస్**

నేడు మానవునికి ప్లాస్టిక్ లేకుండా గంట గడువని స్థితి ఏర్పడింది. ఉదయం లేచిన దగ్గరినుంచి నిద్రపోయే వరకు ప్లాస్టిక్ వాడకం నిత్యకృత్యమైంది. దేశంలో ప్రతి మనిషి తలసరి ప్లాస్టిక్ వినియోగం 11 కిలోలు ఉన్నది. ముఖ్యంగా కుటుంబ అవసరాలకు సంబంధించిన ఏ వస్తువు ఇంటికి తెచ్చుకోవాలన్నా, ఇంట్లో వాడకానికి అనేకరకాల వస్తువులు ప్లాస్టిక్ రూపంలో దొరుకడం విపరీతంగా ప్లాస్టిక్ వాడకానికి దారితీసింది. అంతేగాక ప్లాస్టిక్ వస్తువులు చౌకగా దొరుకడం, ఎక్కువకాలం మన్నికగా ఉండటం కూడా ముఖ్యకారణం. దీంతో ఎటుచూసినా పాలిథీన్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలే కనబడుతున్నాయి. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సిస్టం వచ్చిన తర్వాత ప్లాస్టిక్ వినియోగం మరింత పెరిగింది. ఉదాహరణకు.. స్విగ్గీ, జొమాటో కంపెనీలు కలిసి నెలకు 28 మిలియన్ ఆర్డర్లు డెలివరీ చేస్తున్నాయి. పాలిథీన్ సంచులను క్యారీ బ్యాగులుగా, టీ కప్పులుగా, ప్లేట్లుగా ప్యాకేజింగ్‌కు యథేచ్ఛగా వాడుతున్నారు. ఫలితంగా డ్రైనేజీలు, చెరువులు, బావులు, నదులు, సముద్రాలు గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ప్లాస్టిక్ స్వతహాగా విషపూరితం కాకపోయినా దాని స్వభావరీత్యా విచ్ఛిన్నమై త్వరగా మట్టిలో కలిసిపోదు. వందల ఏండ్లు భూమిలో అలాగే ఉంటుంది. వర్షపు నీరు భూమి లోపలికి ఇంకిపోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా ఉండటం వల్ల భూగర్భజలాలు పడిపోతున్నాయి. ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోకపోవడం వల్ల తీవ్రమైన కాలుష్యానికి దారితీసి నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి ముప్పుగా మారి జీవ విధ్వంసానికి కారణమవుతున్నది. ఏటా 1.1 నుంచి 8.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లో కలుస్తున్నాయి. దీనివల్ల సముద్రాల్లోని జీవరాశులకు ప్రాణహాని కలుగుతున్నది. నీటిలో ఉండే వేల జీవరాశులు చనిపోతున్నాయి.

ప్లాస్టిక్ సంచులకు ఉపయోగించే రంగులు, పిగ్మెంట్‌లు, పారిశ్రామిక ఏజోడైలు వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నది. శరీరంలో హార్మోనల్ సమస్యలు, సంతానోత్పత్తి, థైరాయిడ్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. ప్లాస్టిక్ వస్తువుల తయారీలో వినియోగించే రసాయన పదార్థాల వల్ల డెర్మటైటిస్ అనే చర్మవ్యాధి సంభవిస్తుంది. ప్లాస్టిక్‌ను తగులబెట్టడం వల్ల వెలువడే విష వాయువులతో శ్వాసకోశ సంబంధిత జబ్బులు వస్తున్నాయి. అంతిమంగా వన్యప్రాణులు, జలచరాలు, మానవాళి జీవావరణం అంతా దెబ్బతింటున్నది. ప్లాస్టిక్ వల్ల ఏడాదికి లక్ష సముద్ర ప్రాణులు, పది లక్షల సముద్ర పక్షులు చనిపోతున్నాయి.

2018 నాటికి ఏటా ప్రపంచవ్యాప్తంగా 380 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి జరిగింది. ప్రపంచవ్యాప్తంగా 1950 నుంచి నేటివరకు 6.3 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి చేయబడింది. దీనిలో కేవలం 9 శాతం రీసైకిల్ చేయబడుతుంటే, మరో 12 శాతం కాల్చివేశారు. మిగతా 79 శాతం సముద్రాల్లో, పర్వత పరిసరాల్లో నదుల్లో, బావుల్లో చెత్తకుప్పల్లో పేరుకుపోయింది. 2050 సంవత్సరం కల్లా సముద్రాల్లో ఉన్న చేపల బరువుకన్నా ప్లాస్టిక్ బరువు ఎక్కువవుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తి కోసం రోజుకు 7 మిలియన్ బ్యారెల్స్ పెట్రోలియం ఖర్చవుతున్నది. ఇతర ఉత్పత్తులకు ఉపయోగపడే పెట్రోలియంను ప్లాస్టిక్ తయారుచేయడానికి ఉపయోగించడం వల్ల ఖర్చుతో పాటు పర్యావరణానికి హాని కలుగుతున్నది.

సెంట్రల్ పొల్యూషన్ బోర్డు (2012) లెక్కల ప్రకారం దేశంలో 26 వేల టన్నుల ప్లాస్టిక్ ప్రతిరోజు మనం ఉత్పత్తి చేస్తున్నాం. దీంట్లో 10 వేల టన్నుల ప్లాస్టిక్‌ను తిరిగి సేకరించడం లేదు. ఈ విధంగా రోజుకు 10 వేల టన్నుల ప్లాస్టిక్ మనదేశంలో వివిధ ప్రాంతాల్లో మిగిలిపోతున్నది. మన దేశంలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమ ఉత్పత్తి చేసేది (2015) 13.4 మిలియన్ మెట్రిక్ టన్నులు, అది 2020 కల్లా 22 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరే అవకాశం ఉన్నది. దీంతో రాబోయేరోజుల్లో దేశ పర్యావరణానికి పెను ప్రమాదంగా రాబోతున్నది.

2016లో వచ్చిన ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం స్థానిక సంస్థలు (గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు) ప్లాస్టిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి. ప్లాస్టిక్‌ను ఎలా డిస్పోజ్ చేయాలి, ఎలా కలెక్ట్ చేయ్యాలనే దానికోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుచేసుకోవాలి. 2018లో సవరించిన నిబంధనల ప్రకారం అదనంగా ప్లాస్టిక్ ఉత్పత్తి పరిశ్రమదారులకు ఉత్పత్తి చేయడంతో పాటు వాటిని తిరిగి సేకరించే బాధ్యత కూడా నిర్ణయించింది. కానీ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల 21 రాష్ర్టాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నిబంధనలు కనీసం పాటించకపోవడం వల్ల ప్లాస్టిక్ నివారణ చర్యలు ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి.

ఈ నేపథ్యంలోంచే పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రపంచ ప్రజలంతా 'ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని' ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 2022 కల్లా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని 60 దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. ఈ క్రమం లోనే సందర్భంగా ఆరురకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను భారత ప్రభుత్వం నిషేధించింది. దీనివల్ల 5 నుంచి 10 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గే అవకాశం ఉన్నది.

దేశవ్యాప్తంగా ఒక నిర్దిష్టమైన విధానమంటూ లేనందున ప్లాస్టిక్‌పై యుద్ధం నామమాత్రంగానే సాగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఎకోఫ్రెండ్లీ వస్తువులను (పర్యావరణ అనుకూల వస్తువులు) తక్కువ ధరకు వినియోగదారులకు అందజేయాలి. ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చట్టాన్ని రూపొందించి అమలుచేయాలి. అప్పుడే 2022 నాటికి ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుచేయగలుగుతాం. ప్రజలు సదుపాయాలే ప్రధానమని చూడకుండా, తమ జీవ మనుగడను కాపాడుకోవడానికి పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలి.

బంగారు తెలంగాణకు బాటలు వేయడం కోసం ప్రజారోగ్యం మీద, హరితహారం మీద ప్రత్యేక శ్రద్ధపెట్టి ఫలితాలు సాధించిన మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి ఒక బలమైన చట్టాన్ని రూపొందించాలని నిర్ణయించడం మంచి పరిణామం. ప్లాస్టిక్ రహిత సమాజమే ఆరోగ్యకర సమాజానికి పునాది.

> **దేశవ్యాప్తంగా ఒక నిర్దిష్టమైన విధానమంటూ లేనందున ప్లాస్టిక్‌పై యుద్ధం నామమాత్రంగానే సాగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఎకోఫ్రెండ్లీ వస్తువులను (పర్యావరణ అనుకూల వస్తువులు) తక్కువ ధరకు వినియోగదారులకు అందజేయాలి. ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చట్టాన్ని రూపొందించి అమలుచేయాలి. అప్పుడే 2022 నాటికి ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుచేయగలుగుతాం. ప్రజలు సదుపాయాలే ప్రధానమని చూడకుం డా, తమ జీవ మనుగడను కాపాడుకోవడానికి పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలి.**

**జనగళం**

## గ్రామాలకు నూతన శోభ

రాష్ట్ర ప్రభుత్వం చేపటిన ముప్పై రోజుల ప్రణాళిక సత్ఫలితాలు ఇచ్చింది. ఈ ప్రణాళికతో మారుమూల గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారిపోయాయి. ముఖ్యంగా గ్రామాలు పరిశుభ్రంగా, పచ్చదనంతో నూతనంగా ఆవిష్కరించబడుతున్నాయి. చాలా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలుగుతున్నాయి. మురుగుకాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రంగా మారుతున్నాయి. వీధి దీపాలు మరమ్మతులకు నోచుకొని పల్లెలు రాత్రివేళల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఏడాదిలో 30 రోజులు మాత్రమే కాకుండా ప్రతి రోజూ పల్లెను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. కాబట్టి అధికారులతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే పల్లెలు ప్రగతిని సాధిస్తాయి.

**-కొలిపాక శ్రీనివాస్, పెద్ద సముద్రాల, సిద్దిపేట**

## ఉద్యోగులు విధుల్లో చేరాలె

ఆర్టీసీ కార్మికులు పట్టువీడాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ వీలీనం కోసం సమ్మె చేపట్టిన ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల సాధ్యాసాధ్యాలపై పునరాలోచించుకోవాలి. అంతేకానీ ప్రతిపక్షాల సూచనలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టాలనుకోవడం సరికాదు. సరిగ్గా ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చే పండుగ సమయంలో సమ్మె చేపట్టి ప్రజలను ఇబ్బందుల కు గురిచేయడం సమంజసం కాదు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉద్యోగులు విధుల్లో చేరి ప్రజలకు రవాణా ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

**- మాసబోయిన రజిని, బద్దిపల్లి, కరీంనగర్**

## పందుల బెడద

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు పందుల బెడద ఎక్కువైపోయింది. పందులు విచ్చలవిడిగా తిరుగడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలకు రోగాలకు గురవుతున్నారు. పందుల వల్ల మెదడువాపు లాంటి రోగాలు సంక్రమించే అవకాశం ఉన్నది. కాబట్టి మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది పందుల బెడదను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## ట్రంప్ గోల్ఫ్ రిసార్టులో వచ్చే ఏడాది జీ-7 సదస్సు

**వాషింగ్టన్:** వచ్చే ఏడాది జూన్ 10-12 తేదీల్లో జరిగే జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు అమెరికా ఆతిథ్యం ఇవ్వనున్నది. ఈ సదస్సు ఫ్లోరిడాలోని మియామిలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత గోల్ఫ్ రిసార్ట్‌లో జరుగనున్నది. దీంతో ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం వల్ల అయ్యే ఖర్చులో సగం ఆదా అవుతుందని వైట్‌హౌస్ తాత్కాలిక చీఫ్ ఆఫ్ స్టాఫ్ మిక్ ముల్వేనెయ్ మీడియాకు చెప్పారు. దీనిపై అమెరికా మీడియా విమర్శలు ఎక్కుపెట్టింది. ట్రంప్ ప్రభుత్వ చర్యను అమెరికా కాంగ్రెస్ సభ్యులు కూడా విమర్శిస్తున్నారు.



పట్టపగలు చోరీకి వచ్చిన ఓ దొంగ.. ఓ వృద్ధురాలికి ముద్దిచ్చి వెళ్లాడు. ఈ వింత ఘటన మంగళ వారం బ్రెజిల్‌లోని అమరాంటేలో జరిగింది. ఓ వృద్ధురాలు మందుల కోసం మెడికల్ షాప్‌కు వెళ్లగా తుపాకీలతో ఇద్దరు దొంగలు చొరబడ్డారు. ఒకడు దుకాణదారును బెదిరించి క్యాష్ కౌంటర్‌లోని డబ్బును తీసుకున్నాడు. మరో దొంగ ఆ వృద్ధురాలిని సమీపించాడు. ఆమె భయపడి తన వద్ద ఉన్న డబ్బులు ఇవ్వబోగా.. 'నాకు మీ డబ్బులు వద్దు మేడమ్' అంటూ ఆమెను పట్టుకొని నుదుటిపై ముద్దుపెట్టాడు.



## అంతరిక్షంలోనూ సగం..

- మొట్టమొదటిసారిగా స్పేస్ వాక్ చేసిన మహిళా వ్యోమగాములు
- ఐఎస్ఎస్ పవర్ కంట్రోలర్‌లో లోపాల సవరణ

**వాషింగ్టన్:** అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా)కు చెందిన ఇద్దరు మహిళా వ్యోమగాములు శుక్రవారం స్పేస్ వాక్ చేశారు. స్పేస్ వాక్ చేసిన తొలి పూర్తి స్థాయి మహిళా బృందం ఇదే కావడం విశేషం. క్రిస్టినా కోచ్, జెస్సికా మెయిర్ అనే ఇద్దరు మహిళా వ్యోమగాములు అంతరిక్షంలో నడిచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని పవర్ కంట్రోలర్‌లో తలెత్తిన లోపాల్ని సవరించారు. 'పాడైన బ్యాటరీ కంట్రోలర్ల స్థానంలో కొత్తవాటిని అమర్చడానికి క్రిస్టినా కోచ్, జెస్సికా మెయిర్ స్పేస్ వాక్ చేశారు' అని నాసా అధికారులు తెలిపారు. నాసా అడ్మినిస్ట్రేటర్ జిమ్ బ్రైడెన్స్టైన్ మాట్లాడుతూ.. 'అంతరిక్షంలో అందరికీ సమాన అవకాశాలుంటాయని నిరూపించే క్రమంలో ఈ ఘటన మైలురాయి లాంటిది. నాకు 11 ఏండ్ల కూతురు ఉన్నది. ఎదుగుతున్నప్పుడు నేను అందుకున్న అన్ని అవకాశాలు తనకూ లభించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.



# పాలా?.. పాపాలా?

**దేశవ్యాప్తంగా పాల నాణ్యతకు తిలోదకాలు**

- శుద్ధిచేసిన పాలలోనూ అఫ్లటాక్సిన్, పురుగుమందుల అవశేషాలు
- నిర్దేశిత ప్రమాణాలను అందుకోని 37.7 శాతం శాంపిళ్లు
- వీటిలో అగ్రశ్రేణి కంపెనీల బ్రాండ్లు
- 12 శాతం నమూనాలలో కల్తీ ఆనవాళ్లు
- ఎఫ్ఎస్ఎస్ఏఐ అధ్యయనంలో వెల్లడి



**6,432** పరీక్షించిన మొత్తం శాంపిళ్లు

**2,607** ప్రాసెస్డ్ మిల్క్ శాంపిళ్లు — **37.7%** కలుషితం



**3,825** ముడి పాల శాంపిళ్లు — **47.7%** కలుషితం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** దేశంలో పాల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శుద్ధిచేసిన పాలలోనూ (ప్రాసెస్డ్ మిల్క్) నాణ్యత ప్రమాణాలు కొరవడినట్లు 'భారత ఆహార భద్రత ప్రమాణాల అధీకృత సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అధ్యయనంలో వెల్లడైంది. పరీక్షించిన మొత్తం పాల శాంపిళ్లలో 37.7 శాతం ప్రాసెస్డ్ మిల్క్ శాంపిళ్లు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను అందుకోవడంలో విఫలమైనట్లు సర్వేలో తేలింది. ఇందులో దేశంలోని అగ్రశ్రేణి కంపెనీల బ్రాండ్లు సైతం ఉండడం గమనార్హం. భద్రతా ప్రమాణాల విషయంలోనూ 10.4 శాతం ప్రాసెస్డ్ మిల్క్ శాంపిళ్లు విఫలమైనట్లు వెల్లడైంది. మరోవైపు 12 శాతం నమూనాలలో కల్తీ ఉన్నట్లు గుర్తించారు. ఈ కల్తీ శాంపిళ్లు తెలంగాణ, మధ్యప్రదేశ్, కేరళలో ఎక్కువగా నమోదయ్యాయి. 2018 మే నుంచి అక్టోబర్ మధ్య దేశవ్యాప్తంగా 1,103 నగరాలు, పట్టణాల నుంచి మొత్తం 6,432 పాల నమూనాలను (శాంపిళ్లను) సేకరించి ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో 40.5 శాతం శుద్ధిచేసిన పాల శాంపిళ్లు కాగా, మిగిలినవి శుద్ధిచేయని ముడి పాలకు సంబంధించినవి. వ్యవస్థీకృత డెయిరీ రంగం నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సిందేనని, 2020 జనవరి 1నాటికి అన్ని డెయిరీ యూనిట్లలోనూ 'పరీక్ష, తనిఖీ' వ్యవస్థను ఏర్పాటుచేయాల్సి ఉంటుందని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టంచేసింది.

**కల్తీ కంటే కలుషితమే ప్రమాదకరం**

పాల నాణ్యతపై అధ్యయన వివరాలను శుక్రవారం ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో పవన్ అగర్వాల్ వెల్లడించారు. శుద్ధిచేసిన పాలలో అఫ్లటాక్సిన్-ఎం1, యాంటీబయాటిక్స్, పురుగుమందుల అవశేషాలను గుర్తించినట్లు చెప్పారు. భద్రతా ప్రమాణాలకు సంబంధించి, మొత్తం శుద్ధి చేసిన శాంపిళ్లలో (2,607) 10.4 శాతం శాంపిళ్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన ప్రమాణాలను అందుకోలేదని వివరించారు. 'ముడి పాలలో కంటే ప్రాసెస్ చేసిన పాలలో అఫ్లటాక్సిన్-ఎం1 సమస్య అధికంగా ఉన్నది. తమిళనాడు, ఢిల్లీ, కేరళ నుంచి సేకరించిన శాంపిళ్లలో ఈ అవశేషం ఎక్కువగా ఉన్నది' అని అగర్వాల్ తెలిపారు. ఆహారం, పశుగ్రాసం ద్వారా అఫ్లటాక్సిన్.. పాలలో చేరుతుందని, అఫ్లటాక్సిన్ అవశేషాలకు సంబంధించి దేశంలో సమగ్ర సర్వే చేపట్టడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. అఫ్లటాక్సిన్‌ను గుర్తించడానికి దేశంలో సరైన ల్యాబ్ అందుబాటులో లేదు. అఫ్లటాక్సిన్‌ను గుర్తించే పరికరాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అగర్వాల్ తెలిపారు. నాణ్యతకు సంబంధించి, మొత్తం 37.7% పాల నమూనాలు నిర్దేశిత ప్రమాణాలను పాటించలేదని, వాటిల్లో కొవ్వులు, ఎస్ఎన్ఎఫ్(సాలిడ్స్-నాట్-ఫ్యాట్), షుగర్, మాల్టోడెక్స్ట్రిన్ వంటి కలుషితాలు పరిమితికి మించి ఉన్నట్లు గుర్తించామన్నారు. అదే ముడి పాల విషయంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉన్నది. మొత్తం 3,825 నమూనాలలో 47% నమూనాలు నిర్దేశిత భద్రతా ప్రమాణాలకు తగ్గట్లు లేవని అగర్వాల్ తెలిపారు.

**రైతుల్లో అవగాహన పెంచాలి..**

వ్యవస్థీకృత డెయిరీ సెక్టార్‌కు ఈ అధ్యయనం ఒక మేల్కొలుపు వంటిదని చెప్పారు. 'కొవ్వులు, ఎస్ఎన్ఎఫ్.. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేవు. వ్యవస్థీకృత రంగం తగిన చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం. వచ్చే 6-8 నెలల్లో ప్రమాణాలకు కట్టుబడి ఉంటారని అనుకుంటున్నాం' అని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించగా.. 'వారు మాతో విభేదించవచ్చు. మా అధ్యయనాన్ని సవాల్ చేయొచ్చు. అయినప్పటికీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలను వారు పాటించాల్సి ఉంటుంది' అని ఆయన బదులిచ్చారు. అవ్యవస్థీకృత రంగంలో నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ముడి పాలు నాణ్యంగా ఉండేలా చూసేందుకు, నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరామన్నారు. పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉన్నది.

> "పాలల్లో కల్తీ ఎక్కువని సామాన్యులు భావిస్తారు. అయితే కల్తీ కంటే కలుషితమే అత్యంత ప్రమాదకర సమస్య అని మా అధ్యయనంలో తేలింది. ప్రధాన బ్రాండ్లకు చెందిన ప్రాసెస్డ్ మిల్క్‌లోనూ మలినాలు ఉన్నట్టు గుర్తించాం."
>
> **- పవన్ అగర్వాల్, ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో**

# కొత్త సీజేఐ జస్టిస్ బోబ్డే!

- వచ్చేనెల 17న సీజేఐ జస్టిస్ గొగోయ్ పదవీ విరమణ
- తన వారసుడిగా జస్టిస్ బోబ్డే పేరు సూచిస్తూ కేంద్రానికి లేఖ
- నిబంధనల ప్రకారం అత్యంత సీనియర్ న్యాయమూర్తికే సీజేఐ పదవి
- జస్టిస్ బోబ్డే ఎంపిక లాంఛనమే

**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) రంజన్ గొగోయ్ నవంబర్ 17న పదవీ విరమణ చేయనుండటంతో తదుపరి సీజేఐ ఎవరనేది ఆసక్తికరంగా మారింది. తాజాగా సీజేఐ గొగోయ్ తన సహచరుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎస్ఏ బోబ్డే పేరును తన వారసుడిగా ప్రతిపాదించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు ఆయన లేఖ రాసినట్టు వెల్లడించాయి. న్యాయ మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనలను ప్రధాని దృష్టికి తీసుకెళ్తుంది. అనంతరం ప్రధాని కొత్త సీజేఐ పేరును రాష్ట్రపతికి సిఫారసు చేస్తారు. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల్లోని అత్యంత సీనియర్ న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తిగా నియమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జస్టిస్ ఎస్ఏ బోబ్డే అత్యంత సీనియర్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎంపిక లాంఛనం కానున్నది. సుప్రీంకోర్టు 46వ సీజేఐగా కొనసాగుతున్న రంజన్ గొగోయ్ గత ఏడాది అక్టోబర్ 3న పదవిని స్వీకరించారు. నవంబర్ 17న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన మొత్తం 13 నెలల 15 రోజులపాటు సీజేఐగా కొనసాగనున్నారు. జస్టిస్ ఎస్ఏ బోబ్డే నవంబర్ 18వ తేదీన ప్రమాణం చేస్తే మరో 18 నెలలపాటు ఆ పదవిలో కొనసాగుతారు.



ఎస్ఏ బోబ్డే

**లాయర్ల కుటుంబం నుంచి సీజేఐ దాకా..**

జస్టిస్ బోబ్డే పూర్తిపేరు శరద్ అరవింద్ బోబ్డే. ఆయనది లాయర్ల కుటుంబం. ఆయన తాత న్యాయవాది. తండ్రి అరవింద్ బోబ్డే మహారాష్ట్రలో 1980-85 మధ్య అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. అన్నయ్య వినోద్ అరవింద్ బోబ్డే సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేశారు.

**41 ఏండ్లుగా న్యాయవ్యవస్థలోనే..**

బోబ్డే 1956 ఏప్రిల్ 24న జన్మించారు. 1978లో నాగపూర్ యూనివర్సిటీ నుంచి న్యాయవాద పట్టా పొందారు. అదే ఏడాది సెప్టెంబర్ 13న న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1998లో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా మారారు. బోబ్డే 2000 మార్చి 29న బాంబే హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2012 అక్టోబర్ 16న మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఏడాది తర్వాత 2013 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. దాదాపు 41 ఏండ్లుగా న్యాయవ్యవస్థకు సేవలందిస్తున్న జస్టిస్ ఎస్ఏ బోబ్డే.. వచ్చే నెలలో సుప్రీంకోర్టు 47వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేస్తే.. 2021 ఏప్రిల్ 23వరకు ఆ పదవిలో కొనసాగుతారు.

**కీలక తీర్పులు..**

బోబ్డే తన కెరీర్‌లో ఇప్పటివరకు పలు కీలక తీర్పుల్లో భాగస్వామి అయ్యారు. వీటిలో దీపావళినాడు ఢిల్లీలో పటాకులు అమ్మడంపై నిషేధం విధించడం, ఆధార్ వినియోగంపై స్పష్టత ఇచ్చిన తీర్పులు ఉన్నాయి.

- ఢిల్లీలో వాయుకాలుష్యం విషమ స్థాయికి చేరడంతో.. 2016లో జస్టిస్‌లు బోబ్డే, టీఎస్ ఠాకూర్, అర్జున్ కుమార్ సిక్రితో కూడిన ధర్మాసనం దీపావళినాడు పటాకులు కాల్చడంపై ఆంక్షలు విధించింది.
- ఆధార్ వినియోగంపై స్పష్టత ఇచ్చిన తీర్పులో జస్టిస్ బోబ్డే కూడా భాగస్వామి. ఆధార్ కార్డు లేకున్నా ప్రభుత్వ సేవలన్నీ పొందవచ్చని జస్టిస్‌లు ఎస్ఏ బోబ్డే, జాస్తి చలమేశ్వర్, చొక్కలింగం నాగప్పన్‌తో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది.
- 2017లో ఓ మహిళ వైద్య సంబంధ కారణాలు చూపుతూ తన కడుపులోని 26 వారాల పిండాన్ని తొలిగించడానికి అనుమతి కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ పిండం బతికే అవకాశాలు ఉన్నాయంటూ మెడికల్ బోర్డు నివేదిక ఇవ్వడంతో జస్టిస్‌లు ఎస్ఏ బోబ్డే, ఎల్ నాగేశ్వర్‌రావుతో కూడిన ధర్మాసనం ఆమె ప్రతిపాదనను తిరస్కరించింది.
- 2017లో 'మాతే మహాదేవి' అనే పుస్తకం వల్ల బసవన్న భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, ఇది మత ఘర్షణలకు దారితీసే అవకాశం ఉన్నదంటూ కర్ణాటక ప్రభుత్వం ఆ పుస్తకంపై నిషేధం విధించింది. దీనిపై రచయిత సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్‌లు ఎస్ఏ బోబ్డే, ఎల్ నాగేశ్వర్‌రావుతో కూడిన ధర్మాసనం కర్ణాటక ప్రభుత్వానికి మద్దతు పలికింది.

## నోబెల్ విజేత అభిజిత్ వామపక్షవాది

- ఆయన చెప్పినట్లు మనం వినాలని ఏమీ లేదు
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలు
- ఖండించిన ప్రతిపక్షాలు

**పుణె/కోల్‌కతా, అక్టోబర్ 18:** ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి విజేత, ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ వామపక్ష భావజాలం గల వ్యక్తి అని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. 'భారత మూలాలున్న బెనర్జీకి నోబెల్ బహుమతి రావడం గర్వించదగ్గ విషయమే. కానీ ఆయన చెప్పే మాటలను మనం వినాలని, ఆయన ఆలోచన విధానాన్ని ఆమోదించాలని ఏమీ లేదు' అని తెలిపారు. శుక్రవారం ఆయన మహారాష్ట్రలోని పుణెలో విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న 'కనీస ఆదాయ హామీ పథకానికి' (న్యాయ్) బెనర్జీ మద్దతు తెలిపారని, కానీ ఈ పథకాన్ని ప్రజలు తిరస్కరించారని చెప్పారు. దీన్ని బట్టి బెనర్జీ ఆలోచన విధానాన్ని ప్రజలు తిరస్కరించినట్లు అర్థమవుతున్నదని తెలిపారు. ఇండో-అమెరికన్ అయిన బెనర్జీ ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడు మాట్లాడుతూ.. పీయూష్ గోయల్ వ్యాఖ్యలు బీజేపీ సంకుచిత మనస్తత్వాన్ని తెలియజేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ నేత ప్రదీప్ భట్టాచార్య స్పందిస్తూ అభిజిత్‌పై విమర్శలు చేయడం బీజేపీ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమని చెప్పారు.

## హిందూ సమాజ్ పార్టీ అధ్యక్షుడి దారుణ హత్య

ఉత్తరప్రదేశ్‌లో ఘటన

**లక్నో:** హిందూ సమాజ్ పార్టీ అధ్యక్షుడు కమలేశ్ తివారీ శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని ఆ పార్టీ కార్యాలయానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపి కత్తితో గొంతుకోసి చంపారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. ఓ పని కోసమంటూ కమలేశ్ పార్టీ కార్యాలయానికి వచ్చిన దుండగులకు అక్కడి సిబ్బంది టీ కూడా ఇచ్చినట్లు తెలుస్తున్నది. అనంతరం వారు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సంఘటన స్థలంలో ఉన్న పడి ఉన్న ఓ దేశీయ తుపాకీ, మందుగుండును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందుతుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మహ్మద్ ప్రవక్తపై కమలేశ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ఈ హత్యకు కారణంగా తెలుస్తున్నది.

## సొమ్ము బ్యాంకులది.. సోకు రతుల్‌ది!

రుణాల సొమ్ముతో మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మేనల్లుడి రాజభోగాలు: ఈడీ



**న్యూఢిల్లీ:** వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న దుబాయ్ హవాలా వ్యాపారి రాజీవ్‌సక్సేనా ఇచ్చిన క్రెడిట్‌కార్డుతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్‌పురి అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. ప్రైవేట్ జెట్ విమానాల్లో ప్రయాణించేందుకు, నైట్‌క్లబ్బులను సందర్శించేందుకు ఆయన ఈ కార్డును ఉపయోగిస్తున్నాడని పేర్కొన్నది. రూ.8,000 కోట్ల బ్యాంకు రుణాల మనీల్యాండరింగ్ కేసుకు సంబంధించి రతుల్‌పురి, అతని అనుచరులతోపాటు మోసర్‌బేర్ ఇండియా లిమిటెడ్ (రతుల్‌పురి తండ్రి ప్రమోట్‌చేస్తున్న సంస్థ)పై గురువారం ప్రత్యేక కోర్టులో దాఖలుచేసిన అభియోగపత్రం (చార్జిషీట్)లో ఈడీ ఈ ఆరోపణలు చేసింది. బ్యాంకుల నుంచి రుణాల రూపంలో స్వీకరించిన నిధులను రతుల్‌పురి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోసర్‌బేర్ అనుబంధ సంస్థలకు రుణాలు, పెట్టుబడులు సమకూర్చే నెపంతో బదిలీచేశాడని, విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు 45 లక్షల డాలర్లు (దాదాపు రూ.32 కోట్లు) ఖర్చుచేసినట్టు పేర్కొంది.

## హక్కును వదులుకునేది లేదు

అయోధ్య వివాదంపై స్పష్టం చేసిన ముస్లిం పక్షాలు

**న్యూఢిల్లీ:** అయోధ్య భూ వివాద పరిష్కారానికి సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన మధ్యవర్తిత్వ కమిటీ ప్రతిపాదించిన మధ్యేమార్గ పరిష్కారానికి తాము అంగీకరించేది లేదని ముస్లిం పక్షాలు స్పష్టం చేశాయి. సున్నీ వక్ఫ్ బోర్డు వివాదాస్పద భూమిపై హక్కును వదులుకొనేందుకు సమ్మతి తెలిపిందన్న వార్తలపై విస్మయం వ్యక్తంచేశాయి.'బాబ్రీ మసీదు స్థలంపై ఉత్తర్‌ప్రదేశ్ సున్నీ వక్ఫ్ బోర్డు హక్కులు వదులుకునేందుకు సమ్మతి తెలిపిందని న్యాయవాది షాహిద్ రిజ్వీ పేర్కొట్లు మీడియా వచ్చిన కథనాలు మమ్మల్ని విస్మయపరిచాయి' అని కీలక కక్షిదారులైన ఎం సిద్ధిఖీ, మిస్బాహుద్దీన్, ఇతర ముస్లిం పక్షాల తరఫు న్యాయవాదులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యవర్తిత్వ కమిటీ ప్రతిపాదనకు తాము అంగీకరించబోమని స్పష్టంచేశారు.

# కల్కి అక్రమాస్తులు 500 కోట్లు!

- ఆశ్రమాలు, వ్యాపార సంస్థల్లో కొనసాగుతున్న ఐటీ దాడులు
- బయటపడ్డ నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, వజ్రాలు
- రూ.93 కోట్ల వరకు సొత్తు జప్తు
- కీలక పత్రాలు, హార్డ్‌డిస్కులు, పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం
- ఇంకా అజ్ఞాతంలోనే విజయ్‌కుమార్ దంపతులు



**బెంగళూరు/హైదరాబాద్/చిత్తూరు, అక్టోబర్ 18:** కల్కిభగవాన్, అమ్మ భగవాన్ పేరుతో చెలామణి అయిన విజయ్‌కుమార్ దంపతుల లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో 40 ప్రాంతాల్లోని కల్కి ఆశ్రమాలు, నివాసాలు, వ్యాపార సంస్థలపై ఆదాయం పన్ను (ఐటీ) అధికారుల దాడులు శుక్రవారం కూడా కొనసాగాయి. లోతుగా దర్యాప్తు చేస్తున్నకొద్దీ కల్కి దంపతుల అక్రమాల పుట్ట పగులుతున్నది. ఈ దంపతులు రూ.500 కోట్లకు పైగా అక్రమాస్తులను కూడబెట్టినట్టు అధికారులు గుర్తించారు. మూడు రోజుల సోదాల్లో రూ.93 కోట్ల మేర సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఐటీ అధికారులు తెలిపారు.

**నగదు కట్టలు.. కిలోల కొద్దీ బంగారం**

ఐటీ సోదాల్లో అధికారులు భారీగా స్వదేశీ, విదేశీ కరెన్సీని, కిలోలకొద్దీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ రూ.93 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో రూ.43.9 కోట్ల స్వదేశీ కరెన్సీ ఉన్నట్టు చెప్పారు. విదేశీ కరెన్సీలో అత్యధికంగా రూ.18 కోట్లు విలువ చేసే 25 లక్షల అమెరికన్ డాలర్లు ఉన్నాయన్నారు. వీటితోపాటు 88 కిలోల బంగారం (విలువ రూ.26 కోట్లు), 1271 కేరట్ల వజ్రాలను (విలువ రూ.5 కోట్లు) స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీటితో పాటు రూ.409 కోట్ల మేర అక్రమాస్తులు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీటికి సంబంధించిన పలు కీలక పత్రాలను, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఐటీ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఇతడు (కల్కి) 1980ల్లో వన్నెస్ పేరుతో ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్, నిర్మాణం, ఆటలు ఇలా అనేక రంగాలకు విస్తరించారు. దేశ, విదేశాల్లో కార్యకలాపాలు ప్రారంభించారు. సంస్థకు చెందిన ట్రస్టుల్లో తత్వశాస్త్రం, ఆధ్యాత్మికత వంటి వెల్‌నెస్ కోర్సులను, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. వీటిద్వారా దేశ, విదేశాలకు చెందిన వ్యక్తులను ఆకర్షించారు. ముఖ్యంగా విదేశాల నుంచి వచ్చినవారి ద్వారా భారీగా విదేశీ కరెన్సీని సంపాదించారు. ఈ డబ్బును ఏపీ, తమిళనాడుతోపాటు పలు ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టారు. ఐటీ సోదాల నేపథ్యంలో వీటికి సంబంధించిన పత్రాలను ట్రస్టు సభ్యులు ధ్వంసం చేస్తున్నట్టు మాకు సమాచారం ఉన్నది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లోని ఆశ్రమాల్లో వివిధ రూపాల్లో భారీగా విరాళాలను స్వీకరిస్తున్నారని, ఆ డబ్బును లెక్కల్లో చూపకుండా దాచేస్తున్నారని అధికారులు తెలిపారు. దీంతోపాటు రియల్ ఎస్టేట్‌లో వచ్చిన డబ్బును కూడా నల్లధనంగా మార్చుతున్నట్టు తేలిందన్నారు. మొత్తంగా రూ.500 కోట్లకుపైగా అక్రమాస్తులను గుర్తించామని చెప్పారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, చిత్తూరు తదితర 40 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నట్టు వివరించారు.

**విదేశీ కరెన్సీ దారి మళ్లింపు**

కల్కి కుటుంబం దేశ, విదేశాల్లోని అనేక కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిందని ఐటీ అధికారులు తెలిపారు. అమెరికా, చైనా, సింగపూర్, దుబాయ్ దేశాల్లో ఉన్న కంపెనీల్లోనూ వీరికి వాటాలు ఉన్నట్టు వెల్లడించారు. వెల్‌నెస్ కోర్సులకు హాజరయ్యే విదేశీ క్లయింట్ల నుంచి ఫీజులు, విరాళాల రూపంలో వచ్చిన డబ్బును హవాలా మార్గంలో ఈ కంపెనీల్లోకి మళ్లించినట్టు గుర్తించామన్నారు. ట్రస్టుకు చెందిన ఓ వ్యక్తి కమీషన్ తీసుకొని మొత్తం డబ్బును అధికారుల కండ్లుగప్పి వివిధ మార్గాల్లో విదేశాలకు తరలించినట్టు అనుమానిస్తున్నామన్నారు.

# గ్రే జాబితాలోనే పాక్

- ఉగ్రవాదులకు నిధులను అడ్డుకోవడంలో విఫలం
- 27 కార్యాచరణ అంశాల్లో ఐదే అమలు
- వైఖరి మార్చుకోకపోతే చర్యలు
- ఎఫ్ఏటీఎఫ్ హెచ్చరిక
- వచ్చే ఫిబ్రవరి వరకు గడువు

**పారిస్, అక్టోబర్ 18:** మనీల్యాండరింగ్‌తో పాటు ఉగ్రవాదులకు నిధుల చేరవేతను అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైన పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ఉగ్రవాద నిధుల నిరోధక సంస్థ 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్' (ఎఫ్ఏటీఎఫ్) గట్టి హెచ్చరికలు పంపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పాక్‌ను 'గ్రే' జాబితాలోనే ఉంచుతున్నట్లు ప్రకటించింది. ఆలోగా తన పనితీరును మెరుగుపరుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేసింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఐదు రోజులపాటు కొనసాగిన ప్లీనరీ సమావేశాల అనంతరం శుక్రవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. లష్కరే తాయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలకు నిధులు అందకుండా నియంత్రించేందుకు తాము నిర్దేశించిన 27 కార్యాచరణ అంశాల్లో పాకిస్థాన్ కేవలం ఐదు అంశాలనే అమలుచేసిందని ఎఫ్ఏటీఎఫ్ పేర్కొంది. పాక్‌ను గ్రే జాబితాలోనే కొనసాగిస్తూ.. మనీల్యాండరింగ్‌ను, ఉగ్రవాదులకు ఆర్థిక సాయాన్ని అడ్డుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పాక్ భవితవ్యంపై వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించింది. 'పాక్ మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. 2020 ఫిబ్రవరి నాటికి పురోగతి కనిపించకపోతే పాక్‌ను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతాం' అని ఎఫ్ఏటీఎఫ్ అధ్యక్షుడు జియాంగ్‌మిన్ లియూ వ్యాఖ్యానించారు. తాజా నిర్ణయం నేపథ్యంలో పాక్‌కు నిధులు ఇవ్వకుండా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు ఎఫ్ఏటీఎఫ్ నోటీసులు పంపనుంది. పాక్ గ్రే జాబితాలోనే కొనసాగినా లేదా డార్క్ గ్రే జాబితాలో చేరినా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, యూరోపియన్ యూనియన్ తదితర సంస్థల నుంచి ఆ దేశానికి నిధులు అందవు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన పాక్‌కు ఈ నిర్ణయం శరాఘాతంగా మారనుంది. పాకిస్థాన్‌తో సహా సమీక్షకు వచ్చిన అన్ని దేశాలపై ఎఫ్ఏటీఎఫ్ చర్చించింది. 27 అంశాల కార్యాచరణ ప్రణాళికను అమలుచేయడంలో పాక్ విఫలమైందని ఏకాభిప్రాయం వ్యక్తమైంది. పాక్ పేలవ పనితీరుతో వచ్చే కొన్నేండ్లలో ఆ దేశం గ్రే జాబితా నుంచి బయటపడే అవకాశాలు కనుమరుగయ్యాయి. అంతేగాకుండా వచ్చే ఫిబ్రవరిలో అధికారికంగా బ్లాక్ లిస్టులో చేర్చే అవకాశం కూడా ఉన్నది. పాకిస్థాన్‌ను గతేడాది జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ గ్రే జాబితాలో చేర్చింది. 2019 అక్టోబర్ నాటికి పూర్తిచేయాలంటూ పాక్‌కు ఒక కార్యాచరణ ప్రణాళికను అందజేసింది. లేదంటే ఇరాన్, ఉత్తరకొరియా మాదిరిగా పాక్‌ను కూడా బ్లాక్ లిస్ట్‌లో పెడుతామని ఎఫ్ఏటీఎఫ్ హెచ్చరించింది.

## నగరాన్ని వణికించిన డ్రగ్స్ ముఠా!

- మెక్సికోలోని కులియకాన్‌లో ఘటన
- డ్రగ్స్ డాన్ ఎల్‌చాపో కుమారుడు అరెస్ట్‌కు నిరసనగా దుండగుల హింసాకాండ



**కులియకాన్ (మెక్సికో):** ఉత్తర మెక్సికోలో భీకర పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా దళాలు, మాదకద్రవ్యాల సాయుధ ముఠాల(డ్రగ్ కార్టల్స్) మధ్య జరిగిన కాల్పులతో కులియకాన్ నగరం దద్దరిల్లింది. డ్రగ్స్ డాన్ జాక్విన్ ఎల్‌చాపో గుజ్‌మన్ కుమారుడు ఒవిడో గుజ్‌మన్ లోపేజ్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో పరిస్థితి భయానకంగా మారింది. గుజ్‌మన్‌కు చెందిన సినలోవా కార్టల్ గ్యాంగ్ నగరంలో పెను విధ్వంసానికి పాల్పడింది. భారీ ఆయుధాలతో రోడ్లపైకి వచ్చిన ఆగంతకులు.. పోలీసులపై కాల్పులకు దిగారు. రహదారులన్నీ రక్తసిక్తం అయ్యాయి. వాహనాలను కూడా తగులబెట్టారు. పరిస్థితి అదుపు తప్పడంతో.. లోపేజ్‌ను పోలీసులు విడుదల చేశారు. హింసను అదుపు చేయాలన్న ఉద్దేశంతోనే పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఇక, డ్రగ్ కార్టల్స్ సృష్టించిన బీభత్సం కారణంగా భయపడిన పలు వాహనదారులు రోడ్లపైనే తమ వాహనాల్ని వదిలేసి పరిగెత్తారు. దుండగులు ప్రధాన రహదారులను నిర్బంధించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి దాదాపు 7,50,000 మంది వాహనదారులు అవస్థలు పడ్డారు.

# భగ్నమైన అమెరికా కల

- ఢిల్లీకి చేరుకున్న 311 మంది భారతీయులు
- మెక్సికో సరిహద్దుల నుంచి అక్రమ ప్రవేశానికి విఫలయత్నం
- పట్టుకొని వెనక్కి పంపిన అధికారులు



మెక్సికో నుంచి ఢిల్లీకి చేరుకున్న బాధితులు

**మెక్సికో సిటీ, అక్టోబర్ 18:** అమెరికాలో పని చేసి మెరుగైన జీవనం సాగించాలన్న వారి ఆశలు అడియాసలయ్యాయి. మెక్సికో సరిహద్దుల మీదుగా అక్రమ మార్గాల్లో అమెరికాలో ప్రవేశించడానికి వారు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. మెక్సికో జాతీయ వలస ప్రజల సంస్థ (ఐఎన్ఎం), ఇమ్మిగ్రేషన్ అధికారులు సరిహద్దుల్లో బుధవారం తనిఖీ చేయడంతో ఒక మహిళ సహా 311 మంది భారతీయులు పట్టుబడ్డారు. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో భారతీయ అధికారులను మెక్సికో అధికారులు సంప్రదించారు. వారిని బోయింగ్ 747విమానం ద్వారా తిప్పి పంపారు. సదరు విమానం మెక్సికో నుంచి స్పెయిన్ మీదుగా శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నది. ఇలా మెక్సికోకు వెళ్లిన వారిలో అత్యధికులు పంజాబ్, హర్యానా రాష్ట్రాల వాసులే. అత్యధికులు 19-35 ఏండ్ల లోపు వారే. ఈక్వెడార్, కోస్టారికా, గ్వాటెమలా మీదుగా వీరు మెక్సికోకు చేరుకున్నారు. అమెరికాలో ప్రవేశించడం కోసం గంటల కొద్దీ, రోజుల కొద్దీ అడవుల్లో నడిచామని, రూ.లక్షల్లో ఖర్చు చేసి, చివరకు అవమానకరంగా స్వదేశానికి చేరుకున్నామని జాషన్‌ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. పాటియాలాకు చెందిన మన్‌దీప్ సింగ్ (19) జూన్‌లోనే దేశాన్ని వీడాడు. పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న మన్‌దీప్.. అమెరికాకు వెళ్లేందుకు ఈక్వెడార్ సహా ఏడుదేశాల మీదుగా మెక్సికోకు చేరుకున్నాడు. ఏడు రోజులు పనామా అడవుల్లో నడిచి, మెక్సికోకు చేరుకున్నానని, అమెరికాకు 800 కి.మీ. దూరంలో పట్టుబడ్డామన్నాడు. కమల్‌జిత్ కౌర్ అనే మహిళ జలంధర్ వాసి. ఆమె తన భర్త, కొడుకుతో కలిసి అమెరికాకు వెళ్లేందుకు రూ.53 లక్షలు ఖర్చు చేసినట్లు వాపోయారు. గౌరవ్‌కుమార్ మాట్లాడుతూ భారతీయులను మాత్రమే తిప్పి పంపారని, శ్రీలంక, నేపాల్, కామరూన్ దేశాల పౌరులు అక్కడే ఉన్నారన్నారు. కాగా సరిహద్దుల నుంచి అక్రమ వలసలను నిరోధించడానికి మెక్సికోతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది జూన్‌లోనే ఒప్పందం కుదుర్చుకున్నారు.

# విద్యాపరిశోధన హబ్‌గా తెలంగాణ

- హార్వర్డ్ వర్సిటీ ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో వైద్యపరిశోధన కేంద్రం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యాపరిశోధన హబ్‌గా తెలంగాణ ఎదుగుతున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చెప్పారు. హార్వర్డ్ యూనివర్సిటీ-లక్ష్మీ మిట్టల్ సౌత్ ఏసియా ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో త్వరలోనే హైదరాబాద్‌లో వైద్య పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని అన్నారు. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని లక్ష్మీమిట్టల్ అండ్ ఫ్యామిలీ, సౌత్‌ఏసియా ఇన్‌స్టిట్యూట్, హార్వర్డ్ వర్సిటీ ప్రతినిధి సవితా జీ అనంత్ సందర్శించారు. రాష్ట్రంలో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన సానుకూల అంశాలపై ఆమెతో చర్చించామని వినోద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి. చిత్రంలో హార్వర్డ్ వర్సిటీ ప్రతినిధి సవితా జీ అనంత్ తదితరులు ఉన్నారు.

# వ్యక్తిత్వ వికాసశిక్షణ అవసరం

మిత అయ్యళ్వార్ సంఘం కృషి అభినందనీయం: మంత్రి కొప్పుల ఈశ్వర్



కొంపల్లిలో మిత అయ్యళ్వార్ సంఘం వ్యక్తిత్వ వికాస కేంద్రం ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యార్థులు, యువతకు వ్యక్తిత్వ వికాస శిక్షణ ఎంతో అవసరమని, చిన్నారుల ప్రయోజనానికి మిత అయ్యళ్వార్ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కొంపల్లిలో నిర్మించిన బాలల విద్య, ఉద్యోగ, ఉపాధి, సాంస్కృతిక, వ్యక్తిత్వ వికాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేవలం 20-25 వేల మంది సభ్యులున్న ఈ సంఘంవారు తమవారి కోసం ప్రత్యేకంగా ఒక వ్యక్తిత్వ వికాస కేంద్రాన్ని ఏర్పాటుచేసుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ఈ సంఘం సభ్యులు ఎంతో శ్రమకోర్చి సంఘ భవనాన్ని ఏర్పాటుచేసుకున్నారని ప్రశంసించారు. పేద పిల్లలను, నిరుద్యోగులను చేరదీసి వారి జీవితాలను బాగుచేసేందుకు వ్యక్తిత్వ వికాస కేంద్రం వేదిక కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో మిత అయ్యళ్వార్ సంఘం అధ్యక్షుడు దురోవెల సత్తయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్‌లో లౌకికవాద పార్టీకే మద్దతు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో లౌకికవాద పార్టీకే తమ మద్దతు అని, అలాంటి పార్టీనే గెలిపించాలని శ్రేణులకు పిలుపునిచ్చామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సమావేశమై ఆర్టీసీ సమ్మెపై చర్చించింది. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు చాడ చెప్పారు.

## బోటు వెలికితీత పనులు ముమ్మరం

50 అడుగుల లోతులో బోటు గుర్తింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరు వద్ద సెప్టెంబర్ 15న గోదావరిలో మునిగిన రాయల్ వశిష్ట బోటు వెలికితీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నెల రోజులుగా బోటు జాడ కోసం వివిధ బృందాలను రంగంలోకి దింపినా ఫలితం లేకపోవడంతో చివరి ప్రయత్నంగా ఏపీ ప్రభుత్వం వెలికితీత పనులను ధర్మాడి సత్యం బృందానికి అప్పగించింది. ఈ మేరకు గురువారం ధర్మాడి సత్యం బృందం పెద్ద లంగరు సాయంతో గాలిస్తుండగా బోటు రెయిలింగ్ చిక్కిన విషయం తెలిసిందే. శుక్రవారం సైతం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం బోటు 50 అడుగుల లోతులో ఉన్నట్టు గుర్తించారు. కాకినాడ పోర్టు అధికారి ఆదినారాయణ పర్యవేక్షణలో వెలికితీత పనులు కొనసాగుతున్నాయి. విశాఖపట్నం నుంచి గజ ఈతగాళ్లను రప్పిస్తున్నామని సత్యం తెలిపారు.

## గోతిలో పడ్డ స్కూల్ వ్యాన్

ముగ్గురు విద్యార్థులు దుర్మరణం.. మధ్యప్రదేశ్‌లో ఘటన

**షాజాపూర్, అక్టోబర్ 18:** మధ్యప్రదేశ్‌లో శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు బాలలు దుర్మరణం పాలవ్వగా, 22 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. షాజాపూర్ జిల్లాలోని రిచ్చోడ గ్రామ సమీపంలోని ప్రైవేట్ స్కూల్‌లో ఇండ్లకు వెళ్లేందుకు వ్యాన్ ఎక్కిన విద్యార్థులను తీసుకెళ్లాల్సిన డ్రైవర్.. వ్యాన్ రివర్స్‌ను చేస్తుండగా స్కూల్ బయట గల నీళ్లు ఉన్న గోతిలో పడిపోయిందని జిల్లా ఎస్పీ పంకా శ్రీవాత్సవ తెలిపారు. గ్రామస్థులు అక్కడికి చేరుకుని విద్యార్థులను రక్షించారు. అయితే, తీవ్ర గాయాలపాలైన ముగ్గురు చిన్నారులు మరణించారు. మరోవైపు హోసంగాబాద్ జిల్లా కేంద్రానికి 11 కి.మీ. దూరంలో సంగఖేడా- కాలా గ్రామాల మధ్య రోడ్డుపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీని స్కూల్ బస్సు ఢీకొట్టడంతో 22 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ రెండు ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమని వెల్లడైంది.

# విజయవంతంగా సివిల్ రైట్స్‌డే

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సీఎస్ జోషి అభినందన



శుక్రవారం బీఆర్కే భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితో సమావేశమైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారా జిల్లాల్లో సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అభినందనలు తెలిపారు. శుక్రవారం బీఆర్కే భవన్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు సీఎస్‌ను కలిశారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ఎస్టీ సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, కమిషన్ సభ్యులు, కార్యదర్శి పీ కరుణాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్‌కు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలను చైర్మన్ వివరించారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ.. వచ్చే నెల 30న కమిషన్ నిర్వహించే సివిల్ రైట్స్‌డేలో పాల్గొననున్నట్టు తెలిపారు. అలాగే పలు సూచనలు చేశారు. కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాల్లో సివిల్ రైట్స్‌డేను విజయవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి జిల్లాలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని సీఎస్‌కు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరిస్తున్నామని, ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (పీసీఆర్), ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ (పీవోఏ) చట్టాలపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. అట్రాసిటీ బాధితులకు వెంటనే సహాయం అందించేలా చూస్తున్నామని చెప్పారు. ఐజీ, పీసీఆర్ సెల్ ద్వారా ఆరువేల కేసులకు సంబంధించి రూ.40 కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించేలా కృషిచేశామని సీఎస్‌కు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దేశంలో రోల్ మోడల్‌గా నిలిచేలా కమిషన్ పనిచేస్తున్నట్టు వివరించారు.

**కెమికల్‌రంగ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి విజ్ఞప్తి**

తెలంగాణలో కెమికల్, పెట్రో కెమికల్స్ రంగాల అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వెల్లడించారు. ఈ క్రమంలో ఈ రంగాల అభివృద్ధికి కేంద్రం తగిన సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తిచేశారు. శుక్రవారం బీఆర్కే భవన్‌లో కేంద్ర కెమికల్స్, పెట్రో కెమికల్స్ కార్యదర్శి పీ రాఘవేంద్రరావు సీఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. కెమికల్, పెట్రో కెమికల్స్ రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నదని తెలిపారు. ఈ రెండు రంగాలు తగని రీతిన అభివృద్ధి చెందితే రాష్ట్రానికి ఆదాయం పెరుగడమే కాకుండా, యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) కార్యకలాపాలపై కూడా వారు చర్చించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్‌ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యపై హిందువులకు అనుకూలంగానే తీర్పు

ఆరెస్సెస్ ఆశాభావం

**భువనేశ్వర్, అక్టోబర్ 18:** అయోధ్యలో రామ జన్మభూమి-బాబ్రీ మసీదు భూవివాదంపై సుప్రీంకోర్టు తీర్పు హిందువులకు అనుకూలంగా వస్తుందని ఆశాభావంతో ఉన్నామని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి చెప్పారు. మూడురోజులుగా జరిగిన ఆరెస్సెస్ అఖిల భారతీయ కార్యకర్తల మండలి సమావేశాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా సున్నితమైన అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు బుధవారం తీర్పు రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. కాగా జాతి సంక్షేమం, భద్రత దృష్ట్యా రాష్ట్రాలన్నీ జాతీ య పౌర జాబితా (ఎన్నార్సీ)ని రూపొందించాలని భయ్యాజీ కోరారు. ఎన్నార్సీకి ఆరెస్సెస్ మద్దతునిస్తుందన్నారు. దేశ పౌరులు, వలస ప్రజలను గురించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. తద్వారా జాతి వ్యతిరేక కార్యకలాపాలను నిలువరించేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు లభిస్తుందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో హిందు జాతి నిర్మూలన చర్యలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.



రాజేంద్రనగర్‌లో సదస్సును జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న ఎన్ఐఎఫ్‌టీఈఎం వీసీ వాసుదేవప్ప

## ఆహారశుద్ధి గ్రోత్‌ఇంజిన్ మార్చాలి

ఎన్ఐఎఫ్‌టీఈఎం ఉపకులపతి డాక్టర్ సీ వాసుదేవప్ప

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం గ్రోత్‌ఇంజిన్‌ను మార్చాల్సిన అవసరమున్నదని హర్యానాలోని ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ సంస్థ (ఎన్ఐఎఫ్‌టీఈఎం) ఉపకులపతి డాక్టర్ సీ వాసుదేవప్ప అన్నారు. ఆహార పదార్థాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించినప్పటికీ.. ఫుడ్ ప్రాసెసింగ్‌రంగంలో తగినంత పురోగతి జరుగడం లేదని విచారం వ్యక్తంచేశారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ), ఫార్మ్ అండ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ (ఎఫ్ఆర్ఎస్ఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సీ వాసుదేవప్ప.. వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ జే రఘోత్తమ్‌రెడ్డి స్మారకోపన్యాసం చేశారు. దేశంలో సాలీన 800 మిలియన్ టన్నులకుపైగా ఆహారోత్పత్తులు జరుగుతున్నప్పటికీ ఆహారశుద్ధిరంగం అంతంత మాత్రంగానే ఉన్నదని చెప్పారు. ముఖ్యంగా పండ్లు, కూరగాయల్లో 60 శాతానికిపైగా వృథా ఉన్నదన్నారు. దీన్ని అరికట్టేందుకు ఆహారశుద్ధిరంగంలో చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడమే కాకుండా, విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించాలని సూచించారు. ఆహార భద్రత, సాగునీటి వనరుల పెంపుదలకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతోన్న కార్యక్రమాలను అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొంటున్నాయని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎస్ నరసింగరావు మాట్లాడుతూ.. వ్యవసాయరంగంలో వృద్ధిరేటు 5 శాతం స్థిరంగా దశాబ్దకాలంపాటు కొనసాగితేనే 11-12 శాతం జీడీపీ వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే ఉత్పాదకత పెంపుకన్నా ఫుడ్ సప్లయి చైన్‌పై దృష్టి నిలపాల్సిన అవసరమున్నదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, ఎఫ్ఆర్ఎస్ఎఫ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఏపూర్ కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు రైతులకు అవార్డులతో సత్కరించారు. అగ్రిజర్నలిజంలో సీ చంద్రశేఖర్‌కు అవార్డును బహూకరించారు.

# 200 ప్రభుత్వ స్కూళ్లలో 'మైండ్ స్పార్క్'

- 100 పాఠశాలల్లో డిజిటల్ విద్య.. మరో 100 స్కూళ్లలో సాధారణ విద్య
- ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్ నేతృత్వంలో ప్రయోగ కార్యక్రమం
- పిల్లల అభ్యసన స్థాయిని తెలుసుకోవడమే ధ్యేయం
- రెండేండ్లలో సర్కారుకు సమగ్ర నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో అభ్యసన స్థాయి (లెర్నింగ్ లెవల్స్) ఏ విధంగా ఉన్నది? వైవిధ్యమైన బోధనతో పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెరిగే అవకాశం ఉంటుందా? అనే అంశాలను తెలుసుకొనేందుకు తెలంగాణలోని 200 పాఠశాలల్లో 'మైండ్ స్పార్క్' పేరుతో ప్రయోగాత్మక కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. వీటిలో 100 స్కూళ్లకు కంప్యూటర్లు సరఫరాచేసి డిజిటల్ విధానంలో, మరో 100 స్కూళ్లలో కంప్యూటర్లు లేకుండా సాధారణ పద్ధతుల్లో విద్యను బోధించి పిల్లల అభ్యసన స్థాయిని నివేదిక రూపంలో వెల్లడిస్తారు. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన ప్రొఫెసర్ అభిజిత్ బెనర్జీ, ఆయన సతీమణి ఈస్టర్ డఫ్లో ఆధ్వర్యంలో కొనసాగుతున్న జమీల్ అబ్దుల్ లతీఫ్ పావర్టీ ఆక్షన్‌లాబ్ (జేపాల్) స్టీరింగ్ కమిటీ సభ్యునిగా పనిచేసిన ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్ పర్యవేక్షణలో 'మైండ్ స్పార్క్' కొనసాగుతుందని, ఇందుకోసం 'జేపాల్' ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రయోగ కార్యక్రమం తర్వాత ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్ ఇచ్చే నివేదిక, సలహాలు, సూచనల మేరకు రాష్ట్రంలో విద్యావిధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

**ఆర్థికశాఖ అనుమతి**

'మైండ్ స్పార్క్' కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించింది. రెండేండ్లపాటు కొనసాగే ఈ కార్యక్రమానికి దాదాపు రూ.10 కోట్లు అవసరమవుతాయని పేర్కొంటూ విద్యాశాఖ ప్రతిపాదనలు పంపడంతో నిధుల విడుదలకు ఆర్థిక శాఖ అనుమతించినట్లు తెలిసింది. 'మైండ్ స్పార్క్'ను మొదలుపెట్టేందుకు ఇప్పటికే 200 స్కూళ్లలో బేస్‌లైన్ టెస్ట్‌ను నిర్వహించారు. 36,216 మంది విద్యార్థులు హాజరైన ఈ పరీక్ష ఫలితాలు ఈ నెలాఖరుకు రానున్నాయి. ఆ తర్వాత డిజిటల్ విధానం, 'జేపాల్' సాఫ్ట్‌వేర్ సహాయంతో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందిస్తారు. ఎప్పటికప్పుడు పిల్లల అభ్యసన స్థాయిని అధ్యయనంచేసి, ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తారు.



## 'ఐవోటీ టెక్నాలజీ'తో ఆర్థికాభివృద్ధి

'ది థింగ్స్ కాన్ఫరెన్స్ ఇండియా' సదస్సులో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) టెక్నాలజీ వినియోగంతో దేశ ఆర్థికరంగం అభివృద్ధి సాధిస్తున్నదని ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలో ఏర్పాటుచేసిన 'ది థింగ్స్ కాన్ఫరెన్స్ ఇండియా-2019' సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. ఐవోటీ టెక్నాలజీతో కోట్ల సంఖ్యలో స్మార్ట్ పరికరాల ఏర్పాటుతోపాటు అతి తక్కువ ఖర్చుతో స్మార్ట్ నగరాలను రూపొందించడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజల జీవనశైలిని మెరుగుపర్చేందుకు ఈ టెక్నాలజీ దోహదపడుతుందని చెప్పారు. 100 స్మార్ట్ నగరాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐవోటీ టెక్నాలజీని ఉపయోగిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన విద్యుత్ పొదుపు, హెల్త్‌కేర్, వాతావరణ పర్యవేక్షణ వంటిరంగాల్లో ఐవోటీ టెక్నాలజీ అద్భుతమైన ఫలితాలను తెచ్చిపెట్టిందని తెలిపారు. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు సహకరిస్తున్న ఈ సదస్సులో 10 దేశాలకు చెందిన 60 మందికిపైగా నిపుణులు, 700 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో ది థింగ్స్ ఇండస్ట్రీస్ సహ వ్యవస్థాపకుడు యోహాన్ స్టోకింగ్, సీఈవో వీఎన్క్ గీజ్మాన్, మల్లిటెక్ సిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ కందికొండ, ఐబీ హబ్స్ సంస్థ సలహాదారు సంజీవ్ కే అయ్యర్, సైబర్ హబ్ సీఈవో రాంగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడెడ్ విద్యాసంస్థలపై సర్కారు దృష్టి

సమస్యల పరిష్కారానికి మంత్రి సబిత సానుకూలత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యాసంస్థల పనితీరుపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతోపాటు వారికి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే ప్రభుత్వ ఉద్యోగుల మాదరిగా తమకు కూడా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, తమ సంస్థల్లో నియామకాలు చేపట్టాలని ఎయిడెడ్ విద్యాసంస్థల సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఎయిడ్ తమకు వద్దని, తమ సంస్థలను ప్రైవేటు విద్యాసంస్థలుగా మార్చాలని కొన్ని ఎయిడెడ్ విద్యాసంస్థలు కోరుతున్నాయి. తద్వారా ఆయా ఎయిడెడ్ విద్యాసంస్థల ఆస్తులను తమ హస్తగతం చేసుకోవాలని యాజమాన్యాలు భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎయిడెడ్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను పరిష్కరించేందుకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సానుకూలత వ్యక్తం చేసినట్టు విద్యాసంస్థల సిబ్బంది చెప్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 691 ఎయిడెడ్ పాఠశాలలు పనిచేస్తున్నాయి. వాటిలో 1.06 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు నాలుగు వేల మందికిపైగా బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో దాదాపు 41 ఎయిడెడ్ జూనియర్ కాలేజీలుండగా.. వాటిలో ప్రస్తుతం 35 మాత్రమే నడుస్తున్నాయి. ఈ కళాశాలల్లో 12 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు 400 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో దాదాపు 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిలో మూడేండ్లకు కలిపి 29.6 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం ఈ కాలేజీల్లో 1,214 మంది టీచింగ్, 946 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. జీవో 35 ప్రకారం ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నియామకాలను గతంలోనే నిలిపివేసిన సంగతి తెలిసిందే.

## ఎన్ఎస్‌జీ కొత్త అధిపతి అనూప్‌కుమార్‌సింగ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) కొత్త అధిపతిగా అనూప్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. 1985 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయనను ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ నియామక కమిటీ ఆమోదం మేరకు బ్లాక్ క్యాట్స్ కమాండో బలగాల (ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్‌గా నియమించినట్లు శుక్రవారం ఓ అధికార ప్రకటన వెలువడింది. అనూప్ కుమార్ సింగ్ 2020 సెప్టెంబర్ 20 వరకు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నది. 1984 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి సుదీప్ లక్టాకియా పదవీ విరమణ అనంతరం నుంచి రెండు నెలలకుపైగా ఈ పోస్టు ఖాళీగా ఉన్నది.

Telangana State Co-operative Marketing Federation Ltd.,
5-2-68, 3rd Floor, Mahatma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad- 095. Ph: 040-24607106.
E-mail: engggtgmarkfed@gmail.com
Webpage: www.tsmarkfed.com
CORRIGENDUM
It is to inform that a tender notification was published in Namasthe Telangana State edition on 27-09-2019 for lease of TS MARKFED godowns. Due to administrative reasons, the last date for submission of tenders is extended up to 2:00 PM 23-10-2019.
Sd/- MANAGING DIRECTOR

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
దిగువ తెలిపిన పనుల కొరకు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సీల్డ్ బిడ్లు కోరుతోంది.
పనుల పేరు: (i) Spec. No.TST-CONST-e-07/2019-20-జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రతిపాదిత 400/220/132KV SS KTPPకి రామప్ప పాయింట్ (Loc. No. 92) వద్ద ప్రస్తుతమున్న 220KV పులుకుర్తి-భీమ్‌ఘన్‌పూర్ ట్విన్ మూస్ లైన్ యొక్క LILO మేకింగ్ కొరకు 220KV ట్విన్ మూస్ DC లైన్ (24 KM) స్థాపన.
(ii) Spec. No.TST-CONST-e-08/2019-20-లాట్-I: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రతిపాదిత 400/220/132KV KTPP SSకి రామప్ప పాయింట్ (Loc. No. 66) వద్ద ప్రస్తుతమున్న 220KV సలివాగు-భీమ్‌ఘన్‌పూర్ ట్విన్ మూస్ లైన్ యొక్క LILO మేకింగ్ కొరకు 220KV ట్విన్ మూస్ DC లైన్ (22 KM) స్థాపన.
లాట్-II: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో (i) ప్రతిపాదిత 400/220/132KV SS KTPP నుండి ప్రస్తుతమున్న 132/33KV SS చేల్పూర్ వరకు 220KV మల్టీ సర్క్యూట్ టవర్స్‌పై 132KV సింగిల్ మూస్ DC లైన్ (2 KM) మరియు (ii) 132/33KV SS చేల్పూర్ వద్ద 2 నెం.లు 132KV బే ఎక్స్‌టెన్షన్లు స్థాపన.
(iii) Spec. No.TST-CONST-e-09/2019-20-పెద్దపల్లి జిల్లాలో (i) ప్రస్తుతమున్న 220/132KV మంథని SS నుండి ప్రతిపాదిత 400/220/132KV KTPP SSకి 220KV సింగిల్ మూస్ DC లైన్ (53 KM) మరియు (ii) 220/132KV SS మంథని వద్ద 2 నెం.లు 220kV బే ఎక్స్‌టెన్షన్లు స్థాపన.
గమనిక: తదుపరి వివరాలను http://www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నెం. 040-23396000, Extn: 3356, 3351/ఫ్యాక్స్ నెం. 040-23336171.
RO No: 30/19
సం/- చీఫ్ ఇంజినీర్, నిర్మాణం (OSD)

GREATER WARANGAL MUNICIPAL CORPORATION
RFP Notice No. SE/GWMC/CTN/11 Recall/ e-procurement/2019-20, Dt: 18-10-2019
N.W : Design, Supply, Construction, Installation, Testing, Commissioning of Solid Waste Transfer Stations at Various Locations in Warangal City, including O & M for 3 years and for a Defect Liability period of 2 years.
Bid Document download start & End Date : 25-10-2019 & 29-11-2019
Pred-Bid meeting Date : 01-11-2019
Note : Further details can be seen @ "e" procurement market place @ www.tender.telangana.gov.in
Sd/- COMMISSIONER,
Greater Warangal Municipal Corporation

# ఏపీ ఆరోగ్యశ్రీలో సంస్కరణలు

ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై సమీక్షలో సీఎం జగన్



శుక్రవారం అమరావతిలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న ఆరోగ్యశ్రీ పథకంలో నవంబర్ 1 నుంచి పలు సంస్కరణలు తీసుకురానున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలను చర్చించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద నవంబర్ 1 నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లోని 150 దవాఖానల్లో పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలని నిర్ణయించారు. వైద్య, ఆరోగ్యశాఖల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ జనవరిలో మొదలు పెట్టాలని ఆదేశించారు. కంటివెలుగు, ఆరోగ్యశ్రీ దవాఖానల్లో అభివృద్ధి కార్యక్రమాలు, మాతా శిశుమరణాల నివారణ వంటి కీలక అంశాలపై జగన్ చర్చించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం మందుల తయారీ, అందుబాటులో మందులను ఉంచడం, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి విశ్రాంతి సమయంలో ఆర్థిక సహాయం అందించడం, తీవ్ర వ్యాధులతో సతమతమవుతున్నవారికి ప్రతినెల పెన్షన్, కొత్తగా 108, 104 వాహనాల కొనుగోలు, దవాఖానల అభివృద్ధి ద్వారా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు మార్గదర్శక ప్రణాళికను సీఎం సూచించారు. డిసెంబర్ 1 నుంచి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి కోలుకునేంత వరకు నెలకు రూ.5 వేలు లేదంటే రోజుకు రూ.225 ఆర్థిక సహాయం అందించాలని, తీవ్ర కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నవారితోపాటు తలసేమియా, హిమోఫీలియా, ఎనీమియా వ్యాధులతో బాధపడుతున్నవారికి రూ.10 వేల ఆర్థిక సాయం వర్తింపజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. పక్షవాతంతో వీల్‌చైర్‌కు పరిమితమైనవారికి, రెండు కాళ్లు లేని లేదా చేతులు లేని లేదా పనిచేయలేని స్థితిలో ఉన్న వారికి, కండరాల క్షీణతతో పనిచేయలేని స్థితిలో ఉన్నవారికి రూ.5 వేలు పెన్షన్ వర్తింపచేయాలని చెప్పారు.

## జగన్ పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ

వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి

తీర్పును నవంబర్ 1కి వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిటిషన్‌పై నాంపల్లి సీబీఐ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. తీర్పును కోర్టు నవంబర్ ఒకటికి వాయిదా వేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కౌంటర్ దాఖలు చేసే సమయంలో సీబీఐ వాడిన భాష తీరుపై జగన్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తంచేశారు. సీబీఐ ఊహాజనితమైన, సంబంధం లేని అంశాలను తన కౌంటర్‌లో ప్రస్తావించిందని వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రిగా పాలన చేయాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత తనపై ఉన్నదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నట్టు జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జగన్ హాజరుకాకుంటే విచారణలో ఎలా జాప్యం జరుగుతుందో తెలుపాలని, ఆరేండ్ల నుంచి ఎప్పుడూ కేసు వాయిదా కోరలేదని జగన్ తరపున న్యాయవాది అన్నారు. సీబీఐ తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. గతంలో సీబీఐ కోర్టు, హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే జగన్‌కు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపును నిరాకరించాయని చెప్పారు. జగన్ హోదా మినహా కేసు పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు లేవని, జగన్‌కు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వొద్దని సీబీఐ తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న సీబీఐ కోర్టు తీర్పును నవంబర్ ఒకటికి వాయిదా వేసింది.



శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామికి మహాపుష్పాభిషేకం చేశారు. ఖమ్మం నగరంలో శుక్రవారం టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వద్దిరాజు రవిచంద్ర - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మంది రుత్వికులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తులసీ దళాలు, గజమాలలతో గౌరవించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై ఆశీస్సులు తీసుకున్నారు. - ఖమ్మం కల్చరల్

## మూడు జిల్లాల్లో వాన

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఓ మోస్తరు, గ్రేటర్ హైదరాబాద్‌లో తేలికపాటి జల్లులు కురిశాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్, లింగాపూర్, తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పెంచికల్‌పేట్‌లో భారీ వర్షం కురువగా 59.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పలు ప్రాంతాల్లో చిరు జల్లులు పడగా హాలియా, శాలిగౌరారం, మర్రిగూడ, కేతేపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, నాంపల్లి, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం తేలికపాటి జల్లులు పడ్డాయి. రాత్రి 8గంటల వరకు శేరిలింగంపల్లి హఫీజ్‌పేటలో 4.0 మి.మీ., నాంపల్లి, మెహిదీపట్నం, గోషామహల్‌లో 2.0 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

**వచ్చే 48 గంటల్లో గ్రేటర్‌కు వర్షసూచన**

ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 48 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

## 'లా' తొలి విడుత సీట్ల కేటాయింపు

ఈ నెల 24లోపు సంబంధిత కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి: కన్వీనర్ రమేశ్‌బాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో న్యాయవిద్య కళాశాలల్లో తొలి విడుత మూడేండ్ల/ఐదేండ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం సీట్ల కేటాయింపు శుక్రవారం పూర్తయింది. lawcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఆర్డర్, జాయినింగ్ రిపోర్ట్, బ్యాంక్ చలాన్లను డౌన్‌లోడ్ చేసుకొని నిర్దేశిత ఫీజు చెల్లించి సంబంధిత కాలేజీల్లో ఈ నెల 19 నుంచి 24 వ తేదీలోగా విద్యార్థులు రిపోర్ట్ చేయాలని లాసెట్ కన్వీనర్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ పీ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలోని మొత్తం 4783 సీట్లకుగాను 4245 సీట్లను భర్తీ చేయగా.. 538 సీట్లు మిగిలి ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.





వ్యవసాయశాఖ రూపొందించిన కరపత్రాలను కరీంనగర్‌లో ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, అధికారులు

## ప్రతి గింజనూ కొంటాం

- రాష్ట్రంలో 55 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రణాళిక
- 20 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటామని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని కేడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సమన్వయ సమితి బాధ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లక్ష్యం మేర ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రతి కేంద్రానికి ఏఈవోను ఇంచార్జిగా నియమిస్తున్నామనీ, పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మానిటరింగ్ సెల్‌తో నిరంతరం పర్యవేక్షించనున్నట్టు వివరించారు. కొనుగోళ్ల కోసం 12 కోట్లకు పైగా గన్నీ సంచులు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. కౌలు రైతులు పండించే ధాన్యం 50 క్వింటాళ్లకు మించకుంటే ఏఈవో, అంతకుమించితే ఏవోల ధ్రువీకరణ పత్రాలతో కొనుగోలు చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీచైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, డీసీఎంఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, జేసీ శ్యాంప్రసాద్‌లాల్, డీఎస్‌వో సురేశ్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



కరీంనగర్ బస్టాండ్‌లోని ప్లాట్‌ఫారాలపై నిలిపిఉన్న ఆర్టీసీ బస్సులు



మంచిర్యాలలో బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడుతున్న కలెక్టర్ భారతిహోళికేరి

# 74% తిరిగిన బస్సులు

## పల్లెపల్లెకూ ప్రయాణికుల చేరవేత

- ప్రజలకు సూపర్‌లగ్జరీ సేవలు
- శుక్రవారం యథావిధిగా సర్వీసులు
- 14వ రోజూ కనిపించని సమ్మె ప్రభావం

**నమస్తేతెలంగాణనెట్‌వర్క్:** ప్రభుత్వం చేపడుతున్న పకడ్బందీ చర్యలతో రవాణా సౌకర్యం రోజురోజుకూ మెరుగుపడుతున్నది. బస్సుల సంఖ్య పెంచి పల్లెపల్లెకూ ప్రయాణికులను తరలిస్తుండటంతో ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం కన్పించడం లేదు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికారులు బస్సు సర్వీసులను పెంచుతున్నారు. శుక్రవారం 74శాతం బస్సులు నడవడంతోపాటు సూపర్ లగ్జరీ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోల్లోంచి శుక్రవారం ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. తాత్కాలిక కండక్టర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో చాలా బస్సుల్లో టిమ్ మెషిన్లతో టికెట్లు ఇస్తున్నారు. డిపోల్లోంచి దాదాపు 74 శాతం బస్సులు రోడ్డెక్కాయి. వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి 866 బస్సులు నడవాల్సి ఉండగా శుక్రవారం 726 బస్సులు నడిచాయి. మారుమూల పల్లెలకు నైట్‌హాల్ట్ బస్సులు సైతం నడుస్తున్నాయి. భూపాలపల్లి డిపోకు చెందిన 50 బస్సులు రోడ్డెక్కాయి. జనగామ డిపో నుంచి 37 రూట్లలో 117 బస్సులు నడిచాయి.

**ఖమ్మంలో..**

ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల పరిధిలో 159 ఆర్టీసీ బస్సులు, 109 అద్దె బస్సులు నడిచాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల పరిధిలో 70 శాతానిపైగా బస్సులు నడిచాయి. ఆర్టీసీ, హైర్ మొత్తం 268 బస్సులకు గాను 213 బస్సులు నడిచాయి. యాదాద్రిభువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట డిపోలో మొత్తం 65 బస్సులతోపాటు 60 ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులకు సేవలందించాయి. వికారాబాద్ జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు డిపోల నుంచి హైదరాబాద్, మోహిదీపట్నంతోపాటు మహబూబ్‌నగర్, సదాశివపేట, శంకర్‌పల్లి తదితర ప్రాంతాలకు 158 బస్సులు నడిచాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 76 ఆర్టీసీ, 33 హైర్ బస్సులు 16 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకెళ్లాయి. వనపర్తి జిల్లాలో 65 బస్సులు, 18 హైర్ బస్సులు ఆయా రూట్లలో సేవలందించాయి.

**మెదక్ రీజియన్‌లో..**

మెదక్ రీజియన్ పరిధిలో 86 శాతం బస్సులు నడిచాయి. 365 ఆర్టీసీ, 161 ప్రైవేట్ బస్సులు అన్ని రూట్లలో ప్రయాణికులకు సేవలందించాయి. నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 317 బస్సులు నడిచాయి.

**కరీంనగర్ రీజియన్‌లో..**

కరీంనగర్ రీజియన్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో శుక్రవారం 98.32 శాతం బస్సులు రోడ్డెక్కాయి. సిరిసిల్ల జిల్లాలో 100 శాతం, కరీంనగర్‌లో 98.06, పెద్దపల్లిలో 97.32, జగిత్యాలలో 98.48 శాతం బస్సులను నడిపించారు. మొత్తం 656 బస్సులకు శుక్రవారం 446 ఆర్టీసీ, 199 అద్దె బస్సులను నడిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అన్నిరూట్లలో శుక్రవారం 103 బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 150 ఆర్టీసీ బస్సులు నడిచాయి. నారాయణపేట డిపో నుంచి 45 ఆర్టీసీ బస్సులు, 34 అద్దె బస్సులు తిరిగాయి. నిజామాబాద్ రీజియన్ పరిధిలో 85 శాతం మేర బస్సులు నడిచాయి. నిజామాబాద్ పరిధిలో 264 బస్సులు, కామారెడ్డిలో మొత్తం 192 బస్సులు నడిచాయి. ఆదిలాబాద్ డిపోపరిధిలో 50 ఆర్టీసీ, 31 అద్దెబస్సులు, 15 కాంట్రాక్ట్ క్యారేజ్‌లు, 30 మ్యాక్సీక్యాబ్‌లు, ఉట్నూర్‌లో 21 ఆర్టీసీ బస్సులు, 5 అద్దెబస్సులు 12 మ్యాక్స్‌క్యాబ్‌లు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేశాయి.



శుక్రవారం ఖమ్మం బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



మన్యంకొండ వెంకన్నకు పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## పర్యాటక కేంద్రంగా మన్యంకొండ

ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తా:** మన్యంకొండ దినదినాభివృద్ధి చెందుతూ పర్యాటక కేంద్రంగా మారుతున్నదని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండలో రూ.2.70 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు కృష్ణా జలాలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. మన్యంకొండలో మూడు వేల ఏండ్ల కిందటే శ్రీ లక్ష్మీ నారసింహస్వామి (ఒబ్లేష్ స్వామి) స్వయంగా వెలిశారని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం నారసింహస్వామి ఆలయ అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.70 లక్షలు కేటాయించినట్టు వెల్లడించారు. అలివేలు మంగ ఆలయం సమీపంలో రూ.2 కోట్లతో ఏసీ కల్యాణ మంటపాన్ని నిర్మించనున్నట్టు వివరించారు. రాబోయే రోజుల్లో మన్యంకొండను మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే గుర్తింపు పొందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే మహబూబ్‌నగర్ అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు.

## తల్లిని చంపిన తనయుడికి జీవితఖైదు

**కౌడిపల్లి:** తల్లిని హత్యచేసిన ఘటనలో కొడుకుకు కోర్టు జీవితఖైదు విధించింది. కౌడిపల్లి ఎస్సై రాజశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామానికి చెందిన నీరుడి దుర్గమ్మను గతేడాది తన కొడుకు నీరుడి శేఖర్ కడతేర్చాడు. ఈ ఘటనలో నిందితుడికి మెదక్ సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ టి.సత్యనారాయణ శుక్రవారం జీవితఖైదుతోపాటు రూ.5వేలు జరిమానా విధించారు.

## మిత్రుడి పెండ్లికి వెళ్లొస్తుండగా..

- ఎన్నెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఆరుగురు మిత్రులు గల్లంతు
- సూర్యాపేట జిల్లా చాకిరాల వద్ద ఘటన

**నడిగూడెం:**

మిత్రుడి వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా కారు ఎన్నెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చాకిరాల వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చాకిరాలలో శుక్రవారం జరిగిన వివాహానికి వరుడి మిత్రులు 11 మంది హైదరాబాద్ నుంచి రెండు కార్లలో వచ్చారు. ఊరేగింపు అనంతరం రాత్రి 7:30 గంటల సమయంలో తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో ముందువెళుతున్న స్కార్పియో వాహనం మలుపు వద్ద అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. వెనుక మరో వాహనంలో వస్తున్న మిత్రులు గమనించి కేకలు వేస్తూ ఫోన్లలో సమాచారం ఇవ్వడంతో 108 వాహనంతో పాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్వలో గల్లంతైన వారంతా సికింద్రాబాద్ ఏఎస్‌రావునగర్‌లోని సైనిక్‌పురి అంకుర హాస్పిటల్ సిబ్బంది అని తెలిసింది. గల్లంతైన వారిలో అబ్దుల్ అజీజ్ (వైజాగ్), జిన్సన్ (కేరళ), రాజేశ్, సంతోష్,(హైదరాబాద్) పవన్, నగేష్ (మల్కాజిగిరి) ఉన్నట్టు సమాచారం. మునగాల సీఐ శివశంకర్‌గౌడ్, నడిగూడెం ఎస్సై నరేశ్ తమ సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్, ఎస్పీ భాస్కరన్ చాకిరాలకు వెళ్లి ప్రమాదంపై ఆరాతీశారు. కాల్వలో ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటి విడుదలను నిలిపివేయించారు. అయినప్పటికీ ప్రవాహం తగ్గకపోగా.. రాత్రి 11 గంటల ప్రాంతంలో వర్షం పడటంతో అర్ధరాత్రి వరకు ప్రయత్నించి గాలింపు చర్యలను నిలిపివేశారు. శనివారం ఉదయం తిరిగి వారి ఆచూకీ కోసం ప్రయత్నించనున్నారు.





పెండ్లికి వెళ్తున్న సమయంలో కారులో స్నేహితులు... ఘటన స్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బొల్లం, కలెక్టర్ అమయ్‌కుమార్, ఎస్పీ భాస్కరన్

# రెక్కల కష్టం నీళ్లపాలు

- వర్షానికి దెబ్బతిన్న పంటలు
- నేల వాలిన వరి.. తడిసిన మక్క, పత్తి
- ఆరు జిల్లాల్లో 13,994 ఎకరాల్లో నష్టం
- క్షేత్రస్థాయిలో నష్టం అంచనావేస్తున్న అధికారులు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం కురిసిన వర్షానికి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, వరంగల్ అర్బన్, నిర్మల్ జిల్లాల్లో వరి నేలవాలగా, మక్కలు తడిసి ముద్దయ్యాయి. అక్కడక్కడ సోయాబీన్, పత్తికి నష్టం వాటిల్లింది. ఆయా జిల్లాల్లో ప్రాథమిక సమాచారం మేరకు మొత్తం 13,994 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా అందులో 13,942 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మక్కలు, 30 ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఒక్క కరీంనగర్‌లోనే మొత్తం 11,569 ఎకరాల్లో వరి, మక్క పంటలకు నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతుండగా, 30 శాతానికి మించి నష్టం జరిగితేనే పరిహారం చెల్లింపునకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

✦ కరీంనగర్ జిల్లాలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. హుజూరాబాద్, సైదాపూర్, జమ్మికుంట, శంకరపట్నం, మానకొండూరు, వీణవంక, గన్నేరువరం, తిమ్మాపూర్, రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 మండలాల పరిధిలోని 119 గ్రామాలకు చెందిన 6,313 మంది రైతుల పంటలు దెబ్బతినగా అందులో 11,547 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మక్క, మొత్తం 11,569 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. చాలా గ్రామాల్లో పొట్ట, చిరుపొట్ట దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. శంకరపట్నం మండలం కొత్తగట్టులో ఆరబెట్టిన ధాన్యం తడిచింది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూర్, నాంసానిపల్లి, గోపరపల్లి, ఉప్పరపల్లి, హరిపురం, కొమిర, మడక, కనగర్తి, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాత్‌పల్లి, ఇద్లాపూర్, మొట్లపల్లి, పందిల్ల, చిన్నరాత్‌పల్లి, తారుపల్లి గ్రామాల్లో వరి పూర్తిగా నేలకొరిగింది. జిల్లాల్లో మొత్తం 870 ఎకరాల్లో వరి దెబ్బతినగా, కాల్వశ్రీరాంపూర్ మండలంలోనే 650 ఎకరాలు దెబ్బతిన్నది. ఓదెల మక్కల కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన కంకులు తడిసిముద్దయ్యాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో 500 ఎకరాల వరి నేలకొరిగింది. మక్కలు కల్లాల్లోనే తడిసిపోయాయి. నష్టపోయిన రైతుల పొలాలను ఏఈవోలు పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పది ఎకరాల్లో వరి దెబ్బతిన్నది. ఆరుతడి పంటలో సాగు చేసిన పత్తి చేనులోకి వర్షపు నీరు చేరడంతో చేతికి వచ్చే పత్తి నిలిచిపోతున్నది. పత్తి మొక్కలు ఎరుపెక్కడంతో చెట్టు ఎదుగుదల లేకుండా పోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్, ఎల్కతుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరి చేన్లు నేలవారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కమలాపూర్ మండలం ఉప్పల్, కమలాపూర్, భీంపల్లి, కన్నూరు, గుండేడు, మర్రిపెల్లిగూడెం, వంగపల్లి, దేశరాజ్‌పల్లి, కానిపర్తి, శంభునిపల్లి, గూడూరు, అంబాల, శ్రీరాంలపల్లి గ్రామాల్లో వరి దెబ్బతిన్నది. ఎల్కతుర్తి మండలం దండేపల్లి, గోపాల్‌పూర్, వీరనారాయణపూర్, సూరారం, బావుపేట, తిమ్మాపూర్ గ్రామాల్లోని వరి చేన్లలో గింజలు రాలిపోయాయి. రెండు మండలాల్లో సుమారు 900 ఎకరాల్లో దొడ్డు రకం విత్తనాలు సాగు చేసిన వరి పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్మల్ జిల్లాలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. సారంగాపూర్, మామడ, కడెం, దస్తురాబాద్ మండలాల్లో వరి 115 ఎకరాలు, పత్తి 30 ఎకరాల్లో దెబ్బతిన్నది. సారంగాపూర్ మార్కెట్ యార్డు, జామ్ కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన సోయాబీన్ పంట వర్షానికి తడిసిపోయి గింజలు నల్లబడి దుర్వాసన వస్తుందని రైతులు వాపోతున్నారు. సారంగాపూర్ మండలంలోని జామ్, సారంగాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం దమ్మక్కపేటలో నేలవాలిన వరిని పాయలుగా చేస్తున్న రైతు



నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ

## కొనసాగుతున్న వరద

- జూరాలకు ఇన్‌ఫ్లో 24వేలు, అవుట్ ఫ్లో 29,264 క్యూసెక్కులు
- నాగార్జునసాగర్ గేట్లు మూసివేత
- మూసీలో 1.35 టీఎంసీల నీరు

**జోగుళాంబగద్వాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ నందికొండ, కేతేపల్లి, చింతలపాలెం, అయిజ:** కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు స్వల్పంగా వరద కొనసాగుతున్నది. శుక్రవారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 24,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 29,264 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్ట్ సామర్థ్యం 9.657టీఎంసీలకు 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో తగ్గడంతో డ్యాం క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 590 అడుగులకు ప్రస్తుతం 589.60 అడుగుల వద్ద 310.8498 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 174.833 (45.51 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉన్నది. శుక్రవారం సాయంత్రానికి మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 629.60 (1.35 టీఎంసీలు) అడుగులకు చేరుకున్నది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు వరద కొనసాగుతున్నది. 9,979 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 9,739 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 100.855 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.

## బాక్సర్ల పతకాల పంట

**న్యూఢిల్లీ:** ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు పతకాల పంట పండించారు. యూఏఈ వేదికగా జరిగిన టోర్నీలో మన బాక్సర్లు మొత్తంగా 21 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో ఆరు స్వర్ణాలు సహా తొమ్మిది రజతాలు, ఆరు కాంస్య పతకాలు ఉన్నాయి. మొత్తం 26 దేశాలు పోటీపడ్డ టోర్నీలో ఉజ్బెకిస్థాన్ ఎనిమిది పసిడి పతకాలతో సహా 20 దక్కించుకుని టాప్‌లో నిలువగా, భారత్‌కు రెండో స్థానం దక్కింది. విశ్వనాథ్ సురేశ్ (46కి), విశ్వామిత్ర చోంగ్‌తమ్ (48కి), కల్పన (46కి), ప్రీతి దహియా (60కి), తన్స్‌బీర్ కౌర్ సంధు (80కి), అల్ఫియా పఠాన్(80+కి) పసిడి పతకాలు సాధించారు.




# నేడే తుది సమరం

### ఢిల్లీ, బెంగాల్ మధ్య ఫైనల్ .. ప్రొ కబడ్డీ ఏడో సీజన్

**అహ్మదాబాద్ :** ప్రొకబడ్డీ లీగ్‌లో నూతన చాంపియన్ అవతరించబోతున్నది. తొలిసారిగా ఫైనల్ చేరిన దబాంగ్ ఢిల్లీ – బెంగాల్ వారియర్స్ జట్లు ప్రొకబడ్డీ ఏడో సీజన్ టైటిల్ కోసం శనివారం ఇక్కడి ఎకా ఎరీనా స్టేడియంలో తలపడనున్నాయి. ఈ సీజన్ ఆసాంతం అదిరే ప్రదర్శన చేసిన రెండు జట్లు పాయింట్ల పట్టికలోనూ తొలి రెండు స్థానాల్లో నిలిచి.. సెమీస్‌లోనూ విజయం సాధిం చి టైటిల్ పోరులో అడుగుపెట్టాయి. సెమీస్‌లో ఢిల్లీ 44–38తో బెంగళూరును, బెంగాల్ 37–35తో యూ ముంబా ను మట్టికరిపించిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో ఢిల్లీ తరపున స్టార్ రైడర్ నవీన్ కుమార్(283పాయింట్లు) అద్భుతంగా రాణించాడు. వరుసగా 20 మ్యాచ్‌ల్లో సూపర్–10 సాధించి.. సత్తాచాటాడు. డిఫెండింగ్‌లో రవీందర్ పహాల్(62పాయింట్లు) అదరగొడుతున్నాడు. మరో వైపు బెంగాల్ వారియర్స్ తరపున స్టార్ రైడర్ ఈ సీజన్‌లో మహిందర్ సింగ్ 20 మ్యాచ్‌లు ఆడగా 205 పాయింట్లతో సత్తా చాటి.. ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఆరు హైఫైలతో డిఫెండర్ బల్‌దేవ్ సింగ్(64పాయింట్లు) మంచి ఫామ్‌లో ఉన్నాడు. దీంతో తుదిపోరు హోరాహోరీగా సాగే అవకాశం ఎక్కువగా ఉంది.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



**నిర్మల్ అర్బన్, నమస్తే తెలంగాణ:** జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం 64వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్–17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కర్‌రావు, ఎస్పీ శశిధర్‌రాజు ప్రారంభించారు. క్రీడాకారులు, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓడినవారు నిరాశ చెందకుండా క్రీడాస్ఫూర్తిని చాటుతూ గెలుపుకోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.

# క్లీన్‌స్వీప్‌పై గురి

### జోరుమీదున్న కోహ్లీసేన.. పోటీనిచ్చేందుకు సఫారీల పట్టుదల
### నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా మూడో టెస్టు

ప్రత్యక్ష ప్రసారం
ఉదయం: 9.30 నుంచి
స్టార్ స్పోర్ట్స్‌లో

**టెస్టుల్లో దక్షిణాఫ్రికాను తొలిసారి వైట్‌వాష్ చేయాలనే పట్టుదలతో టీమ్‌ఇండియా తుదిపోరుకు సిద్ధమైంది. విశాఖ,పుణె టెస్టుల్లో తిరుగులేని ప్రదర్శన చేసిన కోహ్లీసేన రాంచీలోనూ సఫారీలకు చుక్కలు చూపాలని భావిస్తున్నది. పొడిగా ఉన్న పిచ్‌పై బంతి గింగిరాలు తిరిగే అవకాశం ఉండడంతో పండుగ చేసుకోవాలని భారత స్పిన్నర్లు ఎదురుచూస్తుంటే.. వరుస పరాభవాలతో సతమతమవుతున్న సఫారీలు చివరి పోరులోనైనా సత్తా చాటి పరువు కాపాడుకోవాలనుకుంటున్నారు. ఈ మ్యాచ్ గెలిచి టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల టేబుల్ లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలని విరాట్‌సేన పట్టుదలగా ఉంది. ఇప్పటికే సిరీస్ కోల్పోయి ఒత్తిడిలో ఉన్న సఫారీ జట్టుకు గాయాల కారణంగా మహరాజ్, మార్క్‌రమ్ దూరం కావడం మరింత ఎదురుదెబ్బ గా మారింది. మరి టీమ్‌ఇండియాను ఆ జట్టు ఏ మేరకు నిలువరిస్తుందో చూడాలి.**



**రాంచీ:** దక్షిణాఫ్రికాతో చివరిపోరుకు టీమ్‌ఇండియా సన్నద్ధమైంది. సఫారీలను వైట్‌వాష్ చేసి స్వదేశంలో జైత్రయాత్రను నిర్విఘ్నంగా కొనసాగించాలనే పట్టుదలతో కోహ్లీసేన ఉంది. రాంచీలోని జెడ్‌ఎస్‌సీఏ మైదానం వేదికగా భారత్–దక్షిణాఫ్రికా మధ్య సిరీస్‌లో చివరిదైన మూడో టెస్టు శనివారం ప్రారంభం కానుంది. ఇప్పటికే విశాఖ టెస్టులో 203 పరుగుల తేడాతో, పుణె టెస్టులో ఏకంగా ఇన్నింగ్స్ 137 పరుగులతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించి సిరీస్‌ను టీమ్‌ఇండియా సొంతం చేసుకొని మంచి ఊపు మీద ఉంది. సిరీస్ వశమైనా చివరి టెస్టును సులువుగా తీసుకోబోమని ఇప్పటికే కెప్టెన్ కోహ్లీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చాడు. అలాగే టెస్టు చాంపియన్‌షిప్‌లో పాయింట్లు అత్యంత కీలకం కావడంతో ఏ మాత్రం పట్టువిడువ కూడదని టీమ్‌ఇండియా బలంగా భావిస్తున్నది. ఈ మ్యాచ్ గెలిచి చరిత్రలో తొలిసారిగా దక్షిణాఫ్రికాపై టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని తహతహలాడుతున్నది. సిరీస్‌లో కనీసం పోటీనివ్వని దక్షిణాఫ్రికా ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కనిపిస్తున్నది. స్పిన్ తిరిగే అవకాశమున్న రాంచీ టెస్టుకు సీనియర్ స్పిన్నర్ మహరాజ్ దూరం కావడం, ఓపెనర్ మార్క్‌రమ్ స్వయం కృతంతో గాయం పాలవడం ఆ జట్టుకు మరింత ఎదురుదెబ్బగా మారింది. అయితే టీమ్‌ఇండియాలా బ్యాటింగ్ చేయాల్సి ఉందని సఫారీ కెప్టెన్ డుప్లెసిస్ తమ ఆటగాళ్లకు చేసిన హితబోధ ఎంత వరకు ఫలిస్తుందో చూడాలి.

**'టాప్'లేపుతున్నారు**

టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా అన్ని విభాగాల్లో సమిష్టిగా సత్తాచాటుతున్నది. బ్యాటింగ్‌లో టాపార్డర్‌కు అసలు తిరుగులేకుండా పోయింది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఓపెనర్‌గా తొలి టెస్టులోనే రెండు శతకాలతో దక్షిణాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపెట్టగా.. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ సైతం ద్విశతకంతో అదరగొట్టాడు. తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ పుణె టెస్టులోనూ మయాంక్ శతకంతో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఇక సారథి 'కింగ్ కోహ్లీ' పుణెలో తన కెరీర్‌లోనే అత్యుత్తమ స్కోరు 254 పరుగులను నమోదు చేసి మరోసారి గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో మిడిల్‌ఆర్డర్‌కు పెద్ద పరీక్ష ఎదురుకాలేదు. పుణె టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో త్వరగానే ఔటైన రోహిత్.. ఇంత వరకు సిరీస్‌లో శతకాన్ని అందుకోలేకపోయిన పుజారా రాంచీ టెస్టులో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు.

**అన్నింటా విఫలమే..**

సిరీస్‌లో దక్షిణాఫ్రికా అన్ని విభాగాల్లో విఫలమైంది. ఏదో చేసేస్తారనుకున్న పేసర్లు కగిసో రబాడ, ఫిలాండర్, ఎన్‌రిచ్ నోర్జె అసలు ప్రభావం చూపలేకపోతున్నారు. స్పిన్నర్లదీ అదే పరిస్థితి. ఇక దక్షిణాఫ్రికా టాపార్డర్ కన్నా.. టెయిలెండర్లు చేసిన పరుగులు సిరీస్‌లో అత్యధికంగా ఉన్నాయంటేనే పరిస్థితి అర్థమవుతున్నది. సీనియర్లు డీన్ ఎల్గర్, డికాక్, బవుమా ఈ మ్యాచ్‌లోనైనా రాణించాలని సఫారీ కెప్టెన్ డుప్లెసిస్ కోరుకుంటున్నాడు. కోపంతో తనకు తాను గాయపర్చుకున్న ఓపెనర్ మార్క్‌రమ్ సిరీస్‌కు దూరం కావడం సఫారీలకు ఎదురుదెబ్బగా మారింది. స్పిన్నర్ మహరాజ్ స్థానంలో డేన్ పీట్, మార్క్‌రమ్ స్థానంలో హంజా దక్షిణాఫ్రికా తుదిజట్టులోకి రానున్నారు.

### కుల్దీప్ ఔట్.. నదీమ్ ఇన్



రాంచీ పిచ్ పొడిగా ఉండి స్పిన్నర్లకు ఎక్కువగా సహకరించే అవకాశం ఉండడంతో భారత చైనామన్ బౌలర్ కుల్దీప్ తుదిజట్టులో చోటు దక్కించుకుంటాడనే సమయంలో గాయం పాలయ్యాడు. దీంతో అతడి స్థానంలో దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపుతున్న లెఫ్టార్మ్ స్పిన్నర్ షాబాజ్ నదీమ్ సిరీస్ చివరి మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. మూడో టెస్టులో ఇషాంత్, ఉమేశ్ యాదవ్‌లో ఒకరిని తప్పించి.. అతడిని తుదిజట్టుకు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే స్టార్ స్పిన్నర్లు అశ్విన్, జడేజా సూపర్ ఫామ్‌లో ఉండగా.. నదీమ్ వస్తే స్పిన్ విభాగం మరింత పటిష్ఠమవుతుంది. అలాగే నదీమ్‌ను పరీక్షించినట్టుగానూ ఉంటుందని టీమ్‌మేనేజ్‌మెంట్ ఆలోచనగా తెలుస్తున్నది

**1**

**ఈ మ్యాచ్ గెలిస్తే టెస్టు చరిత్రలో దక్షిణాఫ్రికాను టీమ్ ఇండియా తొలిసారి క్లీన్‌స్వీప్ చేసిన రికార్డు సాధిస్తుంది. 2015లో నాలుగు టెస్టుల సిరీస్‌లో రెండో మ్యాచ్ వర్షంవల్ల డ్రా కావడంతో 3-0తో సిరీస్ గెలిచినా ఈ రికార్డు భారత్‌కు దక్కలేదు.**

**3**

**ఈ ఏడాది టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మన్‌గా ఉన్న స్టోక్స్‌ను అధిగమించాలంటే రోహిత్ మరో మూడో సిక్సర్లను సాధించాలి. స్టోక్స్ 16 ఇన్నింగ్స్‌లో 15 సిక్సర్లు కొడితే.. రోహిత్ ఈ సిరీస్‌లో 3 ఇన్నింగ్స్‌లోనే 13 సిక్సర్లను బాదడం విశేషం.**

**4**

**కెప్టెన్‌గా టెస్టుల్లో 5వేల పరుగులు పూర్తి చేసేందుకు విరాట్ కోహ్లీ 4 పరుగుల దూరంలో ఉన్నాడు.**

### పిచ్, వాతావరణం

రాంచీ పిచ్ పొడిగా ఉంటూ తొలుత బ్యాటింగ్‌కు సహకరించినా... క్రమంగా స్పిన్‌కు అనుకూలించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మ్యాచ్ తొలి మూడు రోజులు వర్షం పడే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. తర్వాతి రెండు రోజులు తేలికపాటి వర్షం పడొచ్చు. మొత్తానికి ఐదు రోజుల ఆట సాధ్యం అయ్యే అవకాశాలు అధికం.

### తుది జట్లు(అంచనా) :

**భారత్ :** మయాంక్ అగర్వాల్, రోహిత్ శర్మ, చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లీ(కెప్టెన్), రహానే, రవీంద్ర జడేజా, సాహా(వికెట్ కీపర్), అశ్విన్, ఇషాంత్/ నదీమ్, ఉమేశ్ యాదవ్ / నదీమ్, మహమ్మద్ షమీ

**దక్షిణాఫ్రికా :** డీన్ ఎల్గర్, హంజా, డీబ్రుయిన్, డుప్లెసిస్(కెప్టెన్), బవుమా, డీకాక్(వికెట్ కీపర్), ముత్తుస్వామి, ఫిలాండర్, నోర్జె/ఎంగిడి, డేన్ పీట్, రబాడ



## ధోనీ హాజరు

టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ... తన సొంత నగరం రాంచీలో జరిగే ఈ మ్యాచ్‌కు హాజరుకానున్నాడు. తొలిరోజు ఆటను మహీ ప్రత్యక్షంగా వీక్షిస్తాడని అతడి వ్యక్తిగత మేనేజర్ మిహిర్ దివాకర్ వెల్లడించాడు. శుక్రవారం ముంబైలో ఉన్న ధోనీ శనివారం ఉదయం రాంచీ చేరుకోనున్నాడు. టెస్టు క్రికెట్ నుంచి ఐదేండ్ల క్రితమే రిటైరైన ధోనీ.. ప్రస్తుతం పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొనసాగుతున్నాడు. అతడు అంతర్జాతీయ క్రికెట్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పే విషయంపై ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్ తర్వాతి నుంచి ఉత్కం ఠ కొనసాగుతూ వస్తున్నది. ఈ విషయంపై అతను ఇంకా స్పం దించడం లేదు. దీంతో ధోనీ విషయంపై ఈనెల 24న సెలెక్టర్లతో మాట్లాడతానని బీసీసీఐకి కాబోయే అధ్యక్షుడు గంగూలీ చెప్పిన విషయం తెలిసిందే.



## ఇప్పుడు ఆయనేం చేశారు

### రవిశాస్త్రిపై గంగూలీ స్పందన

**న్యూఢిల్లీ :** 2016లో టీమ్‌ఇండియా హెడ్ కోచ్ ఎంపిక సమయంలో మాజీ కెప్టెన్ గంగూలీకి – రవిశాస్త్రికి మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. అప్పుడు కోచ్ పదవికి రవిశాస్త్రి కూడా దరఖాస్తు చేసుకోగా.. సచిన్ టెండూల్కర్, గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్‌లతో కూడిన క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) అనిల్ కుంబ్లేను ఎంపిక చేసింది. తనను ఇంటర్వ్యూ చేసే సమయంలో గంగూలీ వ్యక్తిగతంగా హాజరు కాలేదని, ఇది తనను అవమానించడమేనని శాస్త్రి అప్పట్లో విమర్శలు సంధించాడు. గంగూలీ సైతం దీటుగా బదులివ్వడంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే ఇప్పుడు బీసీసీఐకి గంగూలీ అధ్యక్షుడు కాబోతుండగా.. టీమ్‌ఇండియా హెడ్‌కోచ్‌గా రవిశాస్త్రి కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో శాస్త్రి గురించి మీడియా అడిగిన ప్రశ్నకు దాదా తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. రవిశాస్త్రితో మాట్లాడారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఎందుకు.. ఆయన ఇప్పుడు ఏం చేశారు' అని అన్నాడు. బీసీసీఐ అధ్యక్ష పదవికి గంగూలీ ఒక్కడే నామినేషన్ దాఖలు చేయగా.. ఈనెల 23న జరిగే వార్షిక సాధారణ సమావేశంలో బాధ్యతలు చేపట్టనున్నాడు.

## అమన్ సంఘీ పసిడి గురి




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తెలంగాణ రైఫిల్ అసోసియేషన్(టీఆర్‌ఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్‌జోన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్ అమన్ సంఘీ అదరగొట్టాడు. శుక్రవారం జరిగిన పురుషుల వ్యక్తిగత క్లే పీజియన్ స్కీట్ షూటింగ్ విభాగంలో అమన్ 34 పాయింట్లతో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్రానికే చెందిన హసన్ బిన్ (32)కు రజతం దక్కగా, నలిన్ (30)కు కాంస్యం లభించింది. మిగతా విభాగాల్లో యశ్వంత్, వెంకట లక్ష్మి, మునెక్ బత్తుల, ఆయూష్ రుద్రరాజు, రాజా రాజగోపాల్, వికార్ అహ్మద్ స్వర్ణ పతకాలతో ఆకట్టుకున్నారు. విజేతలకు మాజీ డీజీ పీ అనురాగ్ శర్మ, టీఆర్‌ఏ అధ్యక్షుడు అమిత్ సంఘీ, ఉదయ్ పిలానీ పతకాలు ప్రదానం చేశారు.

## ఎంపికలో నేను కలుగజేసుకోను

### నిఖత్ లేఖకు కేంద్ర క్రీడామంత్రి ప్రతిస్పందన





**న్యూఢిల్లీ:** ట్రయల్స్ విషయంలో బాక్సర్లు నిఖత్ జరీన్, మేరీకోమ్ మధ్య నెలకొన్న వివాదానికి ముగింపు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది చైనాలో జరిగే టోక్యో(2020) ఒలింపిక్స్ అర్హత టోర్నీ కోసం ఎలాంటి ట్రయల్స్ లేకుండానే మేరీని ఎంపిక చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ యువ బాక్సర్ నిఖత్..కేంద్ర క్రీడాశాఖ కిరణ్ రిజిజుకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీనిపై మంత్రి ట్విట్టర్ వేదికగా శుక్రవారం ప్రతిస్పందించారు. ఎంపికపై తాను కలుగజేసుకోనంటూనే అత్యుత్తమ ప్రదర్శనను పరిగణనలోకి తీసుకోవాలంటూ భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ)ను మంత్రి కోరారు. ' దేశం, క్రీడలు, అథ్లెట్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని బీఎఫ్ఐని కోరుతాను. అంతేగానీ క్రీడా సమాఖ్యలు ఆటగాళ్లను ఎంపిక చేసే విషయంలో మంత్రిగా నేను కలుగజేసుకోను. ఒలింపిక్ చాప్టర్ ప్రకారం స్వయం ప్రతిపత్తి కల్గిన దేశంలోని ప్రతి క్రీడా సమాఖ్య ప్లేయర్లను సెలెక్ట్ చేసే హక్కు ఉంది' అని రిజిజు ట్వీట్ చేశారు. మరోవైపు మంత్రి స్పందనపై నిఖత్ రీట్వీట్ చేసింది. 'ట్రయల్స్‌పై ఇంత త్వరగా స్పందించినందుకు కృతజ్ఞతలు సర్. దేశానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకొచ్చేందుకు కష్టపడే అథ్లెట్ల ఎంపికలో ఫేవరేటిజం, నేపోటిజమ్‌కు స్థానం ఉండవద్దు' అని ట్వీట్ చేసింది. ఆయా టోర్నీల్లో ప్రదర్శన ఆధారంగా మేజర్ చాంపియన్‌షిప్‌లకు ఎంపిక చేసేందుకు బీఎఫ్ఐ గతేడాది నుంచి పాయింట్ల పద్ధతిని తీసుకొచ్చింది. అయితే కొన్ని విభాగాల్లో ఉన్న పోటీ దృష్ట్యా గతంలో ట్రయల్స్ నిర్వహించి అందులో నుంచి టోర్నీలకు పంపించేవారు.

## రొనాల్డో సింగ్‌కు స్వర్ణం



రొనాల్డో

**న్యూఢిల్లీ:** ఇంచియాన్(దక్షిణకొరియా) వేదికగా జరుగుతున్న ఆసియా ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ సైక్లిస్టు రొనాల్డో సింగ్ పసిడి పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల జూనియర్ కైరీన్ ఈవెంటులో రొనాల్డో టాప్‌లో నిలిచి భారత్‌కు పతకాన్ని అందించాడు. ఇదే విభాగంలో మన దేశానికే చెందిన జేమ్స్ సింగ్‌కు కాంస్య పతకం దక్కింది. పురుషుల, మహిళల జూనియర్ స్ప్రింట్ టీమ్ ఈవెంటులో భారత్ రెండు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఆసియా సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన వారిని భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపింది.

## డుప్లెసిస్‌కు టాస్ ఫీవర్



భారత పర్యటనలో ఓటములతో పాటు టాస్ కూడా సఫారీ కెప్టెన్ డుప్లెసిస్‌కు తలనొప్పిగా మారింది. విశాఖ, పుణె టెస్టుల్లోనూ సఫారీలపై టాస్ నెగ్గిన టీమ్‌ఇండియా బ్యాటింగ్ ఎంచుకొని తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్లు సాధించి చిత్తుగా ఓడించింది. ఆసియాలో డుప్లెసిస్‌కు ఇది వరుసగా తొమ్మిదో టాస్ పరాభవం కావడం విశేషం. దీంతో రాంచీ టెస్టు టాస్ కోసం సఫారీ జట్టు నుంచి వేరే ఆటగాడు వచ్చే అవకాశాలు లేకపోలేదు. టాస్ పరాభవాలకు అడ్డుకట్టపడేందుకు వేరే ఆటగాడిని టాస్ కోసం పంపినా తాను ఫీలవనంటూ డుప్లెసిస్ సైతం ఆ దిశగా సంకేతాలిచ్చాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేస్తే తొలి రెండు టెస్టుల్లో ఫలితం మరోలా ఉండేదేమోనని శుక్రవారం వ్యాఖ్యానించాడు. మరి సఫారీలకు ఈసారైనా టాస్ యోగం కలిసి వస్తుందో లేక అదృష్టం విరాట్‌నే వరిస్తుందో చూడాలి.



## సర్ఫరాజ్‌పై వేటు

### టెస్టు, టీ20 కెప్టెన్సీ నుంచి తొలగింపు

**కరాచీ :** ఇటీవలి కాలంలో పేలవ కెప్టెన్సీ, బ్యాటింగ్‌తో పాటు మైదానంలో ప్రవర్తనతోనూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) వేటు వేసింది. టెస్టు, టీ20 ఫార్మాట్లకు కెప్టెన్సీ నుంచి అతడిని తొలగించింది. ఈనెల చివర్లో ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా పర్యటనలో పాక్ టెస్టు జట్టుకు అజర్ అలీని, టీ20లకు బాబర్ ఆజమ్‌ను సారథులుగా నియమిస్తున్నట్టు పీసీబీ శుక్రవారం ప్రకటించింది. రెండేండ్లుగా అన్ని ఫార్మాట్లకు కెప్టెన్‌గా సర్ఫరాజ్ కొనసాగుతున్నాడు. అతడి సారథ్యంలో పాక్ జట్టు 2017 చాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకోవడంతో సర్ఫరాజ్ పేరు మారుమోగిపోయింది. అయితే ఇటీవలి కాలంలో అతడి కెప్టెన్సీలో పరాజయాలతో పాక్ జట్టు వన్డే, టెస్టు ర్యాంకు లు పడిపోయాయి. ప్రపంచకప్‌లోనూ జట్టు సెమీస్‌కు చేరలేకపోయింది. తాజాగా సొంత గడ్డపై.. ద్వితీయ శ్రేణి శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో పాక్ వైట్‌వాష్‌కు గురైంది. బ్యాటింగ్‌లోనూ సర్ఫరాజ్ విఫలమవుతుండడంతో కొత్త కోచ్, చీఫ్ సెలెక్టర్ మిస్బా ఉల్ హక్ కూడా వేటువైపే మొగ్గు చూపాడు.

## ఐఎస్‌ఎల్ ప్రారంభ వేడుకకు సినీ తారలు

**కొచ్చి:** ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్‌ఎల్) ఆరో సీజన్ ప్రారంభ వేడుక అట్టహాసంగా జరుగనుంది. ఆదివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్, హీరోయిన్ దిశా పటానీ హాజరుకానున్నారు. హీరో దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించనుండడం మరో విశేషం. అలాగే అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఇండియన్ డ్యాన్స్ గ్రూప్.. ఫుట్‌బాల్ థీమ్‌తో చేసే నృత్యం ప్రత్యేకంగా నిలువనుంది. ప్రారంభ మ్యాచ్‌లో ఏటీకే – కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ ఆదివారం తలపడతాయి.

## భారత్, బ్రిటన్ మ్యాచ్ డ్రా



**జోహర్ బహ్రు(మలేషియా):** సుల్తాన్ జోహర్ కప్‌లో ఇప్పటికే ఫైనల్ బెర్తు దక్కించుకున్న భారత జూనియర్ హాకీ జట్టు తమ ఆఖరి మ్యాచ్‌లో ఆకట్టుకుంది. శుక్రవారం బ్రిటన్‌తో జరిగిన చివరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌ను భారత్ 3–3తో డ్రా చేసుకుంది. టీమ్‌ఇండియా తరపున శీలానంద్ లక్రా(48ని), మణ్‌దీప్ మోర్(51ని), శ్రద్ధానంద్ తివారీ(57ని) గోల్స్ చేయగా, బ్రిటన్ జట్టులో లోన్ వాల్(27ని), అంద్రూ మెక్‌నీల్(32ని), మాథ్యూ రామ్స్(59ని) ఒక్కో గోల్ చేశారు. శనివారం జరిగే ఫైనల్ పోరులో టాప్–2లో నిలిచిన భారత్, బ్రిటన్ తలపడుతాయి. మ్యాచ్ విషయానికొస్తే...తొలి క్వార్టర్‌లో ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై పలుమార్లు దాడులకు ప్రయత్నించినప్పటికీ టీమ్‌ఇండియా సఫలం కాలేకపోయింది. 11వ నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్ దీనాచంద్ర సింగ్ వృథా చేయడంతో గోల్ దక్కలేదు. రెండో క్వార్టర్‌లో నెమ్మదిగా పుంజుకున్న భారత్ మిడ్‌ఫీల్డ్‌లో దక్కిన అవకాశాలను గోల్స్‌గా మలువలేకపోయింది. అయితే 27వ నిమిషంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను వాల్ గోల్ చేయడంతో బ్రిటన్ ఖాతా తెరిచింది. అదే ఊపులో మరో గోల్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. ఆఖరి క్వార్టర్‌లో విజృంభించిన భారత్ తొమ్మిది నిమిషాల తేడాతో మూడు గోల్స్ చేసి 3–2 ఆధిక్యం దక్కించుకుంది. అయితే మరో నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా మాథ్యూ చేసిన గోల్‌తో భారత్ గెలిచే అవకాశాన్ని చేజార్చుకుంది.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,298 | 11,662 |
| 246 | 75 |

ముడి చమురు (బ్రెంట్) 59.13 డాలర్లు

| బంగారం ధరలు | |
|---|---|
| న్యూఢిల్లీ (రూ.లలో) | |
| 24 క్యారెట్లు | 38,925 |
| 22 క్యారెట్లు | --- |
| వెండి (కిలో) | 46,325 |

ప్రస్తుతం రిలయన్స్ వద్ద ఉన్న నగదు నిల్వలు
**రూ. 1,34,746 కోట్లు**



# రిలయన్స్ ప్రభంజనం

## రికార్డుస్థాయి లాభాలను ఆర్జించిన సంస్థ
## క్యూ2లో రూ.11,262 కోట్లుగా నమోదు

## దన్నుగా నిలిచిన టెలికం, రిటైల్ వ్యాపారాలు
## రూ.1,63,854 కోట్లకు చేరిన ఆదాయం

**ముంబై/న్యూఢిల్లీ, అక్టోబర్ 18:**

రిలయన్స్ ప్రభంజనం కొనసాగుతున్నది. దేశంలో అత్యంత విలువైన సంస్థగా రికార్డు సృష్టించిన రిలయన్స్..అటు ఆర్థిక ఫలితాల్లోనూ మరో శిఖరాగ్రానికి చేరుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.11,262 కోట్ల లాభాన్ని ఆర్జించింది. పెట్రోకెమికల్, రిఫైనింగ్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబరిచినప్పటికీ రిటైల్, టెలికం రంగాల ఇచ్చిన దన్నుతో రికార్డు స్థాయి లాభాలను నమోదు చేసుకున్నది. చమురు నుంచి టెలికం వరకు సేవలు అందిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీ గత త్రైమాసికంలో ఒక్కో షేరుపై రూ.18.6 ఆర్జించింది. 2018-19 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9,516 కోట్లు లేదా ప్రతి షేరుకు రూ.16.1 నమోదైంది. ప్రైవేట్ రంగ సంస్థల్లో ఇంతటి స్థాయి లాభాలను ఆర్జించిన సంస్థ రిలయన్సే కావడం విశేషం. ప్రభుత్వ రంగ సంస్థయైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ)..జనవరి-మార్చి 2013లో రూ.14,512.81 కోట్ల లాభాన్ని గడించింది. ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి ప్రాఫిట్. గత త్రైమాసికంలో సంస్థ రూ.9,702 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసుకున్నది. ఆదాయం విషయానికి వస్తే రూ.1,63,854 కోట్లు గడించింది. గతేడాదితో పోలిస్తే ఆదాయంలో 4.8 శాతం పెరుగుదల కనిపించింది. సమీక్షకాలంలో 337 రిటైల్ స్టోర్లను ఏర్పాటు చేయగా, 2.4 కోట్ల మంది వినియోగదారులు జియో నెట్‌వర్క్ పరిధిలోకి రావడం లాభాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకోవడానికి దోహదపడింది. సంప్రదాయక చమురు రిఫైనింగ్, పెట్రోకెమికల్ బిజినెస్‌లు బలహీనపడినప్పటికీ అంచనాలకు మించి లాభాలను ఆర్జించడం విశేషం. కంపెనీకి వచ్చిన మొత్తం లాభంలో రిటైల్, టెలికం రంగాల వాటా రెండింట మూడోవంతు. కంపెనీ ఆర్థిక ఫలితాల్లో పలు ముఖ్య అంశాలు..

- పెట్రోకెమికల్ వ్యాపారం ద్వారా నికర లాభం 6.4 శాతం తగ్గి రూ.7,602 కోట్లకు పడిపోయింది. ఇంధన ఉత్పత్తి తగ్గడం ఇందుకు కారణం.
- వరుసగా ఆరు త్రైమాసికాలుగా వృద్ధిని నమోదు చేసుకున్న ప్రపంచంలో అతిపెద్ద చమురు క్షేత్రం ఈసారికి నిరాశపరిచింది.
- పన్ను చెల్లించకముందు ఈ విభాగం 7 శాతం పడిపోయి రూ.4,957 కోట్లకు జారుకున్నది
- ప్రతి బ్యారెల్‌ను శుద్ధి చేయడం ద్వారా సంస్థ 9.4 డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వచ్చిన 8.1 డాలర్లతో పోలిస్తే అధికమవగా, క్రితం ఏడాది వచ్చిన 9.5 డాలర్లతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది.
- గత త్రైమాసికంలో సంస్థ 16.7 మిలియన్ టన్నుల క్రూడాయిల్‌ను వెలికితీసింది. ఏడాది క్రితం 17.7 మిలియన్ టన్నులుగా ఉన్నది.
- చమురు నుంచి కన్జ్యూమర్ బిజినెస్‌లో వాటాను సౌదీ అరామ్‌కోకు విక్రయించింది. ఒప్పందం విలువ 75 బిలియన్ డాలర్లు. ఈ ఒప్పందం వచ్చే ఏడాది పూర్తి కానున్నది.
- సెప్టెంబర్ 30 నాటికి కంపెనీకి రూ.2,91,982 కోట్ల స్థాయిలో అప్పు ఉన్నది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఉన్న రూ.288,243 కోట్లతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.
- గత త్రైమాసికంలో 337 రిటైల్ అవుట్‌లెట్లను సంస్థ ఆరంభించింది. దీంతో మొత్తం సంఖ్య 10,901 స్టోర్లకు చేరుకున్నాయి.
- సంస్థ నిర్వహిస్తున్న రిటైల్ అవుట్‌లెట్లలో రెండింట మూడోవంతు గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసింది.
- రిలయన్స్ రిటైల్ 200వ స్మార్ట్ స్టోర్‌ను ప్రారంభించగా, వీటిలో 100 స్టోర్లు ఉన్నాయి.

**రిటైల్లోనూ అదే జోష్...**

రిలయన్స్ రిటైల్ కూడా విశ్లేషకుల అంచనాలకుమించి ఫలితాలను నమోదుచేసుకున్నది. గత త్రైమాసికంలో రిటైల్ పన్నులు చెల్లించకముందు రూ.2,322 కోట్ల లాభాన్ని గడించింది. స్టోర్ల ఉత్పాదక అ ధికమవడం, నిర్వహణ సామర్థ్యాలు మెరుగవడం, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం ఇందుకు కారణమని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే సమయంలో రూ.1,392 కోట్లుగా ఉన్నది. గత త్రైమాసికంలో రిటైల్ రంగ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 27.02% ఎగబాకి రూ.41,202 కోట్లకు చేరుకున్నది. గతేడాది ఇది రూ.32,436 కోట్లుగా ఉన్నది. ఒక విభాగంలో రూ.40 వేల కోట్ల మైలురాయికి చేరుకోవడం ఎంతో సంతోషమని పేర్కొంది.

> మరో త్రైమాసికంలో రికార్డు స్థాయి లాభాలను ఆర్జించగలిగాం. చమురు నుంచి కెమికల్ వ్యాపారాలు ఆశించిన స్థాయిలో నమోదవడం, వీటికితోడు కన్జ్యూమర్ బిజినెస్ రాణించడం ఇందుకు దోహదం చేసింది. రిటైల్ రంగం నిరాటంకంగా కొనసాగుతున్నది. వినియోగదారులు అత్యంత విలువైన ఉత్పత్తిని అందించడానికి సంస్థ ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నది. దేశీయ టెలికం రంగంలో అగ్రగామి సంస్థగా జియో అవతరించింది. 4జీ సబ్‌స్క్రైబర్లు, 4జీ డాటా టారిఫ్‌లో జియోకు అత్యధిక మార్కెట్ వాటా ఉన్నది. బ్రాడ్‌బ్యాండ్ చరిత్రను తిరగరాసిన జియో..త్వరలో ఫైబర్ సేవలను అందుబాటులోకి తీసుకురాబోతున్నాం.
>
> **- ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్**

ఈ సందర్భంగా ఆర్‌ఐఎల్ జాయింట్ సీఎఫ్‌వో శ్రీకాంత్ మాట్లాడుతూ..రిటైల్ రంగాన్ని శరవేగంగా విస్తరించడానికి గత త్రైమాసికంలో రూ.2 వేల కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు, దీంతో వ్యాపారం భారీ వృద్ధిని సాధించిందన్నారు. ఆర్థిక మాంద్యం చాయలు ఇతర దేశాలపై ఉన్నప్పటికీ రిటైల్ రంగంపై పెద్దగా ప్రభావం లేదని వ్యాఖ్యానించారు.

## 84 లక్షల మంది కొత్త కస్టమర్లు



**టెలికం** వినియోగదారులను ఆకట్టుకోవడంలో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. ఆగస్టు నెలలోనూ కంపెనీ కొత్తగా 84.45 లక్షల మంది జియో నెట్‌వర్క్‌ను ఎంచుకున్నారు. ఇదే నెలలో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు తమ కస్టమర్లను కోల్పోయినట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వెల్లడించింది. జూలై చివరి నాటికి భారత్‌లో 118.92 కోట్ల టెలికం సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఆ మరుసటి నెల చివరినాటికి 119.18 కోట్లకు పెరిగారు. వీరిలో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 117.10 కోట్ల మంది ఉన్నారు. మొత్తం వినియోగదారుల్లో వీటి వాటా 98 శాతం. మొత్తం వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు(జీఎస్‌ఎం, సీడీఎంఏ, ఎల్‌టీఈ) 116.83 కోట్ల నుంచి 117.10 కోట్లకు పెరిగారు. జియో నెట్‌వర్క్‌ను 84.45 లక్షల మంది ఎంచుకోగా, వొడాఫోన్ ఐడియా నుంచి 49.56 లక్షల మంది వైదొలుగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్ నుంచి 5.61 లక్షల మంది ఇతర నెట్‌వర్క్‌లలోకి వెళ్లిపోయారు. వీటితో పాటు ప్రభుత్వరంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌ను కూడా 2.36 లక్షల మంది వీడగా, ఎంటీఎన్‌ఎల్‌ను 6,701 మంది, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌ను 63 మంది వెళ్లిపోయారు. అక్టోబర్ 2018 నుంచి జియోతోపాటు ప్రభుత్వరంగ సంస్థయైన బీఎస్‌ఎన్‌ఎల్‌కు వినియోగదారులు జతవగా, ఆగస్టులో మాత్రం తగ్గారు. 48.6 లక్షల మంది కస్టమర్లు తమ నెట్‌వర్క్ నుంచి ఇతర నెట్‌వర్క్‌కు బదిలీ అయ్యారు. బీఎస్‌ఎన్‌ఎల్ వైర్‌లెస్ కనెక్షన్లు 1.5 లక్షలు తగ్గి 2.08 కోట్లకు పడిపోగా, అలాగే ఫిక్స్‌డ్ లైన్ కస్టమర్లు కూడా 1.41 లక్షల మంది కోల్పోయింది. ఫిక్స్‌డ్ లైన్ కనెక్షన్లలో వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్‌లు మాత్రం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1.87 శాతం పెరిగి 61.55 కోట్లకు చేరాయి.

## జియో లాభం రూ.990 కోట్లు!

**ఇతర** టెలికం సంస్థలు నష్టాల్లో కొనసాగుతున్నప్పటికీ రిలయన్స్ జియో మాత్రం లాభాల్లో దూసుకుపోతున్నది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.990 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.681 కోట్లతో పోలిస్తే 45.4 శాతం అధికం. వినియోగదారులు పెరుగడం కంపెనీకి కలిసొచ్చింది. సమీక్షకాలంలో కంపెనీ ఆపరేటింగ్ ఆదాయం రూ.9,240 కోట్ల నుంచి 33.7 శాతం వృద్ధి చెంది రూ.12,354 కోట్లకు ఎగబాకింది. '35 కోట్ల మంది వినియోగదారులతో ప్రపంచంలో అత్యంత వేగవంతమైన డిజిటల్ సేవల సంస్థగా జియో అవతరించిందని, ప్రస్తుతం కూడా ప్రతి నెల కోటి మందికి పైగా వినియోగదారులు తమ నెట్‌వర్క్‌ను ఎంచుకుంటున్నారు..జియో అంటే దేశంలో అతిపెద్ద టెలికం సంస్థ కాదని..డిజిటల్ గేట్‌వే ఆఫ్ ఇండియాగా మారిపోయింది' అని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు. ప్రతి ఒక్కో వినియోగదారుడి నుంచి కంపెనీకి రూ.120 ఆదాయం సమకూరుతున్నది. తొలి త్రైమాసికంలో వచ్చిన దాంతో పోలిస్తే రూ.2 తగ్గింది. సెప్టెంబర్ 30 నాటికి సంస్థకు 35.52 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు.

## 9 లక్షల కోట్లు @ ఆర్‌ఐఎల్

### మార్కెట్ విలువను సాధించిన తొలి సంస్థ

**రిలయన్స్** ఇండస్ట్రీస్ మరో ఖ్యాతిని గడించింది. దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో తొలిసారిగా రూ.9 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటల్ సాధించిన సంస్థగా రిలయన్స్ ఇండస్ట్రీస్ రికార్డు సృష్టించింది. శుక్రవారం ఇంట్రాడేలో 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకోవంతో కంపెనీ ఎం-క్యాప్ రూ.9,05,214 కోట్లకు చేరుకున్నది. కానీ, చివరి వరకు ఇంతటి స్థాయిలో లాభాలను నిలుపుకోలేక పోవడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.8,97,179.47 కోట్లకు పడిపోయింది. ఇంట్రాడేలో 2.28 శాతం లాభపడి రూ.1,428 వద్దకు చేరుకున్న కంపెనీ షేరు ధర చివరకు 1.37 శాతం లాభంతో రూ.1,415.30 వద్ద ముగిసింది. ఆగస్టు 2018లో రూ.8 లక్షల కోట్ల మార్కెట్ విలువను దాటిన సంస్థ..ఆ మరుసటి ఏడాదిలోనే మరో లక్ష కోట్ల రూపాయలు పెరుగడం విశేషం. అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడం, చమురు-పెట్రోకెమికల్ వ్యాపారాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ఇందుకు కలిసొచ్చింది. గత ఏడాదికాలంలో కంపెనీ షేరు విలువ 23.63 శాతం లాభపడింది.

**రూ.7,71,996.87 కోట్లతో టీసీఎస్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(రూ.6,72,466.30 కోట్లు), హెచ్‌యూఎల్(రూ.4,55,952.72 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ(రూ.3,61,801.97 కోట్లు), ఇన్ఫోసిస్(రూ.3,29,751.88 కోట్లు), కొటక్ మహీంద్రా బ్యాంక్ (రూ. 3,08,708.32 కోట్లు), ఐటీసీ( రూ. 3,02,861.98 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.2,82,783.39 కోట్లు), బజాజ్ ఫైనాన్స్(రూ.2,39,947.60 కోట్లు) టాప్-10 జాబితాలో ఉన్నాయి.**

★ స్టాక్ మార్కెట్లో ఆయా కంపెనీల షేరు ఆధారంగా రోజు రోజు మారుతుంటాయి.

## 22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

### మద్దతు పలికిన రాష్ట్ర బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** జాతీయ బ్యాంకుల విలీనాలకు వ్యతిరేకంగా ఈనెల 22న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన బ్యాంకుల సమ్మెకు తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య మద్దతు తెలుతున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రాంబాబు చెప్పారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం హిమాయత్‌నగర్‌లోని కామ్రేడ్ సత్యనారాయణ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్యలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ...ఇటీవల పది ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను నాలుగు బ్యాంకుల్లో విలీనం చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ సమ్మె తలపెట్టినట్లు తెలిపారు. ఈ విలీన చర్యను కేంద్ర ప్రభుత్వ విఘాతమైన చర్యగా ఆయన అభివర్ణించారు.10 బ్యాంకులు 4 బ్యాంకుల విలీనమైనట్లు పోతే ప్రభుత్వ రంగం బ్యాంకుల సంఖ్య 27 నుంచి 12 తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాను తగ్గించడం, విలీనాలతో బ్యాంకుల ప్రైవేటీకరణకు దారితీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకుంటున్న ఈ చర్యలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందన్న ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుల విలీనంతో ఉద్యోగులు తగ్గిపోతారని, దీంతో నిరుద్యోగ సమస్య పెరిగి పోతుందన్నారు. సంస్కరణల పేరుతో కేంద్రం కార్పొరేట్ వర్గాలకు దగ్గరవుతున్నదని, ఇది ఉద్యోగ పాలిట శాపంగా మారనున్నదన్నారు.


**తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్**
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ)
"టూరిజం హౌస్", #3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన నం. 06/SE/TSTDC/2019-20 తేది: 18-10-2019

| క్ర. సం. | పని పేరు | అంచనా వ్యయం రూ. లక్షలలో | బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభం |
|---|---|---|---|
| 1 | బుద్ధవనం ప్రాజెక్ట్, నాగార్జునసాగర్, నల్గొండ జిల్లాలో మిగిలిన సివిల్ పనులు. | రూ. 88.92 | 22.10.2019 |
| 2 | బుద్ధవనం ప్రాజెక్ట్, నాగార్జునసాగర్, నల్గొండ జిల్లాలో మిగిలిన శిల్పకళా పనుల ఏర్పాటు | రూ. 39.94 | |
| 3 | బుద్ధవనం ప్రాజెక్ట్, నాగార్జునసాగర్, నల్గొండ జిల్లాలో ఎల్క్ట్రానిక్ గేట్లు (2 నం.లు) సరఫరా మరియు స్థాపన | రూ. 14.81 | |
| 4 | బుద్ధవనం ప్రాజెక్ట్, నాగార్జునసాగర్, నల్గొండ జిల్లాలో స్టోన్ కార్వింగ్స్ ఆధారంగా వాటర్ బోర్న్ ఫ్లోరినేటెడ్ కోపాలిమర్‌తో ప్రొటెక్టెడ్ గార్డ్ ఏర్పాటు. | రూ. 3.83 | |

అర్హతగల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా బిడ్లు కోరబడినవి. సమాచారాన్ని నిర్దిష్టంగా ZIP ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కాంట్రాక్టర్లు కోరబడినారు. తదుపరి వివరాలను www.tenders.telangana.gov.inలో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేసు వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు,TSTDC లిమిటెడ్, హైదరాబాద్.


## సీసీఎల్ చైర్మన్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు



**హైదరాబాద్, అక్టోబర్ 18:** హైదరాబాద్ కేంద్రస్థానంగా కాఫీలు తయారు చేస్తున్న సీసీఎల్ ప్రొడక్ట్స్(ఇండియా) లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. ఇటీవల జర్మనీలో జరిగిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టాంట్ కాఫీ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కాసిక్యూ బ్రెజిల్ సీఈవో సెర్గి మాట్లాడుతూ..సీసీఎల్ ప్రొడక్ట్స్ లిమిఎట్ 1,500 టన్నుల సామర్థ్యం నుంచి 35 వేల టన్నుల సామర్థ్యానికి చేరుకున్నదని, 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నదన్నారు.

## చైనా వృద్ధి 6 శాతమే

**బీజింగ్, అక్టోబర్ 18:** పొరుగుదేశమైన చైనాకు కూడా వృద్ధిరేటు సెగ గట్టిగానే తగిలింది. ప్రస్తుత సంవత్సరం మూడో త్రైమాసికం(జూలై-సెప్టెంబర్) చైనా వృద్ధి 6 శాతానికి పడిపోయింది. 1992 తర్వాత ఇంత కనిష్ఠంగా వృద్ధిని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా..అమెరికాతో వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం, దేశీయంగా డిమాండ్ పడిపోవడం వృద్ధి పతనానికి ప్రధాన కారణమని వెల్లడించింది. రెండో త్రైమాసికంలో నమోదైన 6.2 శాతంతో పోలిస్తే ఇది తక్కువదని నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిటిక్స్ వెల్లడించింది.

# ఆరో రోజూ..అదే జోరు

### భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 246, నిఫ్టీ 75 పాయింట్ల లాభం



ముంబై, అక్టోబర్ 18:

స్టాక్ మార్కెట్ల జోరు నిరాటంకంగా కొనసాగుతున్నది. వరుసగా ఆరో రోజు కూడా దేశీయ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడం, బ్రెగ్జిట్ ఆశావాద నిర్ణయాలు దలాల్‌స్ట్రీట్‌లో కొనుగోళ్ల జోష్ పెంచింది. వరుసగా సూచీలు లాభాల్లో ముగియడం మార్చి తర్వాత ఇదే తొలిసారి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 246.32 పాయింట్లు(0.63 శాతం) లాభపడి 39,298.38 వద్దకు చేరుకున్నది. ఇంట్రాడేలో 39,361.06 గరిష్ఠ స్థాయిని తాకిన సూచీలు ఒక దశలో 38,963.60కి పడిపోయాయి. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 75.50 పాయింట్లు అధికమై 11,661.85 వద్ద స్థిరపడింది. వరుసగా రెండోవారంలో కూడా సూచీలు అధికమయ్యాయి. ఈ వారంలో సెన్సెక్స్ 1,171.30 పాయింట్లు లేదా 3.07 శాతం, నిఫ్టీ 356.80 పాయింట్లు లేదా 3.15 శాతం అధికమయ్యాయి.

**కొనసాగుతున్న యెస్ బ్యాంక్ ర్యాలీ**

యెస్ బ్యాంక్ ర్యాలీ కొనసాగుతున్నది. శుక్రవారం కూడా యెస్ బ్యాంక్ షేరు 8.44 శాతం లాభపడింది. గడిచిన ఐదు రోజుల్లో బ్యాంక్ షేరు ఏకంగా 30 శాతానికి పైగా లాభపడినట్లు అయింది. వీటితోపాటు మారుతి, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, ఎల్అండ్‌టీ, ఎస్బీఐల షేర్లు అధికమయ్యాయి. మరోవైపు టాటా మోటర్స్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్‌లు ఒక్క శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. రంగాలవారీగా చూస్తే విద్యుత్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, యుటిలిటీ, మెటల్, ఇంధన రంగ సూచీలు 2.63 శాతం లాభపడ్డా. 19 రంగాలకుగాను 19 లాభాల బాట పట్టాయి. అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు అంతర్జాతీయ మార్కెట్లలో భారీ ర్యాలీకి దోహదం చేశాయని, ఫలితంగా దేశీయ సూచీలు పుంజుకున్నాయని కొటక్ సెక్యూరిటీస్ వీపీ సంజీవ్ తెలిపారు. గడిచిన ఐదు ట్రేడింగ్‌లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు(ఎఫ్‌ఐఐ) 1.2 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా..దేశీయ మదుపరులు 263 మిలియన్ డాలర్లను స్టాక్ మార్కెట్లో చొప్పించారు. ఈ ఏడాది చివరినాటికి మరోదఫా సంస్కరణలు ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు కూడా మార్కెట్లో ప్రభావితం చేసింది. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 71.13 వద్ద ముగిసింది.

**రూ.6 లక్షల కోట్లు పెరిగిన సంపద**

స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో మదుపరుల జేబులు నింపుతున్నది. వరుసగా ఆరు రోజుల పాటు 1,400 పాయింట్ల వరకు పెరిగిన సెన్సెక్స్‌తో మదుపరుల సంపద కూడా మరో రూ.6 లక్షల కోట్లు అధికమైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల వార్తలతో గతవారంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు 3 శాతం లాభపడ్డాయి. కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలు, కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు, ఐటీ రంగ సంస్థ విప్రో అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించడం కలిసొచ్చింది.

### వెలుగులోకి ప్రభుత్వరంగ షేర్లు

ప్రభుత్వరంగ షేర్లు మిలమిలమెరిశాయి. విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్ 22.22 శాతం లాభపడగా, హిందుస్థాన్ కాపర్ 19.66 శాతం, ఎంఎంటీసీ 17.36 శాతం, షిప్పింగ్ కార్పొరేషన్ 9.31 శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 8.42 శాతం, సెయిల్ 7.90 శాతం, ఎన్‌బీసీసీ 7.58 శాతం, ఎన్ఎండీసీ 6.56 శాతం, రాష్ట్రీయా కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ 6.04 శాతం, ఎస్‌జేవీఎన్ 5.57 శాతం, ఆయిల్ ఇండియా 5.53 శాతం చొప్పున లాభపడ్డాయి. భెల్‌లో తనకున్న వాటాను 63.2 శాతం నుంచి 26 శాతానికి తగ్గించుకోనున్నట్లు కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో భెల్ షేరు ధర ఏకంగా 22.2 శాతం లాభపడింది.

# గుండె ఆగింది..

### గుండెపోటుతో మరో పీఎంసీ బ్యాంక్ ఖాతాదారుడి మృతి

### వారం రోజుల్లో నలుగురు!

**ముంబై, అక్టోబర్ 18:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార(పీఎంసీ) బ్యాంక్ కేసులో మరణించిన వారి సంఖ్య తాజాగా నాలుగుకు చేరింది. శుక్రవారం 83 ఏండ్ల వయస్సు కలిగిన మురళీధర్ ధారా గుండెపోటుతో మరణించారు. మురళీధర్..పీఎంఎస్ బ్యాంకులో రూ.80 లక్షలు డిపాజిట్ చేశారు. క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సకోసం వీటిని విత్‌డ్రా చేసుకుందామనుకుండగానే రిజర్వుబ్యాంక్ నియంత్రణ విధించడంతో ఉద్రేగానికి గురైన ఆయన కన్నుమూశారు. సోమవారం ఇద్దరు, మంగళవారం మరొకరు చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో గడిచిన వారం రోజుల్లో ఏకంగా నలుగురు మృత్యువాతపడ్డారు. వీరిలో ఇద్దరు గుండెపోటుతో మరణించగా...మహిళా డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నారు. 83 ఏండ్ల వయస్సు కలిగిన ధారా..శుక్రవారం ఉదయం సబర్బన్ ములుండ్‌లో గుండెపోటుతో మరణించినట్లు ఆయన కుమారుడు తెలిపారు. తన తండ్రికి అత్యవసరంగా చికిత్స చేయించడానికి పీఎంసీ బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.80 లక్షలు ఇవ్వాలని బ్యాంక్ ఉన్నతాధికారులను కోరినప్పటికి వారు పెడచెవిన పెట్టారని, నా తండ్రి మరణానికి వారే కారణమని ఆయన ఆవేధన వ్యక్తంచేశారు. మెడికల్ అవసరాలకుగాను మొత్తం డిపాజిట్ చెల్లించాలని ఆర్బీఐ ఆదేశాలను పీఎంసీ బ్యాంక్ ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టారు. ప్రస్తుతం ఒక ఖాతా నుంచి రూ.40 వేల వరకు ఉపసంహరించుకునే అవకాశం ఆర్బీఐ కల్పించింది. అలాగే మెట్రోపోలిస్ వర్సోవా ప్రాంతానికి చెందిన 39 ఏండ్ల డాక్టర్ నివేదితా బిజ్లాని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మోతాదుకు మించి నిద్ర మాత్రలను తీసుకుందని పోలీసులు తెలిపారు. పీఎంసీ బ్యాంక్‌లో నివేదితాకు కోటి రూపాయల డిపాజిట్లున్నాయి. ఇక మంగళవారం ఫట్టోమల్ పంజాబీ అనే మరో వ్యక్తి గుండెపోటుతో మరణించారు. పీఎంసీ బ్యాంక్ ములంద్ శాఖలో ఈయనకు ఖాతా ఉన్నది. రూ.8-10 లక్షల సొమ్ము దాచుకున్నారు.

## ఇన్‌సెక్టిసైడ్స్ టర్నోవర్ 1,300 కోట్లు

### ఎండీ రాజేశ్ అగర్వాల్ వెల్లడి



**హైదరాబాద్, అక్టోబర్ 18:** ప్రముఖ పురుగు మందులు తయారీ సంస్థ ఇన్‌సెక్టిసైడ్స్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.1,300 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఎండీ రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.1,145 కోట్లతో పోలిస్తే పది శాతం అధికమవనున్నదన్నారు. జపాన్‌కు చెందిన నిస్సాన్ పురుగు మందు కునోయిచీని మార్కెట్లోకి సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పురుగుల మందు మిరప పంట అన్ని దశల్లోనూ పనిచేస్తున్నదన్నారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి రూ.333 కోట్లు సమకూరుతుండగా, వీటిలో తెలుగు రాష్ట్రాల నుంచి రూ.250 కోట్లు లభించింది. వచ్చే మార్చి నాటికి ఇది రూ.380 కోట్లకు చేరుకుంటుందని ఆయన ఆశిస్తున్నారు. లీటర్ పురుగు మందు ధర రూ.12,500గా నిర్ణయించింది. ఎకరాకు 100 మిల్లీలీటర్లు కొడితే సరిపోతున్నదన్నారు.

# కొలువుల్లో విద్యుత్‌శాఖ నంబర్‌వన్

- ఆర్టిజన్లతో కలిపి మొత్తం 34808 మందికి ఉద్యోగాలు
- త్వరలో మరో రెండువేలమందికి
- వచ్చిన రెవెన్యూలో 9% వేతనాలకే
- ప్రభుత్వ సంస్కరణలతో ప్రగతి
- సీఎం చొరవతోనే నియామకాలు: ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఏర్పడిన తర్వాత అతి ఎక్కువమందికి ఉద్యోగాలిచ్చిన శాఖగా విద్యుత్‌శాఖ రికార్డు సృష్టించిందని, ఉద్యోగాల కల్పనలో నంబర్‌వన్‌గా నిలిచిందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. 2014 జూన్ 2 నుంచి ఇప్పటిదాకా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల ద్వారా మొత్తం 34,808 మందికి ఉద్యోగాలు లభించాయి. మరో రెండువేలమందికి త్వరలోనే ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నది. గత ఐదేండ్లలో విద్యుత్‌శాఖ ఏటా సగటున దాదాపు ఏడువేల మందికి ఉద్యోగాలు కల్పించింది. దేశంలో ఏ విద్యుత్‌శాఖలోనూ ఇంత పెద్దఎత్తున నియామకాలు జరుగలేదని అధికారులు చెప్పారు. మిగిలిన రాష్ట్రాల్లో వేతనాలకు 5% నుంచి 7% వరకు చెల్లిస్తుంటే.. తెలంగాణ విద్యుత్‌శాఖలో 9% వేతనాలకు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. అంతేకాదు.. టీఎస్‌పీఎస్సీ నియామకాల కన్నా, తెలంగాణ విద్యుత్‌శాఖ చేపట్టిన నియామకాలే అధికం. టీఎస్‌పీఎస్సీకి ప్రభుత్వం 36,474 ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇవ్వగా, ఇప్పటిదాకా 30,786 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. మిగిలిన పోస్టుల భర్తీ వివిధదశల్లో ఉన్నది. మొత్తంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 1,17,177 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తే.. ఇందులో విద్యుత్‌శాఖలో లభించిన ఉద్యోగాలే 29% ఉన్నాయి. పోలీస్‌శాఖ 17,276 మందికి (14.6%) ఉద్యోగావకాశం కల్పించి, రెండోస్థానంలో ఉంటే.. 11,935 (10%) ఉద్యోగాలతో గురుకుల విద్యాలయాల సంస్థ, 10,500 (9%) ఉద్యోగాలతో సింగరేణి, 9,495 (8%) ఉద్యోగాలతో పంచాయతీరాజ్‌శాఖ తదుపరి స్థానాల్లో ఉన్నాయి.



### ప్రభుత్వ చర్యలతోనే భారీ నియామకాలు

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విభాగాలను పటిష్ఠంచేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతోనే విద్యుత్‌సంస్థల్లో భారీ నియామకాలు సాధ్యమైనట్టు అధికారులు తెలిపారు. తెలంగాణ ఏర్పడేనాటికి 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులో ఉన్నది. గత ఐదేండ్లలో 8,441 మెగావాట్లు అదనంగా అందుబాటులోకి రావడంతో మొత్తం 16,219 మెగావాట్లకు చేరుకున్నది. జెన్‌కో ఆధ్వర్యంలోనే 5,880 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌కేంద్రాల నిర్మాణం తలపెట్టారు. వ్యవసాయంతోపాటు అన్నిరంగాలకు 24 గంటల విద్యుత్ అందించడంతో డిమాండ్ బాగా పెరిగింది. అందుకు అనుగుణంగా విద్యుత్‌శాఖ రూ.25,661 కోట్లతో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఏర్పాటుచేసింది. వీటి నిర్వహణకు పెద్దఎత్తున నియామకాలు చేపట్టింది. ఎన్నో ఏండ్లుగా అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నవారిని సంస్థల్లో విలీనం చేసుకోవడం కూడా నియమకాల సంఖ్య పెరుగటానికి ఒక కారణమని అధికారులు చెప్తున్నారు.

### ముఖ్యమంత్రి చొరవ వల్లనే నియమకాలు



విద్యుత్ సంస్థల బలోపేతంతోనే ప్రజలకు మెరుగైన సేవలు అందించడం సాధ్యమని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించడంతో మా విద్యుత్ సంస్థలు విజయాలు సాధిస్తున్నాయి. అన్నిశాఖల్లో కన్నా విద్యుత్‌శాఖలోనే ఎక్కువ నియామకాలు సీఎం కేసీఆర్ చొరవ ఫలితమే. జెన్‌కో ద్వారానే విద్యుత్ ఉత్పత్తి జరగాలని సీఎం నిర్ణయించారు. దీనివల్ల ఉత్పత్తి ప్లాంట్లలో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టాం. ఉద్యోగ భద్రత లేకుండా, ఏజన్సీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన 22,637 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో విలీనం చేసుకోవాలనే మానవతా నిర్ణయం కూడా సీఎం కేసీఆర్‌దే. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నది.

**- దేవులపల్లి ప్రభాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ**

## జూనియర్ కాలేజీల్లో నైపుణ్య శిక్షణ

- తొలుత పది కాలేజీల్లో అమలుకు నిర్ణయం
- ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నైపుణ్య శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు కూడా రూపొందించింది. తొలుత పది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నైపుణ్య శిక్షణ కోర్సులు అమలుచేయాలని నిర్ణయించారు. డొమెస్టిట్ డాటా ఎంట్రీ ఆపరేటర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, టైలర్, గార్డెనర్, ఆఫీస్ అసిస్టెంట్, ఎలక్ట్రిక్ డొమెస్టిక్ సొల్యూషన్స్ వంటి పలు నైపుణ్య కోర్సులు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. వీటి నిర్వహణ కోసం ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవివై) నుంచి ఆర్థిక సహకారం పొందనున్నట్టు చెప్పారు. నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందినవారికి శిక్షణకాలంలో స్టైఫండ్ కూడా ఇవ్వనున్నామన్నారు. ఈ కోర్సులు చేసిన విద్యార్థులకు జీవితంలో స్థిరపడేందుకు నైపుణ్యాన్ని అలవర్చుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. తొలి విడుతగా గద్వాల్, నారాయణపేట, జనగామ, జగిత్యాల, ములుగు, మహబూబాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, హైదరాబాద్ ఫలక్‌నుమా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నైపుణ్య కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్టు పేర్కొన్నారు.

## బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ గడువు పెంపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ కోటా కింద భర్తీ చేయాల్సిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ గడువును ప్రభుత్వం 2020 జూన్ 30 వరకు పొడిగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. 2001 మే ఎనిమిది నుంచి ఈ నియామక గడువును ఎప్పటికప్పుడు పొడిగించుకునేందుకు వీలుగా అప్పటి ప్రభుత్వం జీవో నంబర్ 215ను జారీచేసింది. దాని ఆధారంగా అప్పటినుంచి ప్రభుత్వాలు పలుమార్లు నియామక గడువును పొడిగిస్తూ వస్తున్నాయి.

### కేంద్ర పారిశ్రామిక భద్రతాదళంలో ఉద్యోగాలు

**మేడ్చల్ జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సీఐఎస్ఎఫ్), భారత హోంమంత్రిత్వశాఖలో 914 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసినట్లు జిల్లా యువజన సర్వీసులశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 22న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేయాలని, వివరాలకు cisfrectt.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

## సవాళ్లతో బయటపడనున్న సమర్థత

- అక్రమాలు అరికట్టేందుకు అటవీమార్గాల్లో సీసీ కెమెరాలు
- అటవీ సర్వీస్ మెడల్స్‌ను పునరుద్ధరిస్తాం
- రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



శుక్రవారం దూలపల్లి అటవీ అకాడమీలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**పేట్‌బషీరాబాద్:** సవాళ్లను ఎదుర్కొన్నప్పుడే మన సమర్థత బయటపడుతుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. సవాళ్లను ఎదుర్కోవడం అటవీశాఖాధికారులు, సిబ్బంది ఓ అవకాశంగా భావించి నిరూపించుకోవాలని సూచించారు. మేడ్చల్ జిల్లా దూలపల్లిలోని అటవీ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అటవీ అధికారుల రెండురోజుల వర్క్‌షాపును శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అడవుల పరిరక్షణ, పునరుజ్జీవానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జంగల్ బచావో.. జంగల్ బడావో అనే నినాదాన్ని ఉద్యమ స్ఫూర్తిగా తీసుకొని పచ్చదనం పెంపుదల, అడవులను రక్షించడానికి అటవీశాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం కష్టపడాలని సూచించారు. చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణాను అరికట్టేందుకు, వన్యప్రాణుల రక్షణకు అటవీ మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నదని చెప్పారు. విధుల్లో ప్రతిభ కనబర్చిన అటవీ సిబ్బందికి ఇచ్చే సర్వీస్ మెడల్స్‌ను పునరుద్ధరిస్తామని, వచ్చే జనవరి 26 నుంచి సేవా పతకాలు అందించేలా చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ మాట్లాడుతూ.. పచ్చదనం, పర్యావరణ సమతుల్యతపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్నదని, సీఎం కేసీఆర్ గ్రహించి ముందుచూపుతో తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ సందర్భంగా కంపా నిధులపై వార్షిక ప్రణాళిక 2019-20 నివేదికను ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్ శోభ, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ రఘువీర్, ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ పృథ్వీరాజ్, రిటైర్డ్ అదనపు పీసీసీఎఫ్ కోట తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎలక్షన్ పిటిషన్లలో ఈసీకి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జహీరాబాద్, మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యుల ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లలో ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీచేసింది. జహీరాబాద్‌లో కాంగ్రెస్ తరపున పోటీచేసి ఓడిపోయిన మదన్‌మోహన్ తరపున కేంద్ర మాజీమంత్రి సల్మాన్‌ఖుర్షీద్, మహబూబ్‌నగర్‌లో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిన డీకే అరుణ తరపున జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపించారు.

### రైల్ నిలయంలో 'మాక్ ఫైర్ డ్రిల్'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మాక్ ఫైర్ డ్రిల్‌ను నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పడంతో జీఎం గజానన్ మాల్యా సహా అధికారులు రైల్ నిలయం వదిలి బయటకు వచ్చారు. ఆర్పీఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి తదుపరి చర్యలకు ఉపక్రమించాక మాక్ డ్రిల్ అని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా గజానన్ మాల్యా మాట్లాడుతూ.. అగ్ని ప్రమాద సమయాల్లో అధైర్యపడకుండా ఆలోచనతో వ్యవహరించాలని తెలిపారు.

## బీజేపీకి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

- సీపీఎం నేత ప్రకాశ్ కారత్ వ్యాఖ్య

**అగర్తల, అక్టోబర్ 18:** కేంద్రంలో బీజేపీకి కమ్యూనిస్టులు మాత్రమే ప్రత్యామ్నాయాన్ని ఏర్పరచగలరని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ వ్యాఖ్యానించారు. శుక్రవారం త్రిపుర రాజధాని అగర్తలలో నిర్వహించిన సీపీఐ వందో వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రోద్యమ సమయంలో ఉన్న సైద్ధాంతిక మూలాల నుంచి కాంగ్రెస్ పార్టీ దూరమైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మోదీ-షా పాలనకు వామపక్షాలే ప్రత్యామ్నాయాన్ని నిర్మించగలవని చెప్పారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేసి దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని వెల్లడించారు. వలసవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం చేసిన చరిత్ర వామపక్షాలకు ఉందన్నారు. భారత కమ్యూనిస్టులను చూసి బ్రిటిష్ వారు భయపడ్డారని, 1920-25 మధ్య కాలంలో ఐదు కుట్ర కేసుల్లో ఇరికించారని చెప్పారు. 'కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా అనేక కేసులు పెట్టారు. మా నేతలను హత్యచేశారు. అయినా మా ఉద్యమాలను అణచివేయలేకపోయారు. ఇప్పుడు కూడా మమ్మల్ని అణచలేరు' అని ఆయన పేర్కొన్నారు. త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీజేపీ-ఐపీఎఫ్‌టీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వామపక్ష నేతలు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదన్నారు.




# హెల్త్ వాచ్

## డిప్రెషన్‌లో ఉన్నారా? హెల్దీఫుడ్ తినండి



పండ్లు, కూరగాయలు. చేపల వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా డిప్రెషన్‌కు దూరంగా ఉండొచ్చంటున్నాయి ఇటీవలి అధ్యయనాలు. డిప్రెషన్‌లో ఉన్నవాళ్లు కూడా ఈ ఆహారం తినడం ద్వారా దానినుంచి బయటపడవచ్చని ఆస్ట్రేలియాలోని మస్క్వేరీ వర్సిటీ పరిశోధకులు చెప్తున్నారు. డిప్రెషన్ బారినపడిన యువకులు ఈ హెల్దీడైట్ తీసుకున్న మూడువారాల్లో డిప్రెషన్ లక్షణాలు తగ్గుముఖం పట్టినట్టు గుర్తించారు. వర్సిటీలో చదువుతున్న 17 నుంచి 35 ఏండ్ల మధ్య వయసున్న 76 మందిపై ఈ అధ్యయనం చేశారు. ఆస్ట్రేలియాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా యువత ఫాస్ట్‌ఫుడ్‌కు బాగా అలవాటుపడింది. అందుకే స్థూలకాయం, బీపీ, షుగర్ లాంటి జీవనశైలి సంబంధ వ్యాధులు చిన్న వయసులోనే చుట్టుముడుతున్నాయి. వీటికి తోడు మానసిక సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఆహారం ఆరోగ్యకరంగా లేకపోవడంతోపాటు ఒత్తిడి పెరిగిపోవడం వల్ల డిప్రెషన్ లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నవాళ్లు ఎక్కువగా ఉంటున్నారు. అందుకే ఇప్పుడు తీసుకుంటున్న ఆహార అలవాట్లను మార్చుకుని మంచి డైట్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

## గర్భిణుల్లో మధుమేహం.. పిల్లలకు ఊబకాయం?!

గర్భిణుల రక్తంలో చక్కెర మోతాదులు ఎక్కువగా ఉంటే.. పుట్టబోయే బిడ్డ భవిష్యత్తులో ఊబకాయంతో బాధపడే అవకాశం ఉందని చెప్తున్నారు టెనసీ వర్సిటీ పరిశోధకులు. గర్భిణులలో తాత్కాలికంగా కనిపించే మధుమేహాన్ని అంటే జెస్టేషనల్ డయాబెటిస్‌ని గుర్తించకపోయినా, చికిత్స తీసుకోకపోయినా ఈ సమస్య వస్తుంది. 1995 నుంచి 2004 మధ్యకాలంలో 40వేల మంది గర్భిణులను పరిశీలించి, తరువాత వారి పిల్లల వివరాలను తీసుకున్నా ఈ అంచనా కు వచ్చామంటున్నారు అధ్యయనంలో పాల్గొన్న స మంతా ఎహెర్లిచ్. వీరందరికీ 24, 28 వారాల గర్భం ఉన్నప్పుడు రక్తంలోని గ్లూకోజ్ మోతాదు ను పరీక్షించారు. గ్లూకోజ్ ఎక్కువగా ఉంటే జెస్టేషనల్ డయాబెటిస్ ఉందా లేదా నిర్ధారించడానికి అదనంగా పరీక్షలు చేశారు. సాధారణ చక్కెర మోతాదులు ఉన్నవారితో పోలిస్తే గ్లూకోజ్ ఎక్కువగా ఉన్నవారి పిల్లలు ఊబకాయులయ్యేందుకు 13శాతం అవకాశం ఉన్నదని తేలింది. జెస్టేషనల్ డయాబెటిస్ ఉంటే 52 శాతం అవకాశముందని చెప్తున్నారు.



### నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కు కొత్త హంగులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లింగంపల్లి-తిరుపతి మధ్య నడిచే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ కొత్త హంగులు సంతరించుకున్నది. పర్యావరణ హిత ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతోపాటు పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌తో నడిచేలా ఏర్పాటుచేశారు. వేగాన్ని పెంచడంతోపాటు అభివృద్ధి చేసిన ఇతర వసతులు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటాయని దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

### 'అమర పోలీసుల స్మృతి'లో విజేతలకు డీజీపీ అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలీస్ అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'ఇఫ్ ఐ వర్ ది పోలీస్‌మెన్' అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆర్సీపురానికి చెందిన విస్టా పియర్సన్ స్కూల్ విద్యార్థి ఐ అఖిల్, రెండో బహుమతిని నల్లగొండలోని ది నల్లగొండ పబ్లిక్ స్కూల్ విద్యార్థి మహ్మద్ వాసిఫ్, తృతీయ బహుమతి జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి జెడ్పీహెచ్ఎస్ చింతలకుంట విద్యార్థిని కే శ్రీజ గెలుచుకున్నారు.

### విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించొచ్చు

**కోల్‌కతా, అక్టోబర్ 18:** అవసరం మేరకు విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించుకోవచ్చని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం స్పష్టం చేసింది. రెండేండ్లుగా ఎన్నికలను నిలిపివేసిన నాలుగు యూనివర్సిటీలకు ఈ మేరకు అనుమతి ఇచ్చింది. జాదవ్‌పూర్, ప్రెసిడెన్సీ, రవీంద్ర భారతి, డైమండ్ హార్బర్ ఉమెన్స్ యూనివర్సిటీల ఉప కులపతులకు ఉన్నత విద్యాశాఖ సహాయ కార్యదర్శి నుంచి లేఖలు అందాయి. ఎలాంటి అనుబంధ కాలేజీలు లేని ఏక వర్సిటీల నుంచి అందిన విన్నపం మేరకు వివిధ వర్గాలతో చర్చల అనంతరం విద్యార్థి సంఘాలు, విద్యార్థి మండళ్లకు ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపినట్లు అందులో పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను యూనివర్సిటీల పరిపాలన విభాగం నిర్ణయిస్తుందని విద్యాశాఖ మంత్రి పార్థ చటర్జీ మీడియాకు తెలిపారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందన్న గవర్నర్ జగదీప్ ధంఖర్ అన్ని యూనివర్సిటీలు, కాలేజీల్లోని విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. కాగా ప్రభుత్వ నిర్ణయాన్ని తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన తృణమూల్ కాంగ్రెస్ చాత్ర పరిషత్ (టీఎంసీపీ), ఆర్ట్స్ ఫ్యాకల్టీ స్టూడెంట్స్ యూనియన్ (ఏఎఫ్ఎస్‌యూ) స్వాగతించాయి.



నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
జిందగీ
శనివారం 19 అక్టోబర్ 2019 /nt.zindagi
కరీంనగర్

**రేడియో ఆన్ చేయగానే శ్రోతకు ముందుగా కనెక్ట్ అయ్యేది రేడియో జాకీ(ఆర్జే) గొంతులోని మార్దవం మాత్రమే. అది హృదయ స్పందనకు సరిపోయే తరంగ దైర్ఘ్యమంత ఉండాలి. కార్యక్రమం వినసొంపుగా లేకపోతే వేరే స్టేషన్‌కి మారిపోతారు. అసలు శ్రోతల్ని నిలబెట్టుకోవడమే ఆర్‌జేకి మైకు ముందున్న సవాల్. 'ఆకాశవాణి.. హైదరాబాద్ మీరు వింటున్నారు' అంటూ ఎన్నోయేండ్లుగా కొన్ని వందల గొంతులు శ్రోతల హృదయాలను మీటాయి. రేడియో ఆన్ చేయగానే మృదువైన భాషతో.. సుమధుర స్వరంతో బోలెడంత సమాచారం, సందర్భోచితంగా ఆహ్లాదకరమైన పాటలను అందిస్తూ శ్రోతలను ఆకట్టుకుంటున్నారు వ్యాఖ్యాతలు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి వివిధ స్టేషన్ల ద్వారా కోట్లాది మంది శ్రోతలను ఆప్యాయంగా పలకరించే కొందరు ఆర్జేలను చూపించే ప్రయత్నం చేసింది జిందగీ.**

# మీరు చూస్తున్నారు ఆకాశవాణి వ్యాఖ్యాతలను



## మురళీకృష్ణ



మృదువైన గాత్రంతో గాంధీగిరీ చేయలగరు అంబడిపూడి మురళీకృష్ణ. సినిమా, రంగస్థల నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా.. ప్రముఖ వ్యాఖ్యాతగా లక్షలాది మందికి సుపరిచితులు. రాష్ట్రపతులు, గవర్నర్లు, ముఖ్యమంత్రుల నుంచి మంత్రుల వరకూ ఎందరెందరో ప్రముఖుల అభినందలను అందుకున్నారు ఈ 'వ్యాఖ్యాన వాచస్పతి' మురళీకృష్ణ. సంప్రదాయానికి సృజనాత్మకతను మేళవించి సభికులను ఆకట్టుకోవడం ఈయన ప్రత్యేకత. గుంటూరు జిల్లా, బాపట్ల దగ్గర్లలోని గొల్లపూడి అగ్రహారంలో జన్మించారు. డిగ్రీవరకు బాపట్లలోనే చదివారు. అందంగా ఉండడం, నాటకాలు వేసిన అనుభవంతో హీరో అవ్వాలని హైదరాబాద్ వచ్చారు. ఆ తర్వాత ఎన్నో ప్రైవేట్ కంపెనీల్లో రాత్రనక, పగలనక కష్టపడ్డారు. ఒకవైపు ఆకాశవాణిలో అనౌన్సర్(ఆర్జే)గా చేస్తూనే, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనౌన్సర్‌గా, దూరదర్శన్‌లో యాంకర్‌గా మూడుచోట్ల పనిచేశారు. 1996లో 'కళారాధన' యువపురస్కారం, 1998లో మధుర వ్యాఖ్యాత, ఏపీ ప్రభుత్వం నుంచి 'నంది అవార్డు, జేసీస్ నుంచి 'అవుట్‌స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు', 2006లో ఉగాది పురస్కారం, 2008లో 'విశాల భారతి గౌరవ సత్కార్' వంటి అవార్డులు మురళీ కృష్ణను వరించాయి. దాదాపు 30 యేండ్లుగా ఆకాశవాణిలో పనిచేస్తున్నారు. ఆకాశవాణి జాతీయ స్థాయిలో అందించే ఐదు పురస్కారాలను అందుకున్నారు. 2012లో 'యూజ్ అండ్ త్రో', 2014లో 'విశ్వ గురు', 2015లో 'గంగిరెద్దు' నాటక ప్రదర్శన, 2017లో 'కాలం', 2018లో 'పట్టాభిషేకం' అనే కార్యక్రమాలకు జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయి. నటుడిగా మహానటి సినిమాలో సమంత తండ్రిగా మెప్పించారు. తర్వాత దేవదాసులో, పడిపడిలేచే మనసు సినిమాల్లో నటించారు. సీరియళ్లు, షార్ట్‌ఫిల్మ్‌లలో నటించారు. దాదాపు 5వేలకు పైగా కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## రాజబాబు



వివిధ్ భారతిలో అనౌన్సర్(ఆర్జే)గా చేస్తున్న రాజబాబు మాటే మంత్రం. గంభీరమైన స్వరంతో శ్రోతలను ముగ్ధలను చేస్తుంటారు. 1992లో నిజామాబాద్ రేడియో స్టేషన్‌లో నాటకాలు వేయడానికి వచ్చి.. అదే రేడియోలో ఉద్యోగిగా చేరారు. అంతకుముందు మూడేండ్ల పాటు జర్నలిస్టుగా పనిచేశారు. 1996లో కొత్తగూడెం రేడియో స్టేషన్‌లో చేరిన తర్వాత 'జీవన కెరటాలు' కార్యక్రమం ద్వారా ప్రముఖుల విజయాలను శ్రోతలకు పరిచయం చేశారు. 2002 నుంచి హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో పనిచేస్తున్నారు. సీనియర్ అనౌన్సర్‌గా సినీ రంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులతోపాటు పలు రంగాలకు చెందిన వారి ఇంటర్వ్యూలు చేస్తున్నారు. ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని తెలుగులో ప్రసంగిస్తూ.. 'తెలుగు మోదీ'గా పేరుగాంచారు. మన్ కీ బాత్ ప్రారంభం నుంచి తెలుగులో ఆయన స్వరంతోనే వింటున్నాం.

## బాలకృష్ణ (బాలు)



'ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రోతలను అలరించే తెలుగు కార్యక్రమాలు..' అంటూ మధురస్వరంతో అలరిస్తారు వివిధ్ భారతి సీనియర్ అనౌన్సర్ బాలకృష్ణ(బాలు). పుట్టి, పెరిగి, చదువుకున్నదంతా తిరుపతిలోనే. వక్తృత్వ పోటీలంటే ఇష్టం ఉండడంతో ఎక్కడికెళ్లినా బహుమతులతోనే వచ్చేవారు. అలా భాషపై, గాత్రంపై పట్టుదొరికింది. డిగ్రీ పూర్తయ్యాక తిరుపతిలో కాంట్రాక్ట్ పద్ధతిలో అనౌన్సర్‌గా చేశారు. కర్నూలులో శాశ్వత ఉద్యోగిగా ఫస్ట్ అపాయింట్‌మెంట్ 1992 జులై 6న వచ్చింది. 2004 నవంబర్‌లో హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రానికి వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ రంగాలకు చెందిన దాదాపు 2వేలకు పైగా ప్రముఖులను ఇంటర్వ్యూ చేస్తూనే ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'శ్రీరామచంద్ర మిషన్'కు 20 యేండ్ల నుంచి వలంటీర్‌గా ఉంటూ ధ్యానం నేర్పిస్తున్నారు. పర్యాటక ప్రాంతాలపై రేడియో కథనాలు అందించారు. రేడియో నాటకాలు చేశారు. మూడుసార్లు బెస్ట్ అనౌన్సర్‌గా అవార్డు అందుకున్నారు.

## ఐనంపూడి శ్రీలక్ష్మి



ఆకాశవాణిలో సాహిత్య కుసుమం ఐనంపూడి శ్రీలక్ష్మి. ఆమె మధురమైన స్వరం లక్షలమందిశ్రోతలతో 'స్వరచాలనం' చేస్తుంటుంది. స్టూడియోలో మైక్ ముందు ఒంటరిగా ఉన్నా.. ఆమె చెప్పే మాటలు వినడానికి ఎంతో మంది శ్రోతలు ఎదురు చూస్తుంటారు. ఏకాంత సౌధంలో ఉంటూ సమాజంలోని రుగ్మతలపై శ్రీలక్ష్మి పోరాడుతున్నారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలపై పదునైన కవితలతో మార్పు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సరిహద్దుల్లో సైనికులకు లేఖలు రాసి, వారి కుటుంబసభ్యుల్లో భరోసా అందించారు. 'డాక్యుపోయమ్' అనే నూతన ప్రక్రియను పరిచయం చేశారు. నిజామాబాద్ ఆలిండియా రేడియోలో శ్రీలక్ష్మి ప్రయాణాన్ని ప్రారంభించారు. తర్వాత హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రానికి వచ్చారు. 29 యేండ్ల అనుభవం ఆమెది. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తిపురస్కారం, ప్రతిభాపురస్కారం, కవితలకు అవార్డులూ అందుకున్నారు శ్రీలక్ష్మి.

## సునీల్‌దత్



సునీల్.. ఓ మాటల మరాఠీ. మన పక్కింటి స్నేహితుడిలా మన వెన్నంటి నిలిచే ఆత్మీయుడిలా పలకరిస్తారు. సిటీలో ఏం జరుగుతున్నది? కొత్తగా ఏ విషయాలు చర్చిస్తున్నారు? వాతావరణం, ఆహారం, ఆరోగ్యం, సంగీతం, సినిమా ఇంకా ఎన్నో అప్‌డేట్స్.. దక్కనీ భాషలో మనకు అందిస్తారు. తెలంగాణ యువకుడైన సులీల్‌దత్ ఒక దశలో సెలబ్రిటీ స్థాయిని అనుభవించారు. ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూశారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కంఠం గ్రామం నుంచి వచ్చారు. రెయిన్‌బోలో ఆర్‌జేగా, రేడియో సిటీలో సీనియర్ ప్రొడ్యూసర్‌గా, మ్యూజిక్ మేనేజర్‌గా, బ్రేక్‌ఫాస్ట్ ఆర్‌జేగా.. ఇప్పుడు మళ్లీ రెయిన్‌బో ఎఫ్‌ఎం ఆర్‌జేగా.. 18 యేండ్ల నుంచి శ్రోతలతో కలిసి ప్రయాణిస్తున్నారు సునీల్‌దత్. 'హైదరాబాద్ అకాడమీ ఆఫ్ రేడియో అండ్ టెలివిజన్, ది రేడియో హైదరాబాద్' ద్వారా వందలాది మందిని ఆర్జేలుగా, యాంకర్లుగా తీర్చిదిద్దారు. 'ది రేడియో హైదరాబాద్ గ్లోబల్' కోసం నిత్య శ్రామికుడిలా పోరాడుతున్నారు.

## సుధా



'సరదా సమయం'లో సరదాగా సరదాగా మాట్లాడుతూ.. శ్రోతల హృదయాల్లో చిరస్థానం సంపాదించుకున్నారు ఆర్జే సుధా. రేడియో జాకీగా 15 యేండ్ల అనుభవం. కాకినాడలో పుట్టినా..నాన్న బ్యాంక్ ఉద్యోగి కావడంతో చదువు, పెరిగిందంతా మెట్రోపాలిటిన్ నగరాల్లోనే. తాతగారు వేలూరి కృష్ణమూర్తి 'గులేబాకావళి కథ'(1962) సినిమా సంగీత దర్శకుడు. మొదట రెయిన్‌బో ఎఫ్‌ఎంలో పనిచేసి.. తర్వాత రేడియోసిటీలో ఆర్జేగా, వెబ్‌రేడియో స్టేషన్ 'రేడియో ఖుషీ'లో పనిచేశారు. కొన్ని కారణాల వల్ల మళ్లీ రెయిన్‌బోకు వచ్చేసి ఆర్జేగా కొనసాగుతున్నారు.

## లక్కీ



'అమ్మా.. అంత చిన్న రేడియోలోకి అంతపెద్ద మనుషులు ఎలా వెళ్తారమ్మా?' అంటూ ప్రశ్నించిన ఆ అల్లరి పిల్ల.. ఇప్పుడు అదే రేడియోలో 'నేను మీ ఆర్జే లక్కీ.. మీరు వింటున్నారు ఎఫ్‌ఎం రెయిన్‌బో 101.9, రెయిన్‌బోతో మీ జీవితం రంగులమయం' అంటూ గలగల మాట్లాడేస్తున్నారు. తండ్రి చనిపోయిన తర్వాత చిన్నతనంలోనే ఎన్నో కష్టాలు చవిచూసి, నరసాపురం నుంచి భాగ్యనగరికి పయనమయ్యారు. లక్కీని హైదరాబాద్ పూర్తిగా మార్చేసింది. సత్యసుధాకర్ రెడ్డి ఇచ్చిన ఆశ్రయం, సంపత్‌కుమార్ ఇచ్చిన ప్రోత్సాహంతో 2006 జనవరిలో రెయిన్‌బో ఆర్జేగా కొత్త జీవితాన్ని ప్రారంభించారు లక్కీ. ఇటీవల 'ఐరా' పేరుతో ఓ చిన్న మీడియా హౌస్‌ను ప్రారంభిచారు.

## సురభి రమేశ్



సురభి కుటుంబం నుంచి మొదటి ఆర్జేగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు రమేశ్. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను అధిగమించి.. సురభి సమాజం కోసం అధ్యయనాలు, పరిశోధనలు చేశారు. ఆర్జేగా మైక్ ముందు చాలా సరదాగా, కూల్‌గా, హుషారుగా నలుగురిని నవ్విస్తూ.. మాటలతో కట్టిపడేస్తూ ఉండే రమేశ్ ఇతనేనా? అనిపిస్తుంది. 2006 నుంచి ఆకాశవాణితో కలిసి పనిచేస్తున్నాడు. థియేటర్ ఆర్ట్స్‌లో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు రమేశ్. సురభి కుటుంబంనుంచి మొట్టమొదటిసారి పీహెచ్‌డీ చేసిన ఘనత రమేశ్‌దే. షాంఘైలో జరిగిన ఐఎఫ్‌టీఆర్ సదస్సులో సురభిలో స్త్రీ పాత్రపై ప్రసంగించారు. 'సురభి సమాజానికి నేనేం చేశాను?' అంటూ.. ప్రశ్నించుకునే వ్యక్తి.

## రేఖ



రేఖ పుట్టి పెరిగిందతా హైదరాబాద్‌లో. ఆమె గొంతు బాగుంటదని భర్త బాగా ప్రోత్సహించారు. సంగీత ప్రియుడైన భర్త పట్టుదలతోనే 2014లో ఆర్జేగా వచ్చారు. రేఖ హరికథ కళాకారిణి. తండ్రి వారసత్వంగా ఆమెకు ఈ కళ అబ్బింది. భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నెలకు ఒక్కో ఆలయంలో హరికథ చెబుతుంటారు. ఆకాశవాణి స్టూడియోలోకి రాగానే అంతా మర్చిపోయి.. కొత్త లోకంలో విహరిస్తుంటారు. పరిణిత షోలో తనదైన శైలిలో శ్రోతలను ఆకట్టుకుంటున్నారు రేఖ. ఒకవైపు ఆర్జేగా చేస్తూనే తెలుగు యూనివర్సిటీలో ఎంఏ థియేటర్ చేశారు.

## దీపారాజ్



దీపారాజ్ ఆజేశ్.. పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. హెచ్‌సీయూలో ఎంఏ ఇంగ్లిష్ చేశారు. చిన్నప్పుడు రేడియోలో మనుషుల్ని చూడాలని రెండు మూడు రేడియోలు కూడా పగులగొట్టారు. తర్వాత నిజం తెలిసింది. ఎలాగైనా ఆర్జే అవ్వాలని అనుకున్నారు. 2006 నుంచి తన దీపారాజ్ రేడియో ప్రస్థానం మొదలైంది. శ్రోతలకు సామాజిక అంశాలపై అవగాహన కలిగించే టాపిక్‌లు ఎంచుకుంటారు. కార్పొరేట్ సంస్థల్లో ఇంగ్లిష్ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. లయోలా కాలేజ్‌లో ఇంగ్లిష్ లెక్చరర్‌గా చేస్తున్నారు. తన ప్రయాణంలో కుటుంబ ప్రోత్సాహం మర్చిపోలేదని అంటున్నారు దీపారాజ్.

## జయశ్రీ



'నమస్తే.. ఆదాబ్' అంటూ ఉదయాన్నే పలకరించే ఆర్జే జయశ్రీ. పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. 'మీలో ఎవరు కోటీశ్వరుడు' మొదటి సీజన్‌లో రూ.3.20 లక్షలు గెలుపుపొందారు. తన పెంపుడు కుక్క(ట్రిక్సీ) అంటే చాలా ఇష్టం. 'బ్లూ క్రాస్, పీపుల్స్ ఫర్ యానిమల్స్' అనే సంస్థల్లో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ఆర్జేగా సమాజానికి ఉపయోగపడే అంశాలను తన 'టాపిక్'గా ఎంచుకుంటారు. జయశ్రీలో మరోకళ స్టాండప్ కామెడీ. ఇందులో కూడా సామాజికాంశాలను అస్త్రాలుగా చేసుకొని నవ్వులు పూయిస్తున్నారు. 'ఇంప్రోవ్' అనే కొత్త విధానంతో తన ప్రత్యేకత చాటుకున్నారు జయశ్రీ. ఈమెకొక టీం ఉంది.

## స్వాతి



స్వాతి ఆర్జేగా వచ్చిన కొత్తలో.. 'ఏంటమ్మాయ్ స్వాతి.. రేడియోలో మూగవార్తలు చదవడానికి వచ్చావా?' అన్నారట. అసలే పట్టుదల కలిగిన స్వాతి.. మైక్ మింగేసినట్టుగా గలగల మాట్లాడడం ప్రారంభించి.. తక్కువ కాలంలోనే ఎక్కువ మంది అభిమానులను సంపాదించుకున్నారు. పుట్టి పెరిగిందంతా సంగారెడ్డి. 'గుడ్ ఈవినింగ్ ట్విన్ సిటీస్'లో వివిధ స్వచ్ఛంద సంస్థలు, మానసిక చికిత్సా కేంద్రాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి, వాళ్ల సాధకబాధకాలు తెలుసుకొని, వాళ్లతో మాట్లాడి.. నచ్చిన పాటలు ప్రసారం చేసేవారు. మొదటి 5 వారాలు ప్రసారం చేయాలనుకున్న కార్యక్రమాన్ని 52 వారాలు కొనసాగించారు. తన 13 యేండ్ల ఆర్జే ప్రయాణంలో కుటుంబసభ్యులు, ప్రత్యేకించి మేనమామ సహకారం మర్చిపోలేనిదని అంటున్నారు.

## సతీష్ అట్ల



వరంగల్ ఆకాశవాణి కేంద్రంలో ఆర్జేగా మొదలయ్యింది సతీష్ ప్రయాణం. యువవాణిలో 184 క్విజ్ షోలను నిర్వహించారు. ఈ క్విజ్ కార్యక్రమం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి, ఇతర ప్రవేశ పరీక్షలకు చదవాలనుకునే యువతకు ఎంతగానో ఉపయోగపడింది. 2014 సెప్టెంబర్ 10న ఆలిండియా రేడియోలో ఆర్జేగా కొత్త జీవితం ప్రారంభమయింది. అప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని 2018 ఏప్రిల్ 29 వరకు నిర్వహించారు. ఆకాశవాణిలో చేరినప్పటి నుంచి ఎంతో నేర్చుకున్నానని గర్వంగా చెబుతున్నారు సతీష్.

## జ్యోతిరెడ్డి



ఆలిండియా రేడియో అంటే తనకు గురువులాంటిది అంటున్నారు జ్యోతిరెడ్డి. ఆకాశవాణిలో ప్రసారమయ్యే కార్యక్రమాలు ఆమె తండ్రికి ఎంతో ఇష్టం. అలా వింటూ ఎన్నో విషయాలు తెలుసుకున్న జ్యోతిరెడ్డి అదే రేడియోలో ఆర్జేగా ఆకట్టుకుంటున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలుండడం వల్ల నేటితరం వారు కూడా తెలుసుకోగలుగుతున్నారని అంటున్నారు. ఆమెకు ఆర్జేగా ఏడేండ్ల అనుభవం ఉంది.



...✍ ఇంటర్వ్యూలు : డప్పు రవి, పసుపులేటి వెంకటేశ్వరరావు

## సత్యనారాయణ



సత్యనారాయణ (సత్య) ఏడేండ్లుగా ఆర్జేగా చేస్తున్నారు. ఆర్జేగా చేస్తుండడం వల్ల సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం దక్కుతుందని అంటున్నారు. శ్రోతల ప్రశంసలు తమపై బాధ్యతను పెంచుతున్నాయని చెబుతున్నారు. సరదాగా పాటలు వింటూ, వినిపిస్తూ శ్రోతలు చెప్పే విషయాలు తెలుసుకుంటూ, కొత్త విషయాలను వారికి చెబుతూ ఆర్జే లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు సత్య. ఎన్ని రకాల సమాచార మాధ్యమాలు వచ్చినా ఆకాశవాణి స్థానాన్ని భర్తీ చేయలేవని అంటున్నారు.

# సమానత్వం కోసం సందేశం

**అమెరికాలో లింగవివక్షను రూపుమాపేందుకు ఓ విమానయాన సంస్థ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 120 మంది మహిళలతో కలిసి వినూత్న ప్రయత్నం చేసింది. లింగసమానత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు బలమయిన సందేశం ఇచ్చింది.**



మహిళలకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల కొందరు వంటింటికే పరిమితమవుతున్నారు. మరికొంతమంది అరుదైన రంగాల్లో తమదైన ముద్ర వేస్తూ పురుషులకు ధీటుగా రాణిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని దేశాల్లో స్త్రీలంటే చులకన భావం ఉన్నది. దానిని పోగొట్టేందుకు అమెరికాకు చెందిన డెల్టా ఎయిర్‌లైన్స్ సంస్థ ముందుకు వచ్చింది. 120 మంది మహిళలతో వినూత్న సందేశం ఇచ్చింది. సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేసే మహిళా సిబ్బందితోపాటు 12 ఏండ్ల నుంచి 18 ఏండ్ల బాలికలు కూడా వీరిలో ఉన్నారు. వాళ్లందరూ సాల్ట్ లేక్ సిటీ నుంచి హ్యూస్టన్ నగరం వరకు విమానంలో ప్రయాణించారు. అక్కడినుంచి నాసా ప్రధాన కార్యాలయానికి చేరుకుని మహిళా శాస్త్రవేత్తలను కలుసుకున్నారు. వారితో లింగసమానత్వంపై చర్చించారు. ఐదేండ్లుగా డెల్టా ఎయిర్‌లైన్స్ సంస్థ లింగ వివక్షపై పోరాటం చేస్తున్నది. మరోపక్క మహిళా సిబ్బందికి ప్రాధాన్యం ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నది. అందులో భాగంగా ప్రతి ఏటా 'విమెన్ ఇన్స్పైరింగ్ అవర్ నెక్స్ట్ జనరేషన్'(వింగ్) పేరుతో ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నది. 'ఆడపిల్లలకు చిన్నప్పటి నుంచే లింగవివక్ష గురించి వివరించాలి. పురుషులు, స్త్రీలు అనే అసమానతలను వారి మనసుల్లో నుంచి తీసివేయాలి' అని డెల్టా ఎయిర్‌లైన్స్ పైలెట్ డెవలప్‌మెంట్ మేనేజర్ బెత్ పూలే చెబుతున్నారు. అలా చేసినప్పుడే మరింతమంది మహిళలు ముందుకు వస్తారని అంటున్నారు.

# నూడుల్స్ తినిపిస్తున్నారా?

**పిల్లలు జంక్‌ఫుడ్‌కు త్వరగా అలవాటు పడతారు. ముఖ్యంగా నూడుల్స్ తినడానికి బాగా ఇష్టపడుతారు. నూడుల్స్ వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని ఓ సర్వేలో వెల్లడైంది.**



ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్ ఆర్థికంగా ఎదుగుతున్నాయి. కానీ ఆరోగ్యం విషయంలో మాత్రం వెనుకబడుతున్నాయి. ఆహార నాణ్యతా లోపంతో వారి ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఐదేండ్లలోపు పిల్లలు 40 శాతానికి పైగా అజీర్తితో బాధపడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల కడుపు నింపాలని రోజూ నూడుల్స్ తినిపిస్తున్నారు. కానీ పోషకాల గురించి పట్టించుకోవడం లేదు. ఈ విషయాలన్నీ ఇండోనేషియాలోని హస్బుల్లా థాబ్రనీ అనే ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. యూనిసెఫ్ సభ్యులు ఈ విషయమై స్పందించారు.ఈ ఆహార పద్ధతి కొనసాగితే భవిష్యత్‌లో సమస్యలు తప్పవన్నారు. ఐరన్ లోపం పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుందన్నారు. ప్రసవం తర్వాత మహిళలు ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. కాబట్టి న్యూడిల్స్‌కు దూరంగా ఉండడమే మంచిది.



## నానక్‌రాంగూడలో 50 అంతస్తుల నిర్మాణం

'భాగ్యనగరంలోనే ప్రప్రథమంగా.. 50 అంతస్తుల రెసిడెన్షియల్ ప్రాజెక్టును.. నానక్‌రాంగూడలోని వేవ్‌రాక్ పక్కనే.. దాదాపు ఐదు ఎకరాల్లో చేపడుతున్నాం. ఇందులో సుమారు 18.50 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఫైర్ ఎన్వోసీ వచ్చేసింది. మొత్తం వచ్చే ఫ్లాట్ల సంఖ్య.. దాదాపు తొమ్మిది వందలు. స్థానిక సంస్థ నుంచి తుది అనుమతి రాగానే ప్రాజెక్టును ప్రారంభించడానికి ప్రణాళికలు రచిస్తున్నాం. ఇది హైదరాబాద్‌లోనే అతి ఎత్తయిన రెసిడెన్షియల్ ప్రాజెక్టుగా చరిత్రలో నిలిచిపోతుంది. నగర నిర్మాణ రంగంలోనే ల్యాండ్‌మార్క్ ప్రాజెక్టుకు ఖ్యాతినార్జించే విధంగా వివిధ విభాగాలకు చెందిన డిజైనింగ్ నిపుణులు పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ 50 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని డెవలప్ చేశాం. బెంగళూరులో 40 లక్షల చ.అడుగుల్లో ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. మరో 40 లక్షల చదరపు అడుగుల్లో కొత్త ప్రాజెక్టుల్ని ప్లాన్ చేస్తున్నాం'.

## నిర్మాణ సంఘాలు హ్యాపీస్..

అనుమతుల్ని 21 రోజుల్లో అందించడంలో భాగంగా టీఎస్ 'బి'పాస్ విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని క్రెడాయ్ తెలంగాణ బృందం గురువారం మంత్రి కేటీఆర్‌ని మాసబ్ ట్యాంకులోని పురపాలక భవనంలో ప్రత్యేకంగా కలిశారు. డిసెంబరులో జరగనున్న క్రియేట్ అవార్డులకు రావాల్సిందిగా కేటీఆర్‌ని ఆహ్వానించారు.



క్రెడాయ్ తెలంగాణ ఛాప్టర్ల సంఖ్య, ఇజ్రాయేల్‌లో నిర్వహించిన క్రెడాయ్ న్యాట్‌కాన్, వరంగల్ మాస్టర్ ప్లాన్ వంటి అంశాల గురించి ప్రత్యేకంగా మంత్రికి వివరించామని గుమ్మి రాంరెడ్డి చెప్పారు. అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికల్ని రచిస్తుందని తెలిపారు. పరిశ్రమలకు పదిహేను రోజుల్లో అనుమతుల్ని మంజూరు చేసే విధంగానే ఆన్‌లైన్‌లో ఇండ్ల భవనాలు, అపార్టుమెంట్లకు 21 రోజుల్లో పర్మిషన్ ఇస్తుందన్నారు. ఎవరైనా అపార్టుమెంట్ కోసం దరఖాస్తు చేసుకోగానే.. వారం రోజుల్లోనే వారికి షార్ట్‌ఫాల్ నోటీసులు అందేవిధంగా కొత్త విధానం ఉంటుందని మంత్రి తెలిపారని అన్నారు. తెలంగాణ డెవలపర్లంతా క్రమశిక్షణగా వ్యవహరించాలని, నిబంధనల్ని అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలియజేశారని వివరించారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి గల ప్రణాళికల్ని కేటీఆర్ ప్రత్యేకంగా తమతో పంచుకున్నారని, ఆయన విజన్‌ని చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందేనని తెలిపారు. నగరానికి చెందిన నిర్మాణ సంస్థలన్నీ కలిసి రాష్ట్రంలో సీఎస్ఆర్ కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని మంత్రి సూచించారని చెప్పారు. మొత్తానికి, మంత్రిని కలిసిన తర్వాత హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధుల బృందంలో సరికొత్త జోష్ నెలకొన్నదన్నారు. సమావేశం ఎంతో పాజిటివ్‌గా జరిగిందని గుమ్మి రాంరెడ్డి వివరించారు. వరంగల్‌లో శనివారం, ఆదివారం వరంగల్లో జరిగే ప్రాపర్టీ షో కు సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొని, వారికి కావాల్సిన ఫ్లాటు లేదా ప్లాటు బుక్ చేసుకోవాలని సూచించారు. సొంతింటి ఎంపికకు ఇదే సరైన సమయమనారు.

# బెంగళూరు కంటే హైదరాబాద్ బెటర్

బెంగళూరుతో పోల్చితే ప్రస్తుతం హైదరాబాద్ రియల్ రంగం గణనీయంగా అభివృద్ధి సాధిస్తుందని.. ఇక్కడి మార్కెట్ ఏటా ఇరవై నుంచి ఇరవై ఐదు శాతం వృద్ధి చెందుతుందని.. సుమధుర ప్రాజెక్ట్స్ చైర్మన్ జి.మధుసూదన్ తెలిపారు. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని చేతుల మీదుగా ప్రప్రథమంగా కొండాపూర్‌లో సుమధుర హారిజాన్ ప్రాజెక్టును ప్రారంభించిన సందర్భంగా ఆయన 'సంపద'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. కుటుంబ సభ్యులందరూ కలిసి హాయిగా గడిపేలా హారిజాన్‌ను ఆధునిక రీతిలో ప్రత్యేకంగా డిజైన్ చేశామని తెలిపారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

### సుమధుర ప్రాజెక్ట్స్ చైర్మన్ జి.మధుసూదన్



"1995 నుంచి 2004 వరకూ హైదరాబాద్‌లో 30 అపార్టుమెంట్లను నిర్మించాం. ఆతర్వాత బెంగళూరుకు వెళ్లి 17 ప్రాజెక్టుల్ని విజయవంతంగా పూర్తి చేశాం. ప్రస్తుతం అక్కడే చేపడుతున్న నాలుగు నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మరో ఐదు నిర్మాణాల్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత.. ఇక్కడి ముఖ్యమంత్రి తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలకు ఆకర్షితుడినై.. 2015లో హైదరాబాద్‌లోకి రంగప్రవేశం చేశాం. 2015లో నానక్‌రాంగూడలో స్థలం కొనుగోలు చేసి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రాజెక్టును కట్టాం. ప్రస్తుతం కొండాపూర్‌లో 9.5 లక్షల చదరపు అడుగుల్లో హారిజాన్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నాం.

● సాధారణంగా బెంగళూరులో రియల్ రంగం ఏటా ఆరు నుంచి పన్నెండు శాతం వృద్ధి కనిపిస్తుంది. కానీ, హైదరాబాద్ ఇందుకు పూర్తిగా భిన్నమని చెప్పొచ్చు. ఎందుకంటే, 2016లో నానక్‌రాంగూడలో ప్రాజెక్టును ప్రారంభించే నాటికి అమ్మకపు ధర చదరపు అడుక్కీ రూ.4,200 ఉండేది. ప్రస్తుతం అది రూ.6,000కు చేరుకున్నది. అంటే, కేవలం మూడేండ్లలోనే ఇంత వృద్ధి సాక్షాత్కరించింది. కొండాపూర్‌లో హారిజాన్ ప్రాజెక్టును తొలుత చదరపు అడుక్కీ రూ. 5,500 చొప్పున విక్రయించడం ప్రారంభించాం. ప్రస్తుతం అది రూ.5,999కి చేరింది. మా ఈ ప్రాజెక్టు పక్కనే ఓ సంస్థ ప్రారంభిస్తున్న కొత్త ప్రాజెక్టులో చదరపు అడుక్కీ రూ.8,000 చొప్పున విక్రయించనున్నదని తెలిసింది. మా హారిజాన్‌ను మూడేండ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం కాబట్టి, ఇది పూర్తయ్యే నాటికి కొనుగోలుదారులకు మంచి అప్రిసియేషన్ లభిస్తుందనే విషయంలో ఎలాంటి ఢోకా ఉండదన్న ధీమాతో ఉన్నాం. మా ఈ ప్రాజెక్టుకు బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ధనాధన్ మహేంద్ర సింగ్ ధోని వ్యవహరిస్తున్నారు. ఆయన మాతో జత కలవడంతో సుమధురకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఫలితంగా, బాధ్యతతో ముందుకెళుతున్నాం."



### 150 ఫ్లాట్లను అమ్మేశాం..

కొండాపూర్‌లో దాదాపు ఐదు ఎకరాల సువిశాల విస్తీర్ణంలో జి+18 అంతస్తుల ఎత్తులో సుమధుర హారిజాన్‌కు శ్రీకారం చుట్టాం. లగ్జరీ తరహా జీవనాన్ని కోరుకునేవారికి ఈ ప్రాజెక్టు చక్కగా నప్పే విధంగా నాలుగు టవర్లను డిజైన్ చేశాం. ఇందులో నివసించేవారికి జీవనమెంతో సాఫీగా సాగేందుకు 2, 3 పడక గదుల ఫ్లాట్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. నిర్మాణం వచ్చేది కేవలం 28 శాతం స్థలంలోనే. క్లబ్‌హౌజును అత్యాధునికంగా డిజైన్ చేశాం. ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. మూడేండ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. మేం ఊహించిన దానికంటే మా ప్రాజెక్టుకు మంచి రెస్పాన్స్ వస్తుంది. హారిజాన్‌ను ప్రకటించామో లేదో 150 ఫ్లాట్లను విక్రయించాం. మా ప్రత్యేకత ఏమిటంటే.. ఈ ప్రాజెక్టుకు ఏయే ప్రభుత్వ సంస్థల నుంచి అవసరమయ్యే అనుమతులు ఎప్పుడెప్పుడు వచ్చాయనే విషయాన్ని బ్రోచర్‌లోనే కొనుగోలుదారులకు తెలియజేస్తాం. ఇంత పారదర్శకంగా ఉంటాం కాబట్టి.. కొనుగోలుదారులు మా పట్ల పూర్తి విశ్వాసంతో ఉంటారు.

– కేవీ రామారావు,
వైస్ చైర్మన్, సుమధుర ప్రాజెక్ట్స్

# అనుమతులకు టీఎస్.. బీపాస్

**నిర్మాణ సంఘాల ప్రతినిధులకు వెల్లడించిన మంత్రి కేటీఆర్**

**నగరానికి అన్ని వైపులా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి**

**'రియల్' సమస్యలపై ప్రభుత్వమెప్పుడూ సానుకూలమే**




సమాజం అభివృద్ధి చెందితేనే రియల్ ఎస్టేట్ రంగమూ అభివృద్ధి చెందుతుందని, అందుకే సమాజాభివృద్ధిలో రియల్ రంగం భాగస్వామ్యం కావాలని రోడ్లు, భవనాశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం రూపొందించే సరైన విధానాల కారణంగానే నగరాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు జరిగే 'ట్రెడా ప్రాపర్టీ షో'ను శుక్రవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంపై, హైదరాబాద్ నగర అభివృద్ధిపై సీఎం కేసీఆర్‌కున్న నిబద్ధతను ఎవరూ ప్రశ్నించలేరని స్పష్టం చేశారు. చేపట్టే ప్రతి పనినీ మూలాల నుంచి పరిశీలించి, అభివృద్ధికి బాటలు వేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. 2014లో మొదటిసారి టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు 2–3 నెలలపాటు అభివృద్ధికి కారణమైన సంపద, దానికి కావాల్సిన వనరులపైనే చర్చించారని పేర్కొన్నారు. రాబడిలో హైదరాబాద్ నగరం కీలకమని, అభివృద్ధిలో వ్యాపార, ట్రేడింగ్, రియల్, పారిశ్రామిక రంగాలే క్రియాశీలకమని గుర్తించారని వివరించారు. ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా దానికి నాణ్యమైన విద్యుత్ అవసరమని గ్రహించిన సీఎం కేసీఆర్, రాష్ట్ర ఏర్పాటైన కొద్ది కాలంలోనే 24 గంటల నాణ్యమైన విద్యుత్ అన్ని రంగాలకు అందించారని స్పష్టం చేశారు. గతంలో ఒక్క షిఫ్టు పని చేసే పరిశ్రమలు, ప్రస్తుతం మూడు షిఫ్టులు పనిచేస్తున్నాయని, దీని ద్వారా ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

● ఏ రంగాల్లోని కార్యకలాపాలైన సజావుగా సాగాలంటే శాంతి భద్రతలెంతో కీలకమని, తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, మత ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉండేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే 143 మంది రౌడీషీటర్లను సీఎం కేసీఆర్ జైలు పెట్టించారని వెల్లడించారు. ప్రస్తుతం నగరంలో ఎలాంటి భూకబ్జాలు, బెదిరింపులూ లేవన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 20–30 ఏండ్లుగా కుదురుకుపోయిన సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేసి అవినీతి నిర్మూలనకు కృషి చేసినట్టు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌వోఆర్ (స్టేట్ ఓన్డ్ రెవెన్యూ) వృద్ధి రేటు 17 శాతం ఉందని, గుజరాత్ మినహా మిగిలిన ఏ రాష్ట్రంలోనూ 11 శాతం ఎస్‌వోఆర్ లేదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ మార్గదర్శనం, పారదర్శక పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్నారు. అంతర్జాతీయంగా పేరెన్నిక గల సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను హైదరాబాద్‌లో ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. జాతీయ సమావేశం పనిమీద ఢిల్లీకి వెళ్లి కేంద్ర రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి సంజీవ్ రంజన్‌ను కలిసినప్పుడు తెలంగాణ పేరు చెప్పగానే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని కితాబిచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**80 శాతం భూసమస్యల్లేవు..**

భారతదేశ జీడీపీ 6 శాతం ఉంటే, సీఎం కేసీఆర్ కృషి కారణంగా తెలంగాణ జీడీపీ 8.46 శాతం ఉండటం గర్వకారణమని అన్నారు. రెవెన్యూ ప్రక్షాళన ద్వారా 80 శాతం భూ సమస్యలు తొలగిపోయాయని, అందులోనే వ్యాపారం చేసుకోవాలని బిల్డర్లు, డెవలపర్లకు సూచించారు. తానూ స్వయంగా డెవలపరేనని, వారి సమస్యలు తనకూ తెలుసన్నారు. రియల్ ఎస్టేట్ రంగం సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముఖంగానే ఉంటుందని స్పష్టం చేశారు. బిల్డర్లు, డెవలపర్లు కూడా సామాజిక దృక్పథంతో ఆలోచించాలని, సామాన్యులకు అందుబాటులో ఇండ్ల ధరలు ఉండేలా కృషి చేయాలని సూచించారు. నగరానికి నలువైపులా రియల్ రంగాన్ని అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ సమస్య తొలగిపోతుందన్నారు. ఐటీ, పరిశ్రమలు వంటి రంగాలను అన్ని వైపులకు విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు రెండున్నరేండ్లలో హైదరాబాద్ చుట్టు పక్కల 65 రిజర్వాయర్లను నిర్మించామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం కావాల్సిన సదుపాయాలన్నీ ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు రియల్ రంగ సమస్యలు పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ ఈ రంగంలో నెలకొన్న సమస్యల్ని ఏకకాంలో పరిష్కరించారని కొనియాడారు. పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రిగా కేటీఆర్ కృషితోనే నగరంలో 45 ఫ్లైఓవర్లు పూర్తి కావస్తున్నాయని గుర్తు చేశారు. రియల్ ఎస్టేట్ రంగానికి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరమయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

● ట్రెడా అధ్యక్షుడు ఆర్.చలపతిరావు మాట్లాడుతూ... హైదరాబాద్ అభివృద్ధి కోసం రియల్ ఎస్టేట్ రంగంలోని అన్ని సంఘాలూ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఇల్లనేది ప్రతిఒక్కరి జీవితంలో భాగమని, గృహ కొనుగోళ్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. రోజు రోజుకూ హైదరాబాద్ నిర్మాణ రంగంలో పెరుగుదల సాధిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనుమతులిచ్చేందుకు టీఎస్ ఐపాస్ విధానాన్ని ఏర్పాటు చేసిన విధంగానే రియల్ ఎస్టేట్ రంగంలో అనుమతులిచ్చేందుకు బీ పాస్ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి కేటీఆర్ ఇటీవల జరిగిన సమావేశంలో తెలియజేశారని చెప్పారు. నగరాన్ని అన్నివైపులా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి లోపమూ లేదని, ప్రణాళికాబద్ధంగానే ముందుకు సాగుతుందన్నారు. రెవెన్యూ ప్రక్షాళనలో భాగంగా 80 శాతం భూములకు క్లియరెన్స్ ఇచ్చినందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నిషేధిత ప్రాంతాల్లో జియో ట్యాగింగ్ ఏర్పాటు చేసి భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్న బిల్డర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెడా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మేకా విజయసాయి, సెక్రటరీ జనరల్ సునీల్ చంద్రారెడ్డి, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇల్లు కట్టుకోవడానికి ఖర్చెంత?

సొంతిల్లు కట్టుకోవాలని చాలామందికి ఉంటుంది. కానీ, ఇల్లు కట్టేందుకు ఏయే నిర్మాణ సామగ్రిని వాడాలో చాలామందికి తెలియదు. దేనికెంత ఖర్చు అవుతుందో అర్థం కాదు. మేస్త్రీనే పూర్తిగా నమ్ముకుని ఇంటి పని మొదలు పెట్టామా.. అంతే సంగతులు. ఖర్చు తడిసిమోపెడు అవుతుంది. చివరికీ లెక్కెంత తేలుతుందో కచ్చితంగా అంచనా వేయలేం. ఇంటి నిర్మాణంలో ఇలాంటి వాస్తవిక ఇబ్బందుల్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే.. ముందుగా నిర్మాణ ఖర్చు ఎంత అవుతుందనే విషయాన్ని తెలుసుకోవాలి. నగరంలో అయినా శివారు ప్రాంతాలైనా.. అధిక శాతం మంది 100 నుంచి 200 గజాల్లోపు స్థలంలో సొంతింటిని కట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. మరి, వీరంతా సొంత తెలివి లేదా మేస్త్రీ మీద ఆధారపడకుండా ఉండాలంటే, ముందుగా దేనికెంత ఖర్చు అవుతుందో తెలుసుకోవాలి. మరి, పునాదుల స్థాయి నుంచి గృహప్రవేశం అయ్యేంత దాకా ఇంటి నిర్మాణానికి ఖర్చెంత అవుతుందంటే..

| | |
|---|---|
| ఇటుకలు: | నాణ్యమైన రకం రూ. 89 (9 అంగుళాలవి) |
| సిమెంటు: | నాణ్యమైన సిమెంటు: బస్తాకు రూ.360 |
| స్టీలు: | నాణ్యమైన రకం– టన్నుకు రూ.50 వేలు |
| ఇసుక: | రోబో రకం, లోడు రూ.900 |
| కిటికీలు: | మొదటిరకం: చదరపు అడుక్కీ రూ.500 |
| తలుపులు: | హై డెన్సిటీ వుడ్, రూ.15,000 ఒక్కోటి |
| ఫ్లోరింగ్: | రూ.300 (చదరపు అడుక్కీ) |
| పేయింటింగ్: | రూ.20 (చ.అడుక్కీ) |
| ప్లంబింగ్: | ఒక్కో టాయిలెట్‌కి రూ.50,000 |
| ఎలక్ట్రికల్: | చదరపు అడుక్కీ రూ.150 |

సుమారుగా 1,000 చ.అ. ఇంటికి చ.అ.కీ. రూ.1250 నుంచి రూ.1500 దాకా ఖర్చు అవుతుంది. స్థానికంగా లభించే సామగ్రి ఆధారంగా తుది ధరలో కొంత తేడా రావొచ్చు.

–వి. సురేష్ కుమార్, ఆర్కిటెక్ట్, వైద్ ఆర్కిటెక్ట్స్

## 800 కోట్ల విలువైన ఇండ్లు వేలం

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రూ.800 కోట్ల విలువైన ప్రాజెక్టులను వేలం వేయడానికి రంగం సిద్ధం చేసింది. ఇందులో హైదరాబాద్‌కు సంబంధించిన ఆస్తులూ ఉన్నాయి. అక్టోబరు 21, 30 తేదీల్లో రెండు విడతల్లో ఈ–వేలంను నిర్వహిస్తున్నట్లు బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.స్వామినాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు గణనీయంగా పుంజుకున్నాయని పేర్కొనారు. డిజిటల్ పరిజ్ఞానం రాకతో ఆస్తుల కొనుగోలు ప్రక్రియ సులభతరమైందని అన్నారు. అందుకే, మ్యాజిక్ బ్రిక్స్‌తో అవగాహన కుదుర్చుకుని దేశవ్యాప్తంగా ఇండ్లను ఆన్‌లైన్‌లో వేలం వేస్తున్నామని తెలిపారు.



**జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, రెరా పరిధిలో మీకు ఎలాంటి సమస్యలున్నా.. హోమ్‌లోన్స్, లీగల్, రిజిస్ట్రేషన్స్, ట్యాక్సేషన్ వంటి అంశాల్లో మీకు ఎలాంటి సందేహాలున్నా మాకు రాయండి. మా నిపుణులు మీకు సమాధానాలిస్తారు. మీరు ప్రశ్నలు పంపాల్సిన మా చిరునామా..**

**నమస్తే సంపద**
8-2-3/7/8/9, క్రిష్ణాపురం. రోడ్ నెం.10,
నమస్తే తెలంగాణ, మొదటి అంతస్తు,
బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
nt.sampada@gmail.com

## క్రెడాయ్ వరంగల్ ప్రాపర్టీ షో..

**నేడు, రేపు..**
**వేదిక: నందనా గార్డెన్స్, నక్కలగుట్ట**

CREDAI WARANGAL PROPERTY SHOW

హైదరాబాద్ తర్వాత వరంగలే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్నది. భాగ్యనగరం నుంచి కేవలం 150 కిలో మీటర్ల దూరంలో ఉండటం.. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం వల్ల ఐటీ రంగమూ గణనీయంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే వరంగల్ ఎడ్యుకేషన్ హబ్ అనే విషయం అందరికీ తెలిసిందే. వరంగల్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో.. రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సైతం రూపొందిస్తున్నది. ఇలాంటి అనేక సానుకూలాంశాల్ని దృష్టిలో పెట్టుకుని.. అభివృద్ధి చెందుతున్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని.. నేడు, రేపు ప్రాపర్టీ షోను క్రెడాయ్ వరంగల్ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, ఈటెల రాజేందర్ తదితరులు హాజరు కానున్నారు.

వరంగల్‌లో పేరెన్నిక గల గృహసముదాయాలు, విల్లాలు, వ్యక్తిగత గృహాలకు సంబంధించిన సమాచారాన్ని కొనుగోలుదారులకు ఈ షో ద్వారా అందజేస్తామని క్రెడాయ్ తెలంగాణ కార్యదర్శి ప్రేమ్ సాగర్ రెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో స్థిర నివాసానికి చాలామంది ఆసక్తి చూపిస్తున్నారని, కానీ పలు ప్రాంతాల్లో ప్లాట్లు, ఫ్లాట్ల రేట్లెలా ఉన్నాయో చాలామందికి తెలియదని, ఈ ప్రాపర్టీ షోకు విచ్చేస్తే.. అన్ని రకాల ప్రాపర్టీ ధరలు సులువుగా తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాపర్టీ షోలో దాదాపు 75 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

hmda Approved Open Plots
@ Bhongiri
Gated Community
100ft Road Facing Project
½ km from NH 6 Track Road
Buy Back Policy..,
Double Appreciation in 3yrs.
Bank Loans Available
Ready for Construction
8247640538

hmda VILLA PLOTS
@ PATANCHERU
2 Min Drive from ORR
5 Min from Patancheru Busstop
Plot Sizes : 150,167,180,200
KEYSTONE DEVELOPERS
8688021020
8688023402

# మసీదులో బాంబు పేలుడు

**28 మంది దుర్మరణం, 55 మందికి తీవ్రగాయాలు**

**ఆఫ్ఘనిస్థాన్‌లో ఘటన**

**కాబూల్, అక్టోబర్ 17:** 'ఆఫ్ఘనిస్థాన్‌లో ఆమోదయోగ్యం కాని స్థాయికి హింస చేరుకున్నది' అని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసిన మరుసటిరోజే శుక్రవారం భారీ బాంబు పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో దాదాపు 28 మంది దుర్మరణం పాలవగా, మరో 55 మంది తీవ్రంగా గాయపడినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఆఫ్ఘనిస్థాన్ తూర్పు నంగర్‌హార్ రాష్ట్రంలోని హస్కా మినా జిల్లా కేంద్రంలోని మసీదులో శుక్రవారం ప్రార్థనల సమయంలో ఈ ఘటన జరిగింది. అందరూ ప్రార్థనల్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో బాంబు పేలింది. ఈ పేలుడులో 28 మంది చనిపోగా, మరో 55 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి మసీదు పైకప్పు కూలిపడిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. బాంబు పేలుడుకు తమదే బాధ్యత అని ఇంతవరకు ఎవరూ ప్రకటించలేదు. నంగర్‌హార్ రాష్ట్రంలో తాలిబన్, ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఉగ్రవాద సంస్థలు హింసాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఆఫ్ఘనిస్థాన్‌లో ఎంతో మంది పౌరులు దుర్మరణం పాలయ్యారని, మరెంతో మంది గాయపడి దుర్భర జీవితాలను గడుపుతున్నారని తన తాజా నివేదికలో ఐక్యరాజ్యసమితి విచారం వ్యక్తంచేసింది.



**రాష్ట్ర గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడిగా నియామకమైన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండకు చెందిన అజయ్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిశారు. అజయ్‌కు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందనలు తెలిపారు.**
**- హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

# బీటీపీఎస్‌లో నేడు బాయిలర్ లైటప్

**యూనిట్-2లో హైడ్రోటెస్ట్ విజయవంతం**

**మణుగూరు, నమస్తేతెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, పినపాక మండలాల సరిహద్దులలో నిర్మిస్తున్న 1080(270X4) మెగావాట్ల సామర్థ్యం గల భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్) యూనిట్-2లో శుక్రవారం నిర్వహించిన హైడ్రోటెస్ట్ విజయవంతమైంది. ఇంజినీర్లు, అధికారులు యూనిట్-2లో డీమినరల్ వాటర్ (ప్రత్యేక నీరు)తో హైడ్రో టెస్ట్ నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఎన్ శ్రీనివాసరావు సమక్షంలో జెన్కో డైరెక్టర్ (ప్రాజెక్టు) ఎం సచ్చిదానందం పర్యవేక్షణలో నిర్వహించారు. హైడ్రో టెస్ట్ ఫలితం 274 కేజీ ఫర్ సెంటీమీటర్ స్క్వేర్ (274kg/cm2) గా నమోదైనట్లు బీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పిల్లి బాలరాజు తెలిపారు. యూనిట్-2లో హైడ్రోటెస్ట్ విజయవంతంగా నిర్వహించినందుకు జెన్కో, భెల్ అధికారులకు ప్రత్యేక అభినందనలు ఆయన తెలిపారు. శనివారం యూనిట్-2లో బాయిలర్ లైటప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పేర్కొన్నారు. సీఈ వెంట భెల్ జీఎం అగర్వాల్, ఎస్ఈ మహేందర్‌రావు, జెన్కో, భెల్ అధికారులు తదితరులు ఉన్నారు.



# మిత్ర దేశాలకు తోడుగా మన సైన్యం

- ప్రపంచ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉన్నాం!
- సవాళ్లను ఎదుర్కోవడానికి అండగా ఉంటాం
- రక్షణ శాఖాధిపతి బిపిన్ రావత్ వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** పొరుగుదేశాలతో పాటు అన్ని దేశాల్లో శాంతి, స్థిరత్వానికి భారత్ కట్టుబడి ఉన్నదని ఆర్మీ అధిపతి జనరల్ బిపిన్ రావత్ పేర్కొన్నారు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి మిత్ర దేశాలకు భారత ఆర్మీ తోడుగా ఉంటుందని ఆయన తెలిపారు. రక్షణ శాఖకు సంబంధించి ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'ప్రపంచంలో ఉన్న ప్రముఖ సాయుధ దళాల్లో మనం ఒకరం. వాసి పరంగానే కాకుండా పోరాట అనుభవం, నిబద్ధతలో మనం మేటిగా ఉన్నాం. పొరుగుదేశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి, స్థిరత్వం కోసం కట్టుబడి ఉన్నాం. ఇదివరకు లాగే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి మన మిత్ర దేశాలకు అండగా ఉంటాం' అని పేర్కొన్నారు. సాయుధ దళాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు రక్షణ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. సాయుధ దళాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు చూపాలని రక్షణ రంగంలోని సంస్థలకు రావత్ సూచించారు. దేశంలో శాంతి, స్థిరత్వం కోసం సాయుధ దళాల్ని నియమించుకుంటామని, అయితే, వాటిని నెలకొల్పడానికి సదరు దళాలు సునిశిత శిక్షణ పొంది ఉండాలన్నారు. దీంతో పాటు తగిన ఆయుధాలు, సామాగ్రి వాళ్లకు కావాలని రావత్ గుర్తు చేశారు. మిత్ర దేశాల రక్షణ అవసరాలను తీర్చడానికి భారత్ సిద్ధంగా ఉన్నదని తెలిపారు. 'కేవలం మన దళాల కోసమే మనం ఆయుధాలను తయారు చేయడం లేదు. ఆ స్థాయిని దాటి.. నైపుణ్యంతో కూడిన ఆయుధ ఉత్పత్తి పరిశ్రమగా మనం ఆవిర్భవిస్తున్నాం' అని ఆయన తెలిపారు. 'ప్రస్తుతం రక్షణశాఖ ఎగుమతులు రూ. 11,000 కోట్లుగా ఉన్నాయి. 2024 నాటికి ఈ ఎగుమతులు రూ. 35,000కోట్లు చేరుకుంటాయని అంచనా వేస్తున్నాం' అన్నారు. భారత రక్షణ శాఖ కోసం ''రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ'' (డీఆర్డీఓ), ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ప్రైవేట్ సంస్థలు పనిచేస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 2020లో రక్షణ శాఖకు సంబంధించి మరో ప్రదర్శన ఉండబోతున్నట్టు ఈ సందర్భంగా రావత్ ప్రకటించారు. నావికాదళాధిపతి అడ్మిరల్ కరంబీర్ సింగ్ మాట్లాడుతూ.. సముద్ర భద్రత సవాలుతో కూడుకున్నదని తెలిపారు. హిందూ మహా సముద్రంలో భద్రత కోసం సభ్యదేశాలతో కలిసి పనిచేస్తామని చెబుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన 5ఎస్ సూత్రాన్ని (సమ్మాన్(గౌరవం), సంవాద్(చర్చలు), సహయోగ్(సహకారం), శాంతి, సమృద్ధి) ఈ సందర్భంగా ప్రస్తావించారు. రక్షణ శాఖ సామర్థ్యాన్ని ప్రదర్శించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం వివిధ సంస్థలు తయారు చేసిన నమూనాలను రావత్, సింగ్ పరిశీలించారు.

# పాక్‌కు వంతపాడుతున్న కాంగ్రెస్

**ఆర్టికల్ 370 రద్దుపై ఆ పార్టీ విమర్శలు పాక్‌కు ఉపయోగపడుతున్నాయి**

**ఈ విమర్శలతో పొరుగుదేశం అంతర్జాతీయ మద్దతుకు ప్రయత్నిస్తున్నది**

**హర్యానా ఎన్నికల సభల్లో ప్రధాని మోదీ ధ్వజం**




**గొహానా/హిస్సార్, అక్టోబర్ 18:** మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల దాడిని పెంచారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడంపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు పాకిస్థాన్‌కు ఉపయోగపడుతున్నాయని, దీనిబట్టి కాంగ్రెస్ పరోక్షంగా పొరుగుదేశానికి సహాయపడుతున్నట్లు అర్థమవుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ప్రకటనలను ఆధారంగా చేసుకుంటున్న పాక్.. భారత్‌పై విమర్శలకు దిగుతున్నదని తెలిపారు. ప్రజల మనోభావాలు, అమర జవాన్ల త్యాగాలు ఆ పార్టీకి పట్టవని విమర్శించారు. శుక్రవారం హర్యానాలోని గొహానా, హిస్సార్‌లలో నిర్వహించిన ఎన్నికల సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'ఆర్టికల్ 370 రద్దు గురించి కాంగ్రెస్ నాయకులు ఎలాంటి ప్రకటనలు చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసు. వారి ప్రకటనలు ఎవరికి ఉపయోగపడుతున్నాయో అన్న విషయం కూడా తెలుసు. అలాంటి ప్రకటనలతో ఎవరు లబ్ధిపొందుతున్నారో కూడా ప్రజలకు తెలుసు. ఇక్కడ ఉన్న మీకు కూడా అన్ని విషయాలు తెలుసు కదా?' అని మోదీ ప్రశ్నించారు. దీంతో సభకు హాజరైన వాళ్లు 'పాకిస్థాన్' అనే గట్టిగా అరిచారు. వెంటనే స్పందించిన మోదీ అవును.. మీరు నిజం చెప్పారని పేర్కొన్నారు. తనపై విమర్శలు కురిపించడానికి కాంగ్రెస్ నాయకులు ఇలాంటి (ఆర్టికల్ 370 రద్దు గురించి) తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, కానీ పాకిస్థాన్ ఈ ప్రకటనలను ఆధారంగా చేసుకొని అంతర్జాతీయంగా మద్దతు కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు.



**హర్యానాలోని హిస్సార్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ**

**ఆగస్టు 5 నుంచి ప్రతిపక్షాలకు కడుపు నొప్పి**

'జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలా? వద్దా? రాజకీయాలకంటే జాతీయ ప్రయోజనాలు ముఖ్యమా? కాదా? కానీ ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి అర్థంకావడం లేదు' అని మోదీ పేర్కొన్నారు. 'ఆగస్టు 5న ఏం జరిగిందో అందరికీ తెలుసు. అసలు కేంద్రం ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందని ఎవరూ ఊహించి ఉండరు. కశ్మీర్ అభివృద్ధికి 70 ఏండ్లుగా అడ్డుపడిన ఆర్టికల్ 370ని ఆగస్టు 5న రద్దు చేశాం. దీంతో మన రాజ్యాంగం పరిధిలోకి జమ్ముకశ్మీర్ కూడా వచ్చింది' అని మోదీ తెలిపారు. కానీ ఎప్పుడైతే తాము ఆర్టికల్ 370ని రద్దు చేశామో అప్పటి నుంచి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు కడుపు నొప్పి కలుగుతున్నదని, ఈ నొప్పిని తగ్గించడానికి ఔషధాలు కూడా లేవని ఎద్దేవా చేశారు. 'సర్జికల్ స్ట్రైక్, స్వచ్ఛ భారత్ గురించి మేము మాట్లాడినా కాంగ్రెస్‌కు కడుపు నొప్పి వస్తుంది. ఎవరైనా బాలాకోట్ పేరు ఎత్తగానే ఆ పార్టీకి కడుపు నొప్పి మరింత పెరుగుతుంది' అని విమర్శించారు. హర్యానాలో తాము ఓడిపోతామని కాంగ్రెస్ ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ఇక జన్‌నాయక్ జనతా పార్టీ అధ్యక్షుడు దుశ్యంత్ చౌతాలాను ఇప్పటికే ప్రజలు తిరస్కరించారని మోదీ పేర్కొన్నారు.

# గిరిజనుల కోసం మీ కుటుంబం ఏం చేసింది?

**కాంగ్రెస్ నేత రాహుల్‌ను నిలదీసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా**



**గడ్చిరోలి, అక్టోబర్ 18:** 'మీ కుటుంబానికి చెందిన నాలుగుతరాలు 70 ఏండ్లపాటు దేశాన్ని పాలించి గిరిజనులకు ఏం చేశాయి' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ప్రశ్నించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప ఆదివాసీల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదని మండిపడ్డారు. శుక్రవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో గతంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్, ఎన్సీపీ ప్రభుత్వాల కంటే ప్రస్తుతం పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వాలు ఆదివాసీల కోసం అధికమొత్తంలో నిధులు కేటాయించాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 370ని రద్దుచేయకపోవడం వల్ల దేశంలో ఉగ్రవాదం వ్యాప్తిచెందిందని, తద్వారా జమ్ముకశ్మీర్‌లో 40 వేల మంది మరణించారని అన్నారు. ఏడు దశాబ్దాలుగా ఆ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడటమే ఇందుకు కారణమని విమర్శించారు. కానీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆర్టికల్ 370ని రద్దుచేశారని చెప్పారు. 'మీ కుటుంబానికి చెందిన నాలుగు తరాలు దేశాన్ని 70 ఏండ్లపాటు పాలించాయి. ఆదివాసీల కోసం ఏం చేశాయని రాహుల్‌గాంధీని అడుగుతున్నా. మీరు మోదీకి ఐదేండ్లు ఇచ్చారు. ఈ స్వల్ప కాలంలోనే ఆదివాసీల కోసం అనేక పనులు చేపట్టి పూర్తిచేశాం' అని అమిత్‌షా పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పనులు చేపట్టామని, ఇందుకు సంబంధించిన జాబితాను సభలో ప్రజలకు వివరించారు. ఒక్క గడ్చిరోలి ప్రాంతంలోనే 1.30 లక్షల మరుగుదొడ్లు నిర్మించామని, 48 వేల గ్యాస్ సిలిండర్లు అందజేశామని, 48 వేల గృహాలకు విద్యుత్ వసతి కల్పించడంతోపాటు ఎనిమిది వేల పేద గిరిజన కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇచ్చినట్టు తెలిపారు. మహారాష్ట్ర, విదర్భ, అహేరి ప్రజల కోసం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారో వెల్లడించాలని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్, రాహుల్‌గాంధీలను షా ప్రశ్నించారు. గతంలోని కాంగ్రెస్, ఎన్సీపీ ప్రభుత్వాలు 13వ ఆర్థికసంఘం కింద మహారాష్ట్రకు రూ.1.15 లక్షల కోట్లు కేటాయిస్తే.. 14వ ఆర్థికసంఘం ద్వారా మోదీ ప్రభుత్వం రూ.4.38 లక్షల కోట్లు విడుదలచేసినట్టు వివరించారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం విద్యుత్, రహదారులు, రైల్వే, ఇతర సదుపాయాలు కల్పించాలని భావిస్తున్నదని, కానీ, నక్సల్స్ అవి పూర్తికాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు.

# ఆర్థిక వ్యవస్థపై మోదీకి అవగాహన లేదు

**హర్యానా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శలు**



**మహేంద్రగఢ్, అక్టోబర్ 18:** ప్రధాని నరేంద్రమోదీకి ఆర్థిక వ్యవస్థపై అవగాహన లేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న విభజన రాజకీయాల వల్ల ప్రజలు ఒకరినొకరు వ్యతిరేకించే పరిస్థితులు నెలకొన్నాయని, దీని కారణంగా ప్రపంచం మొత్తం దేశాన్ని అపహాస్యం చేస్తున్నదని అన్నారు. శుక్రవారం హర్యానాలో జరిగిన ఎన్నిక ప్రచారంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ.. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని విమర్శించారు. నోట్ల రద్దు, గబ్బర్‌సింగ్ ట్యాక్స్(జీఎస్టీ) వంటివి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నాశనం చేశాయని మండిపడ్డారు. 'దేశాన్ని ప్రపంచం అపహాస్యం చేస్తున్నది. ప్రేమతో జీవించండి, వేగంగా ప్రగతి సాధించండి అని ప్రపంచానికి మార్గనిర్దేశం చేసిన దేశంలో ప్రస్తుతం.. ఒక కులం ఇతర కులాలతో కొట్లాడుతున్నది, ఒక మతం ఇతర మతాలతో పోట్లాడుతున్నది, దేశ గౌరవాన్ని, ఆర్థికవ్యవస్థను మోదీ నాశనం చేశారు' అని రాహుల్ విరుచుకుపడ్డారు. 'మాకు వాస్తవాలు తెలుసని మీడియా అంటున్నది. కానీ వాటిని చూపలేమని, వాస్తవాలు చెప్తే మా ఉద్యోగాలు పోతాయి' అని భయపడుతున్నదని చెప్పారు. 'బీజేపీ ఎక్కడికెళ్తుందో అక్కడ ప్రజలు.. హిందూ, ముస్లిం అని, జాట్- నాన్ జాట్ అని కొట్లాడుతారు. ఈ తరహా విచ్ఛిన్నకర రాజకీయాల వల్ల దేశం అభివృద్ధి సాధించలేదు' అని ఆయన పేర్కొన్నారు.

# హజేలాను బదిలీ చేయండి

**ఆయన ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** అసోం రాష్ట్ర జాతీయ పౌరజాబితా (ఎన్నార్సీ) రాష్ట్ర సమన్వయకర్త ప్రతీక్ హజేలాను సొంతరాష్ట్రం మధ్యప్రదేశ్‌కు వెంటనే బదిలీ చేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం, అసోం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ నేతృత్వంలో జస్టిస్‌లు ఎస్ఏ బోబ్డే, ఆర్ఎఫ్ నారీమన్‌తో కూడిన ప్రత్యేక బెంచ్ హజేలా అంతర్రాష్ట్ర బదిలీకి ఆదేశాలు జారీ చేసింది. అంతేగాకుండా ఆయనను సాధ్యమైనంత ఎక్కువకాలం మధ్యప్రదేశ్‌లోనే కొనసాగించాలని సూచించింది. అయితే ఈ బదిలీకి కారణాలను మాత్రం తెలియజేయలేదు. ఎన్నార్సీ తుదిజాబితాను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. హజేలాను ఇంత హఠాత్తుగా ఎందుకు బదిలీ చేయవలసి వస్తున్నదో తెలుపాలని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కోరగా.. 'కారణం లేకుండా మేము ఎలా ఆదేశాలను జారీ చేస్తాం?' అని సీజేఐ పేర్కొన్నారు. అయినా కారణం మాత్రం చెప్పలేదు. తదుపరి విచారణను నవంబర్ 26కు వాయిదా వేసింది. ఎన్నార్సీ తుదిజాబితాపై కొందరు గుర్రుగా ఉన్న నేపథ్యంలో ప్రతీక్ హజేలాకు ముప్పు పొంచి ఉన్నదన్న సమాచారం మేరకే కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. హజేలా 1995 బ్యాచ్‌లోని అసోం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. అసోంలో ఎన్నార్సీ తుది జాబితాను రూపొందించేందుకు సుప్రీంకోర్టు ఆయనను రాష్ట్ర సమన్వయకర్తగా నియమించింది.

# చిదంబరం బెయిల్‌పై సుప్రీం తీర్పు రిజర్వ్

**మాజీ ఆర్థిక మంత్రి, ఆయన కుమారుడిపై సీబీఐ చార్జిషీట్ దాఖలు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 18:** ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో ఢిల్లీ హైకోర్టు తనకు బెయిల్ నిరాకరించడంపై చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌పై తుది తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం రిజర్వ్‌లో పెట్టింది. ఈ సందర్భంగా చిదంబరంతోపాటు ఆయన కుమారుడు కార్తి చిదంబరం, మరో 13 మంది, కొన్ని సంస్థలపై చార్జిషీట్ దాఖలు చేసినట్టు సీబీఐ.. ధర్మాసనానికి తెలిపింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ చిదంబరానికి బెయిల్ ఇవ్వవద్దని విజ్ఞప్తిచేశారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు నిమిత్తం సింగపూర్, మారిషస్‌లకు పంపిన లెటర్స్ రోగటరీ (ఎల్ఆర్స్) పై స్పందనల కోసం ఎదురుచూస్తున్నట్టు కోర్టుకు విన్నవించారు. చిదంబరం బెయిల్‌పై జైలు నుంచి బయటకొస్తే సాక్షులను బెదిరించే అవకాశం ఉన్నదని, అందువల్ల సాక్షులను విచారించే వరకు బెయిల్ ఇవ్వకూడదని కోర్టును కోరారు. సొలిసిటర్ జనరల్ వాదనలను తప్పుపట్టిన చిదంబరం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ.. చిదంబరం సాక్ష్యాలను దెబ్బతీస్తారని, సాక్షులను ప్రభావితం చేయవచ్చనే సీబీఐ భయాలు తప్పుడివి, నిరాధారమైనవన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో రూ.305 కోట్లు అక్రమంగా మళ్లించారన్న ఆరోపణలపై చిదంబరంపై 2017 మే 15న సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. ఈ కేసులో ఆగస్ట్ 21 నుంచి చిదంబరం తీహార్ జైలులో ఉంటున్నారు. ఇవే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చిదంబరంపై మనీలాండరింగ్ కేసును నమోదు చేసి విచారిస్తున్నది. ప్రస్తుతం ఈడీ కస్టడీలో చిదంబరం ఉన్నారు.

**చిన్మయానంద్ బాధితురాలి..**

# ఎల్ఎల్ఎం ప్రవేశ ప్రక్రియ పూర్తి

**షాజహాన్‌పూర్, అక్టోబర్ 18:** కేంద్ర మాజీ మంత్రి చిన్మయానంద్ చేతిలో లైంగిక దోపిడీకి గురైన న్యాయ విద్యార్థిని శుక్రవారం బరేలీ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ లా (ఎల్ఎల్ఎం) ప్రవేశం కోసం అన్ని లాంఛనాలు పూర్తిచేశారు. 'న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసుభద్రత నడుమ యువతిని తీసుకెళ్లాం. ఉదయం 9 గంటల సమయంలో వర్సిటీలో విద్యార్థిని వివిధ పత్రాలను అందజేశారు. ప్రవేశ ప్రక్రియను పూర్తిచేశారు' అని బరేలీలోని మహాత్మా జ్యోతిబాపూలే రోహిల్‌ఖాండ్ యూనివర్సిటీ న్యాయవిభాగం అధిపతి అమిత్‌సింగ్ తెలిపారు. యువతి తరపున ఆమె సోదరుడు ఇటీవల ఫీజు చెల్లించారని న్యాయకళాశాల ప్రిన్సిపల్ రవి భట్నాగర్ చెప్పారు. విద్యార్థిని ఎల్ఎల్ఎం కోర్సు చేయాలనుకుంటున్నదని చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఓంవీర్ సింగ్‌కు ఆమె తండ్రి తెలుపగా, న్యాయమూర్తి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. లైంగిక దోపిడీ కేసు వాదనలను ఈ నెల 16న చేపట్టిన మెజిస్టీరియల్ కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు, లైంగికదాడి ఆరోపణలను అడ్డంపెట్టుకొని చిన్మయానంద్ నుంచి భారీఎత్తున డబ్బు తీసుకోవటానికి ప్రయత్నించారనే ఆరోపణలతో సెప్టెంబర్ 25న న్యాయ విద్యార్థినిని అరెస్టుచేసిన విషయం తెలిసిందే.

# సిద్దిపేటలో మాంసం శుద్ధి కేంద్రం

**ఇర్కోడులో ఏర్పాటుకు సన్నాహాలు**

**మహిళలతో యూనిట్ నిర్వహణ**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆధునాతన వసతులు, నూతన సాంకేతికతతో కూడిన మాంసం శుద్ధి ప్రక్రియ (మీట్ ప్రాసెసింగ్) యూనిట్‌ను స్థాపించనున్నారు. దీనిని జాతీయ మాంసం పరిశోధనా సంస్థ (ఎన్నార్సీఎం) సహకారంతో సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడులో రూ.2.50 కోట్లతో నిర్మించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకు ఆరెకరాల స్థలం కేటాయింపు ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చింది. మహిళలతోనే ఈ యూనిట్‌ను నడుపాలని నిర్ణయించారు. మాంసం కోసి, శుభ్రంచేసి వాటిని మార్కెట్‌లో విక్రయించేవరకు అన్ని బాధ్యతలు మహిళలే చూసుకోనున్నారు. మాంసం నిర్వహణ, విక్రయాలు మొదలైన అంశాలపై స్వయంసహాయక బృందాలకు చెందిన 20 మంది మహిళలు ఎన్నార్సీఎంలో నాలుగురోజుల శిక్షణ ఇప్పటికే పూర్తిచేసుకున్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌లో తయారుచేసే మాంసంతోపాటు, చికెన్, మటన్ పచ్చళ్లు మొదలైనవాటిని హైదరాబాద్‌కు ఎగుమతి చేయనున్నారు. డిమాండ్‌ను బట్టి మిగిలిన జిల్లాలకూ విస్తరించే వీలున్నది. సుమారు రూ.20 లక్షలతో సిద్దిపేట మార్కెట్‌లో ఒక ఔట్‌లెట్‌తో పాటు, 'మీట్ ఆన్ వీల్స్' పేరుతో ప్రత్యేక వాహనంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో మాంసం విక్రయించేలా ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ యూనిట్ ఏర్పాటుపై ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధచూపిస్తున్నారు. ఈ విషయంపై ఆయన ఇప్పటికే శాస్త్రవేత్తలతో చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గొర్రెల పంపిణీ పథకంతో రాష్ట్రంలో వాటి సంఖ్యతోపాటు మాంసం ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఏడాదికి సగటున రాష్ట్రంలో 26,839 మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి అవుతున్నది. మాంసం ఉత్పత్తిలో 15శాతం వృద్ధి సాధించినట్టు అధికారులు వెల్లడించారు. జాతీయ పోషకాహార సంస్థ మార్గదర్శకాల ప్రకారం.. మాంసాహారుల్లో ప్రతి వ్యక్తి ఏడాదికి 11 కిలోల మాంసం వినియోగించాలి. తెలంగాణలో 7.5 కిలోలు, తమిళనాడు 6.5, కర్ణాటక 6, కేరళ 5.5 కిలోలు చొప్పున మాత్రమే వినియోగిస్తున్నారు. మాంసం అధికంగా వినియోగించే రాష్ట్రాల్లో మొదటి ఐదుస్థానాల్లో దక్షిణాది రాష్ట్రాలే ఉండటం గమనార్హం.



**మున్సిపల్ ట్రాక్టర్‌ను**

# ఢీకొట్టిన లారీ

**ఐదుగురికి గాయాలు**

**మంచిర్యాల టౌన్, నమస్తే తెలంగాణ :** మంచిర్యాలలోని రైల్వేఓవర్ బ్రిడ్జిపై మున్సిపాలిటీ ట్రాక్టర్‌ను శుక్రవారం ఉదయం ఓ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ చిప్పకుర్తి స్వామితోపాటు పారిశుధ్య కార్మికులు అట్కపురం శ్రీనివాస్, కోకిల సది, ఆవునూరి రాజేశం, సీపెల్లి సత్తయ్యకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

# దిగుబడికి తగ్గట్టుగా గోదాములు

- సమన్వయంతో స్టోరేజీ సమస్యలకు పరిష్కారం
- ఎఫ్‌సీఐని కోరిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సభర్వాల్



**శుక్రవారం ఎఫ్‌సీఐ అధికారులతో సమావేశమైన పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సభర్వాల్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడులకు అనుగుణంగా బియ్యం నిల్వలకు అవసరమైన గోదాములను కేటాయించాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సభర్వాల్ ఎఫ్‌సీఐ అధికారులను కోరారు. స్టోరేజీ సమస్యలను ఎలా అధిగమించాలనే అంశంపై ఎఫ్‌సీఐ అధికారులతో శుక్రవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాలభవన్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ అశ్వినీకుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల సంస్థ సమన్వయంతో పనిచేయాలని, జిల్లాలవారీగా సమావేశమై సమస్యలను అధిగమించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అకున్ సభర్వాల్ మాట్లాడుతూ.. ఈ ఏడాది పౌరసరఫరాలసంస్థ వానకాలంలో 55 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 37 లక్షల మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. గత యాసంగికి సంబంధించిన 11 లక్షల మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ బియ్యాన్ని అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని ఇందుకు అవసరమైన నిల్వ సామర్థ్యాన్ని కేటాయించాలని కోరారు. ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన బకాయిలు సీఎమ్మార్ కింద రూ.888 కోట్లు, ఆర్డీ సెస్ కింద రూ.95 కోట్లు తక్షణమే విడుదలచేయాలన్న ఆయన విజ్ఞప్తికి ఎఫ్‌సీఐ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి కరీంనగర్‌తోపాటు కొత్తగూడెం జిల్లాలో అధికంగా ఉన్న స్టోరేజీ సమస్యను పరిష్కరించడానికి ఎఫ్‌సీఐ అధికారులు సుముఖత వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు, బియ్యం నిల్వల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాము చేసే సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఎఫ్‌సీఐ అధికారులు కమిషనర్‌ను కోరారు.

# కవ్వింపు లేకుండా బంగ్లాదేశ్ కాల్పులు

- బీజీబీ వాదన అబద్ధం..
- ఫ్లాగ్ మీటింగ్ కోసమే ఆ దేశ భూభాగంలోకి వెళ్లాం
- బీఎస్ఎఫ్ సీనియర్ అధికారి

**న్యూఢిల్లీ/ కోల్‌కతా, అక్టోబర్ 18:** కవ్వింపు చర్యలు లేకున్నా బంగ్లాదేశ్ సరిహద్దు గార్డులు (బీజీబీ) తమ బృందంపై కాల్పులు జరిపిందని బీఎస్ఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. భారతీయ మత్స్యకారులకు సంబంధించిన వివాదంలో బీజీబీ గురువారం కాల్పులు జరుపటంతో ఒక బీఎస్ఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోగా, మరో జవాన్ గాయపడ్డారు. దీనిపై బీఎస్ఎఫ్ అధికారి శుక్రవారం వివరణ ఇచ్చారు. బీజీబీతో ఫ్లాగ్‌మీటింగ్ వద్ద తమ జవాన్లు ఒక్క బుల్లెట్ ప్రయోగించలేదని తెలిపారు. బీఎస్ఎఫ్ జవాన్లు కాల్పులు జరుపడంతోనే ఎదురుకాల్పులు జరిపామన్న బీజీబీ ప్రకటనను తోసిపుచ్చారు. బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించిన ముగ్గురు భారతీయ మత్స్యకారులను పట్టుకునేందుకు తమ బృందం ప్రయత్నించిందని, ఇద్దరు పారిపోయారని బీజీబీ గురువారం పొద్దుపోయిన తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది. వెంటనే నలుగురు సాయుధ బీఎస్ఎఫ్ జవాన్లు స్పీడ్‌బోటుతో తమ జలాల్లో 650 గజాల మేరకు చొరబడి, తమ ఆధీనంలో ఉన్న మత్స్యకారుడ్ని బలవంతంగా విడిపించే ప్రయత్నం చేశారని ఆరోపించింది. బీఎస్ఎఫ్ జవాన్లు దూకుడుగా వ్యవహరిస్తూ కాల్పులు జరుపుతూ భారత భూభాగంలోకి వెళ్లిపోయారని, ఆత్మరక్షణార్థమే కాల్పులు జరిపామని వివరణ ఇచ్చింది. తమ ఆధీనంలో ఉన్న మత్స్యకారుడిని ఫ్లాగ్ మీటింగ్ తర్వాత అప్పగిస్తామన్నది. బీజీబీ వాదనను బీఎస్ఎఫ్ సీనియర్ అధికారి తిప్పికొట్టారు. ఫ్లాగ్‌మీటింగ్ కోసం ఆరుగురు జవాన్ల బీఎస్ఎఫ్ బృందం.. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలోని పద్మ నది పొడవునా ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల్లోని 400 గజాల వరకు వెళ్లిందని తెలిపారు. ఢిల్లీలో మరో బీఎస్ఎఫ్ సీనియర్ అధికారి స్పందిస్తూ బీజీబీ కస్టడీలోని మత్స్యకారుడిని బలవంతంగా విడిపించేందుకు తమ బలగాలు ప్రయత్నించలేదని, బీజీబీ పిలుపు మేరకే ఫ్లాగ్‌మీటింగ్‌లో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ భూభాగంలోకి వెళ్లారని వివరించారు. ఒక మత్స్యకారుడు వద్ద బందీగా ఉన్నాడన్న బీజీబీ వాదన అబద్ధమని, ముగ్గురున్నారని చెప్పారు. కొద్దిసేపటికి ఫ్లాగ్ మీటింగ్ ఏర్పాటుచేద్దామన్న బీఎస్ఎఫ్ పోస్ట్ కమాండర్ ప్రతిపాదనతో ఇద్దరు మత్స్యకారులను విడిచిపెట్టిందని, ఈ విషయాన్ని మత్స్యకారులే చెప్పారని వివరించారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 19 అక్టోబర్ 2019


కృష్ణభగవాన్, రవివర్మ, శ్రీనివాస్, దేవిశ్రీప్రసాద్, శ్రీనివాసరెడ్డి, రఘు కుంచె

# దేవిశ్రీప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకున్నాం!

'సినిమాలకు ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఏదైనా వేడుకకు మనల్ని అతిథిగా ఆహ్వానించారంటే అది మన అదృష్టంగా భావించాలి. ఆ స్థాయి ఇచ్చినందుకు అందరికి రుణపడి ఉండాలి' అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్. శుక్రవారం హైదరాబాద్‌లో 'రాగల 24గంటల్లో' చిత్ర ప్రమోషనల్ పాటను, టీజర్‌ను ఆయన ఆవిష్కరించారు. సత్యదేవ్, ఈషారెబ్బా, శ్రీరామ్, ముస్కాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాసరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాస్ కానూరు నిర్మాత. ఈ సందర్భంగా దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ ''ఢమరుకం' సినిమా నుంచి దర్శకుడు శ్రీనివాసరెడ్డితో చక్కటి అనుబంధం ఏర్పడింది. మా కుటుంబ మిత్రుడాయన. ఈ ప్రమోషనల్ గీతాన్ని రచయిత శ్రీమణి నేటి ట్రెండ్‌కు అనుగుణంగా రాశారు. రఘు కుంచె మంచి స్వరాన్ని సమకూర్చారు. టీజర్ చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'ఈ పాట రూపకల్పనకు దేవిశ్రీప్రసాద్‌గారే స్ఫూర్తి. ఆయన చేసే ఐటెంసాంగ్స్ సినిమాలకే ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి. ఆయన్ని ఆదర్శంగా తీసుకొని ఈ పాటను తీర్చిదిద్దాం. అతిథిగా ఆహ్వానించి పాటను ఆవిష్కరింపజేశాం' అని దర్శకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. హారర్ థ్రిల్లర్ సినిమా అయినా పెద్దగా భయపెట్టే అంశాలు ఉండవని, కుటుంబ సభ్యులందరూ కలిసి చూడొచ్చని నిర్మాత పేర్కొన్నారు. పూర్తిస్థాయి మాస్‌ఫీల్‌తో ఈ గీతాన్ని స్వరపరిచానని సంగీత దర్శకుడు రఘు కుంచె చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# అనుకోని అతిథి..


సాయిపల్లవి

సాయిపల్లవి కథానాయికగా నటించిన మలయాళ చిత్రం 'అధిరన్' తెలుగులో 'అనుకోని అతిథి' పేరుతో అనువాదమవుతున్నది. ఫహద్‌ఫాసిల్, ప్రకాష్‌రాజ్, అతుల్ కులకర్ణి ప్రధాన పాత్రల్ని పోషించారు. వివేక్ దర్శకుడు. ఈ చిత్రాన్ని జయంత్ ఆర్ట్స్ పతాకంపై అన్నంరెడ్డి కృష్ణకుమార్, గోవింద రవికుమార్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. 1970లో కేరళలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. తెలుగులో ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నవంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అను మోతేదత్, స్క్రీన్‌ప్లే: పి.ఎఫ్.మాథ్యూస్, మాటలు: రాజశేఖర్ రెడ్డి, సంగీతం: జిబ్రాన్.


ప్రియ, రసమయి బాలకిషన్, విజయ్ దేవరకొండ, బిత్తిరి సత్తి

# ఆకాంక్ష నెరవేర్చిన చిత్రమిది!

'బిత్తిరిసత్తితో చాలా కాలంగా పరిచయముంది. బుల్లితెరపై అందరిని ఎంటర్‌టైన్ చేస్తున్న సత్తి ఇప్పుడు వెండితెరపై అడుగుపెడుతున్నాడు. రెండు గంటల పాటు వినోదాన్ని పంచడానికి 'తుపాకి రాముడు'తో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు' అని అన్నారు విజయ్ దేవరకొండ. బిత్తిరిసత్తి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తుపాకిరాముడు'. రసమయి ఫిల్మ్స్ పతాకంపై శాసనసభ్యుడు, నిర్మాత రసమయి బాలకిషన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రియ కథానాయిక. ఈ చిత్ర టీజర్‌ను గురువారం హైదరాబాద్‌లో విజయ్ దేవరకొండ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా అమ్మానాన్నలు సత్తి వీడియోలు చూస్తూ ఒత్తిడి నుంచి దూరమవుతుంటారు. ఈ చిత్ర టీజర్, పాటలు బాగున్నాయి. తెలంగాణ సంస్కృతి, పల్లె జీవన విధానంతో ముడిపడిన కథ కావడంతో రసమయి బాలకిషన్ ఈ సినిమాను నిర్మించినట్లుగా కనిపిస్తున్నది. ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించి అందరికి మంచి పేరు తెచ్చిపెట్టాలి' అని అన్నారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ 'చక్కటి సాంస్కృతిక విలువలతో కూడిన సినిమా తీయాలన్న ఎన్నో రోజుల ఆకాంక్ష ఈ చిత్రంతో తీరింది. చిత్రసీమకు బంగారుకొండగా మారిన విజయ్ దేవరకొండ మా టీజర్‌ను విడుదలచేయడం ఆనందంగా ఉంది. బిజీ షెడ్యూల్‌లో కూడా తన విలువైన సమయం కేటాయించి మమ్మల్ని ప్రోత్సహించారు. పెద్ద సినిమా, చిన్న సినిమా అనే ఆలోచనను పక్కనపెట్టి మంచి సినిమాను ప్రేక్షకులకు అందించిన పేరు తనకు దక్కుతుందనే ఆలోచనతో దిల్‌రాజు ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాను' అని చెప్పారు. బిత్తిరి సత్తి మాట్లాడుతూ 'ఇతరుల్ని అనుసరించకుండా తనకంటూ తెలుగు చిత్రసీమలో సొంత ట్రెండ్‌ను సృష్టించుకుంటున్నారు విజయ్‌దేవరకొండ. స్టార్ హీరోలు సైతం తన పంథాను అనుసరించేలా చేశారు. ఆయన చేతుల మీదుగా మా సినిమా టీజర్ విడుదలకావడం సంతోషాన్నిచ్చింది' అని అన్నారు. కష్టపడి తాను చేసిన సినిమా ఇదని, కథానాయికగా చక్కటి శుభారంభాన్ని అందిస్తుందనే నమ్మకం ఉందని ప్రియ చెప్పింది.





బసవశంకర్, రాకేష్, లగడపాటి శ్రీధర్, గార్గేయి

# చక్కటి అనుభూతిని పంచింది

'పెళ్లిచూపులు' తర్వాత చక్కటి అనుభూతిని పంచిన చిత్రమిది. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగింది' అని అన్నారు నిర్మాత లగడపాటి శ్రీధర్. రాకేశ్ వర్రె కథానాయకుడిగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'ఎవ్వరికీ చెప్పొద్దు'. బసవ శంకర్ దర్శకుడు. గార్గేయి ఎల్లాప్రగడ కథానాయిక. ఇటీవల ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాను వీక్షించిన నిర్మాత లగడపాటి శ్రీధర్ చిత్రబృందంపై ప్రశంసల్ని కురిపించారు. ఆయన మాట్లాడుతూ 'హీరోగా, నిర్మాతగా రాకేష్ ప్రతిభను చాటుకున్నారు. బసవశంకర్ అర్థవంతంగా సినిమాను తెరకెక్కించిన తీరు బాగున్నది. సినిమాటోగ్రఫీ, సంభాషణలు..ప్రతి విభాగం పనితీరు అద్భుతంగా ఉంది' అని అన్నారు. హీరో రాకేష్ మాట్లాడుతూ 'నెమ్మదిగా వసూళ్లు ప్రారంభమై మౌత్‌టాక్‌తో పాటు సినీ పెద్దల ప్రోత్సాహంతో మా సినిమా హౌస్‌ఫుల్ దిశగా సాగిపోతుండటం ఆనందంగా ఉంది' అని చెప్పారు.







